
అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
మంగళవారం 29-8-2017
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 3 సంచిక : 241 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

డేరా చీఫ్ గుర్మీత్‌కు 20 ఏండ్లు జైలు



రూ.30 లక్షల జరిమానా

ఇద్దరు మహిళలపై లైంగికదాడి కేసులో దోషిగా తేలిన డేరా చీఫ్ గుర్మీత్ రామ్‌రహీమ్‌సింగ్(50)కి సీబీఐ ప్రత్యేక కోర్టు 20 ఏండ్ల జైలుశిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించింది. దీంతోపాటు రూ.30 లక్షల జరిమానా విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో బాధితులు ఇద్దరు కావడంతో ఒక్కో కేసులో పదేండ్ల చొప్పున మొత్తం 20 ఏండ్ల జైలు శిక్షను న్యాయమూర్తి ఖరారు చేశారు. ఒక్కో బాధితురాలికి 14 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి తన తీర్పులో ఆదేశించారు.

ఊహా చిత్రం


- జిల్లా జైలులోనే తాత్కాలిక కోర్టు
- శిక్ష వెల్లడించగానే కుప్పకూలిన డేరా బాబా
- వైద్య పరీక్షల అనంతరం జైలుకు తరలింపు

రోహ్‌తక్: రోహ్‌తక్‌కు సమీపంలోని సునారియాలోని జిల్లా జైలులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కోర్టులో సీబీఐ ప్రత్యేక నాయమూర్తి జగ్దీప్ సింగ్ ఈ తీర్పు చెప్పారు. శిక్ష ఖరారుకు ముందు ఇరుపక్షాల వాదనలను న్యాయమూర్తి విన్నారు. గుర్మీత్‌కు గరిష్టంగా శిక్ష విధించాలని ...2లో

నంద్యాలలో భూమా గెలుపు

27,466 మెజార్టీతో టీడీపీ విజయం

- మూడు రాష్ట్రాల్లో..నాలుగు స్థానాల్లో అధికార పార్టీలదే గెలుపు



న్యూఢిల్లీ: మూడు రాష్ట్రాల్లో జరిగిన నాలుగు ఉపఎన్నికల్లో అధికార పార్టీలే విజయం సాధించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి 27,466 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ఆసక్తిగా చూసిన నంద్యాల ఉప ఎన్నిక ఫలితాల్లో మొత్తం ఓట్లలో టీడీపీకి 56 శాతం ఓట్లు రాగా.. వైసీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. ప్రతి రౌండ్‌లో భూమా అభ్యర్థిత్వానికే ఓటర్లు పట్టం కట్టారు. సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి శిల్పామోహన్ రెడ్డి ఏ దశలోనూ ఆధిక్యాన్ని కనబరచలేకపోయారు. ఇక కాంగ్రెస్ 1,382 ఓట్లకే పరిమితమైంది. నంద్యాల ఉప ఎన్నికను అటు అధికార టీడీపీ, ఇటు విపక్ష వైసీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో.. ఈ ఎన్నిక ఫలితం ఎలా ఉంటుందోనని తెలుగుప్రజలు ఉత్కంఠగా ఎదురు చూశారు.

టీడీపీ సంబురాలు..

నంద్యాలలో విజయంతో తెలుగుదేశం శ్రేణులు సంబురాల్లో మునిగితేలాయి. ఇటు తెలంగాణలోనూ నంద్యాల రిజల్ట్‌పై తెలుగుదేశం పార్టీ కార్యాలయమైన ఎన్టీఆర్ భవన్‌లో టపాసులు కాల్చారు. స్వీట్లు పంచారు. చంద్రబాబు జిందాబాద్, జగన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారని నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విపక్ష నేత జగన్ తన తీరును మార్చుకోవాలని సూచించారు. దీనికి ప్రతిగా ...9లో



(బాబాలు + రాజకీయ నేతలు-నేటి ప్రభుత్వాలు!)

విచారణలో జాప్యమెందుకు?

ఆశారాం కేసులో గుజరాత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: లైంగిక ఆరోపణలను ఎదుర్కొంటున్న ఆశారాం బాపు కేసు విచారణలో జాప్యమెందుకు చేస్తున్నారంటూ గుజరాత్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సాక్షులను ఇప్పటివరకూ ఎందుకు ప్రశ్నించలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై అఫిడవిట్ దాఖలు చేయాలని న్యాయమూర్తులు ఎన్‌వి రామన్న, అమితవ రాయ్‌లతో కూడిన ధర్మాసనం గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేసు విచారణను వేగవంతం చేయాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, న్యాయమూర్తులు డివై చంద్రచూడ్, ఎస్‌కె కౌల్ నేతృత్వంలోని ధర్మాసనం గుజరాత్ ట్రయల్ కోర్టును ఏప్రిల్‌లో ఆదేశించిన విషయం తెలిసింది. 29 మంది ప్రాసిక్యూషన్ సాక్షులను ఇప్పటికే ప్రశ్నించామని, 46 మంది సాక్షుల వాంగ్మూలాన్ని ఇంకా నమోదుచేయాల్సి ఉందని గుజరాత్ ప్రభుత్వం తరఫున కోర్టుకు హాజరైన అడిషనల్ సాలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తొలుత కోర్టుకు చెప్పారు. దీంతో సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అనారోగ్యం కారణంగా తనకు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా కోరుతూ దాఖలుచేసిన పిటిషన్ విచారణ సందర్భంగా బెయిల్‌ను తిరస్కరిస్తూ కోర్టు పై ఆదేశాలు జారీచేసింది. ఆశారాం బాపు రాజస్థాన్ కోర్టులో లైంగికదాడి, గుజరాత్ కోర్టులో అక్రమ నిర్బంధం కేసులను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరి 30 కూడా ఆశారం బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. బెయిల్ ...9లో



సెక్స్ దందాలో బాబాకు బేడీలు

- సాయిబాబా ప్రతిరూపమంటూ భక్తులకు బురిడీ
- ఆశ్రమంపై ఢిల్లీ క్రైం పోలీసుల దాడిలో వెలుగులోకి..

2లో



భువనగిరికి కేవీ మంజూరు

- మొదటి దశలో ఒకటి నుంచి ఐదు వరకు తరగతులు
- 30 రోజుల్లో అడ్మిషన్లు పూర్తి చేయాలి : కేంద్రీయ విద్యాలయ సంఘటన్

2లో



45వ భారత ప్రధాన న్యాయమూర్తి

జస్టిస్ దీపక్‌మిశ్రా

రాష్ట్రపతిభవన్‌లో ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

45వ భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్‌మిశ్రా ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జస్టిస్ దీపక్‌మిశ్రాతో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ...9లో

బెర్కిలీలో జాతివిద్వేష ర్యాలీ

అమెరికా నగరాల్లో వారాంతాల్లో ఉద్రిక్తత

నాజీస్ గో హోం...నో హేట్ నో ఫియర్ ప్లకార్డులు

7లో

అమ్మకు ఎన్నాళ్లీ వేదన పురిటినొప్పులతో తల్లడిల్లిన తల్లిని మంచంపై మోస్తున్న దృశ్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఆదివాసీ గ్రామం సుందరయ్యనగర్‌లో హృదయ విదారక దృశ్యం

చిన్నమ్మ, దినకరన్‌పై వేటు



చెన్నై: తమిళనాడులో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. తమిళనాడు అధికారిక అన్నాడీఎంకే పార్టీ నుంచి చిన్నమ్మ శశికళ, ఆమె మేనల్లుడు దినకరన్‌ను బహిష్కరించారు. సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో వీరిని బహిష్కరిస్తూ అధికారిక నిర్ణయం తీసుకున్నారు. దీంతోపాటు, శశికళ చేపట్టిన నియామ కాలన్నీ చెల్లుబాటు కావని అన్నాడీఎంకే తెలిపింది. దీంతో పాటు అన్నాడీఎంకేకు చెందిన జయ టీవీ, ఎంజీఆర్ స్థాపించిన పత్రికను పార్టీ నియంత్రణలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ...9లో







మాట్లాడుతున్న సురవరం, చిత్రంలో రాఘవులు, చాడ, గోవర్థన్, చెరుపల్లి, తాండ్రకుమార్, డీజీ, జానకిరాములు, రామకృష్ణ, ఝాన్సీ, తదితరులు

నిటి ఆయోగ్ సిఫారసులకు తలొగ్గొద్దు

- విద్యుత్ పంపిణీ ప్రయివేటీకరిస్తే మరిన్ని భారాలు
- అలా చేస్తే మరో ఉద్యమానికి శ్రీకారం: ప్రభుత్వానికి వామపక్షాల హెచ్చరిక
- విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి

9లో

త్వరలోనే విభజనకు పరిష్కారం

- అక్టోబర్ నెలాఖరులోగా కార్పొరేషన్ల విభజన పూర్తి : తెలుగు రాష్ట్రాల సీఎస్‌లకు డీఓపీటీ కార్యదర్శి హామీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర విభజనకు సంబంధించిన సమస్యలను త్వరలోనే పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనీ (డీఓపీటీ) కార్యదర్శి అజయ్ మిట్టల్ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ గ్రాండ్ కాకతీయలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉద్యోగుల విభజన, సెక్షన్ ఆఫీసర్ల కేటాయింపు, తెలంగాణకు చెందిన నాలుగోతరగతి ఉద్యోగులను ఏపీకి కేటాయించడం, ఇరు రాష్ట్రాలకు పరస్పర అంగీకార బదిలీలు, 9, 10 షెడ్యూల్లోని కార్పొరేషన్ల విభజనపై ప్రధానంగా చర్చించినట్టు తెలిసింది. తెలంగాణ చెందిన 40 మంది నాలుగో తరగతి ఉద్యోగులను కమలనాథన్ కమిటీ ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిందని, వారిని తిరిగి తెలంగాణకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సీఎస్ ఎస్పీసింగ్ అజయ్ మిట్టల్‌కు విజ్ఞప్తి చేశారు. ఏపీ స్థానికత ఉన్న సెక్షన్ ఆఫీసర్లను తెలంగాణకు కేటాయించారని, వారిని తిరిగి ఏపీకి కేటాయించాలని కోరారు. ఉద్యోగుల పంపిణీలోనూ ఉద్యోగుల విభజన గందరగోళం నెలకొందన్నారు. ఉద్యోగుల విభజన అంశంలో కమల్‌నాథన్ కమిటీ స్థానికతను పరిగణనలోకి తీసుకోలేదని రెండు రాష్ట్రాలకు చెందిన సీఎస్‌లు తెలిపినట్టు సమాచారం. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు పరస్పర అంగీకారంతో బదిలీలు చేసుకునే అవకాశం కల్పించాలని తెలంగాణ సీఎస్ కోరారు. పరస్పర అంగీకార బదిలీలకు తాము కూడా సిద్ధమేనని, ఈ విషయంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ...9లో

మరో విషాదం

- జార్ఖండ్ ఆస్పత్రిలో నెలరోజుల్లో 52 మంది చిన్నారుల మృతి

రాంచీ : గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి 70మందికిపైగా పసికందులు మృతిచెందిన విషాద ఘటన మరవ కముందే... బీజేపీ పాలిత రాష్ట్రం జార్ఖండ్‌లో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. జంషెడ్‌పూర్ లోని మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో గత నెల రోజులుగా 52మంది శిశువులు మృతిచెందారు. నవజాత, బరువుతక్కువగా పుట్టే శిశువుల కోసం ఆస్పత్రిలో వున్న ఆరు ఇంక్యుబేటర్లలో రెండు మాత్రమే పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఒక ఇంక్యుబేటర్ ఒక శిశువును మాత్రమే ఉంచాలి. కానీ, ఎంజీఎం ఆస్పత్రి లో ఒక్కో ఇంక్యుబేటర్‌లో ముగ్గురు పిల్లలను సైతం ఉంచుతున్నారు. "దీనివల్ల శిశువులు మరింత అనా రోగ్యానికి గురవుతారు, నవజాత శిశువుల మరణా లు కూడా కూడా కలిగించవచ్చు" అని ఆస్పత్రి వైద్య సిబ్బంది ఓ వార్త సంస్థకు తెలిపారు. ఆస్పత్రి రికా ర్డుల ప్రకారం ఈ ఏడాది జూలైలో 546మంది శిశువులు ఆస్పత్రిలో చేరగా, 60మంది మరణించారు. ఆగస్టులో 33నవజాత శిశువులు సహా 41మంది చిన్నారులు మృతిచెందారు. "చాలామంది శిశువులు పోషకాహార లోపం కారణంగా చనిపోయారు. కొల్హాన్, చాయిబస, సెరైకెలా, బెంగాల్, ఒడిషా వంటి ఇతరరాష్ట్రాల్లో జన్మించిన తరువాత పరిస్థితి విష మంగా ఉన్న వారిని ఎంజీఎంలో చేరుస్తున్నారు" సివిల్ సర్జన్ కేపీ మండా చెప్పారు. మరోవైపు ఎం జీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ భర్తేందు భూషణ్ మాట్లాడుతూ.. గత నెలలో నవజాత శిశువులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రిలో చేరారు. ఇందులో ప్రసవసం బంధ సమస్యలు, పోషకాహార పరిస్థితులు కారణం గా 48 మంది చిన్నారులు మరణించారని చెప్పారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు: చిన్నారుల మృతి ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జార్ఖండ్ ప్రభు త్వానికి నోటీసులు జారీచేసింది. మీడియాలో వచ్చిన వార్తలను సుమోటోగా స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆరువారాల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.


ఇంట్లో ఒంటరిగా ఉన్న మైనరుపై...

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని షామిలి జిల్లాలో మరో దారుణం జరిగింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఏడో తరగతి విద్యార్థినిపై అంకిత్ కుమార్ (25) దుర్మార్గానికి ఒడిగట్టినట్టు సర్కిల్ పోలీసు ఆఫీసర్ రాజేశ్ కుమార్ చెప్పారు. అడ్డుకోబోయిన బాలికను అంకిత్ తీవ్రంగా కొట్టినట్టు తెలిపా రు. నిందితుడి బాధితురాలి తల్లిదండ్రులు కేసు నమోదుచేయడంతో అతడిని అరెస్టు చేశామని చెప్పారు.

కార్తిని మరోసారి విచారించిన సీబీఐ

న్యూఢిల్లీ: ఇంద్రాణి ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అక్రమ నగదు లావాదేవీలకు సంబంధించి సీబీఐ మరోసారి కార్తి చిదంబరాన్ని సోమవారం విచారించింది. సీబీఐ ప్రధాన కార్యాలయానికి ఉదయం 11.30 గంటలకు కార్తి చేరుకోగా, మరో ముగ్గురు సిండికేటు భాస్కర్ రామన్, రవి విశ్వనాథన్, మోహన్ రాజేష్‌లను కూడా సీబీఐ ప్రశ్నించింది. ఇంద్రాణి మీడియా గ్రూపుకు ఫారెన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు క్లియరెన్స్ ఇప్పడంపై దర్యాప్తు సంస్థ కార్తిని ప్రశ్నించింది. ఈ వ్యవహారం కార్తి తండ్రి చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో జరిగింది. కార్తీ నేతృత్వంలో పీటర్ ముఖర్జి ద్వారా పరోక్షంగా నిర్వహిస్తున్న ఈ సంస్థలో నిధుల ప్రవాహంపై కార్తిని దర్యాప్తు సంస్థ ప్రశ్నించింది. ఇంద్రాణి కుమార్తె హత్యకేసులో ప్రస్తుతం ముఖర్జీ జైలులో ఉన్నారు. ఆగస్టు 23న కూడా సీబీఐ కార్తిని ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఈ విచారణలపై చిదంబరం మాట్లాడుతూ.. ప్రభుత్వం తన కుమారుడిని వ్యతిరేకంగా సీబీఐ ఇతర దర్యాప్తు సంస్థలను ఉసిగొలుపుతోందన్నారు. ఎఫ్‌ఐపీబీ వందల కేసుల్లో అప్రూవల్ ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.

జమ్ముకాశ్మీర్ గవర్నర్ రాజీనామా ?



శ్రీనగర్: జమ్ముకాశ్మీర్ గవర్నర్‌గా పదినేళ్ల పదవీకాలం ముగియ నున్న నేపథ్యంలో ఎన్‌ఎన్ వొహ్రా తన పదవికి రాజీనామా చేయను న్నారు. ఈ వారం ప్రారంభంలో వొహ్రా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. 2008 జూన్‌లో ఒక పర్యాయం గవర్నర్ పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన మరోమారు ఈపదవిలో కొనసాగుతు న్నారు. జూన్ లోనే ఆయన రిటైర్‌కానున్నట్టు ఊహాగానాలు వెలువడినప్పటికీ ఆచరణ లోకి రాలేదు. అయితే తాజాగా ఆయన రాజీనామా వ్యవహా రంపై హోం మంత్రిత్వశాఖ స్పందిస్తూ, గవర్నర్ కార్యాలయం నుంచి తమకు ఎటువం టి లేఖ అందలేదని పేర్కొంది. వొహ్రా గతంలో హోం, రక్షణ శాఖలకు కార్యదర్శిగా, మాజీ ప్రధాని ఇంద్రకుమార్ గుజ్రాల్‌కు కార్యదర్శిగా పని చేశారు. వొహ్రా(81) పద్మ విభూషణ్ పురస్కారం కూడా అందుకున్నారు.

సెక్స్ దందాలో బాబాకు బేడీలు



న్యూఢిల్లీ : అమాయకత్వం నీడన బాబాల అకృత్యాలు అంతేలేకుండా పోతోంది. గతంలో సెక్స్ రాకెట్ నిర్వహిస్తుండగా..రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు.బెయిల్ పై బయటకొచ్చినా అతని బుద్ధిమారలేదు. మళ్లీ సెక్స్ రాకెట్ దందా మొదలెట్టాడు. తనకు తాను సాయిబాబావు ప్రతిరూపమని చెప్పుకునే ఇచ్ఛాధారి భీమానంద్ మహారాజ్‌ను ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులకు చిక్కాడు.పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...చిత్రకూట్‌లోని చమరౌహా గ్రామానికి చెందిన స్వామి భీమానంద్ తనకు తాను ఆధ్యాత్మిక గురువుగా ప్రకటించుకున్నాడు. ఖాన్‌పూర్ ప్రాంతంలో ఉన్న తన నివాసాన్ని మందిరంగా మార్చాడు. పాములా మెలికలు తిరుగుతూ పూజలు చేసేవాడు. భక్తుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఈ బాబా బరితెగించేవాడు. ఆశ్రమానికి వచ్చిన భక్తులను మోసం చేసేవాడు. భయపెట్టి..బెదిరించి వారితోనే సెక్స్ రాకెట్ నిర్వహించేవాడని పోలీసులు తెలిపారు. మరికొందరు ఆర్థిక కారణాలతో బాబాను ఆశ్రయిస్తే వారిని కూడా ఈ రొంపిలోకి దింపేవని సమాచారం. వాస్తవానికి ఢిల్లీలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో ఉద్యోగం చేసేవాడు. తనకు తాను ఇచ్ఛాదారి బాబాగా ప్రకటించుకున్నాక.. అతను ఆర్థిక సామ్రాజ్యాన్ని విస్తరించాడు. 12ఏండ్ల కాలంలో కోట్లాది రూపాయలు కూడబెట్టాడు. 2015లో స్వామికి చెందిన కొన్ని స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. 13 బ్యాంకుల్లో ఉన్న అతని ఖాతాలను స్తంభింప చేసింది. 90లక్షల రూపాయలు సీజ్ చేసింది. చిత్రకూట్ ప్రాంతంలోని మూడంతస్తుల భవనంలో ఆధ్యాత్మిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. ఈ భవనాన్ని మాత్రమే ఎటాచ్‌మెంట్ నుంచి మినహాయించింది. దీన్ని అడ్డాగా చేసుకుని సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్నట్టు గుర్తించిన క్రైం పోలీసులు కటకటాలవెనక్కి నెట్టారు.



డేరా చీఫ్ గుర్మీత్‌కు 20 ఏండ్లు జైలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాసిక్యూషన్ వాదించగా,ప్రజల కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన గుర్మీత్ సామాజిక కార్యకర్త అయినందున శిక్ష తగ్గించాలని ఆయన తరపు న్యాయవాది విన్నవించారు. ఈ సందర్భంగా గుర్మీత్ చేతులు జోడించి శిక్షను తగ్గించాలని న్యాయమూర్తిని వేడుకుంటూ కన్నీళ్లు కార్చినట్టు తెలుస్తోంది. శిక్ష ఖరారు కాగానే గుర్మీత్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి జైలు గదికి తరలించారు. జైలుశిక్షను ప్రకటించగానే గుర్మీత్ కుప్ప కూలిపోగా, ఆయన ఆరోగ్యంగానే ఉన్నారా..? లేదా..? అనేది తేల్చేందుకే వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో గుర్మీత్ తనకు టీ కావాలని అడుగగా జైలు సిబ్బంది నిరాకరించారు. నేరస్తుడికి వీఐపీ మర్యాదలేమిటన్న విమర్శల నేపథ్యంలో అధికారులు జాగ్రత్తపడ్డారు. సమస్యేమీ లేదని డాక్టర్లు చెప్పడంతో గుర్మీత్‌కు ఖైదీ నెంబర్ 1997 కేటాయించి జైలు గదికి తరలించారు. ఇద్దరు మహిళలపై లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్‌ను పంచకులలోని సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ నెల 25న దోషిగా నిర్ధారించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నేండ్లు శిక్ష విధించాలన్న అంశాన్ని ఆరోజు వాయిదా వేసిన న్యాయమూర్తి సోమవారం నిర్ణయించారు. గుర్మీత్‌ను దోషిగా కోర్టు వెల్లడించిన రోజు జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో శిక్ష ఖరారు కోసం విచారణను జైలులోనే చేపట్టాల్సి వచ్చింది. గుర్మీత్‌కు శిక్ష ఖరారు చేసే సమయంలో జైలు వెలుపల భారీ సంఖ్యలో భద్రతా దళాలను మోహరించారు. డేరా బాబా అనుచరులు జైలు బయట గుమి కూడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. జైలుకు 10 కి.మీ.పరిధిలో నిషేధాజ్ఞలు విధించి అటువైపు ఎవరూ వెళ్లకుండా భద్రతా దళాలను కాపలా ఉంచారు. హర్యానా, పంజాబ్, ఢిల్లీలోని కీలక ప్రాంతాల్లోనూ భారీగా బలగాలను మోహరించారు.



గుర్మీత్‌కు శిక్ష ఖరారైన క్రమంలో ముఖ్యాంశాలు



- సిబిఐ కోర్టు శిక్ష ఖరారు చేయనున్న నేపథ్యంలో డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయమున్న సిర్సాలో కర్ఫ్యూ విధించారు
- గుర్మీత్‌ను దోషిగా నిర్ధారిస్తూ శు క్రవారం కోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనల్లో మృతుల సంఖ్య 38కి పెరిగిందని హర్యానా డీజీపీ బిఎస్ సంధూ తెలిపారు.
- సునారియా జైలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టు రూంకు సీబీఐ న్యాయమూర్తి జగదీప్ సింగ్ చేరుకునేందుకు జైలు సమీపంలో ప్రత్యేక హెలీపాడ్‌ను ఏర్పాటు చేశారు.
- రోహ్‌తక్ శివార్లలోని సునారియా జైలు వద్ద భద్రతా బలగాలు గస్తీ నిర్వహించాయి. కర్ఫ్యూ సమయంలో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులను అధికారులు జారీ చేశారు.
- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలూ తీసుకున్నట్టు రోహ్‌తక్ డిప్యూటీ కమిషనర్ అతుల్ కుమార్ ద్వివేది తెలిపారు
- హర్యానాలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ అదుపులోనే ఉందని కేంద్ర హోం శాఖ ప్రతినిధి తెలిపారు. ఢిల్లీ పోలీసులు హర్యానాలో పూర్తి అప్రమత్తంగా ఉన్నారని ఆయన చెప్పారు.
- సోనేపట్‌లోని బాలగఢ్‌లో ఉన్న డేరా కేంద్రం నుంచి కర్రలు, ఇనుప రాడ్లతో సహా 100కు పైగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు రోహ్‌తక్ ఐజి తెలిపారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలిపారు.
- సిర్సాలో కర్ఫ్యూ కొనసాగుతున్నదని, సాధారణ పరిస్థితులు నెలకొల్పడమే తమ ప్రాధాన్యతని, పాఠశాలలు, కళాశాలలు, ఇంటర్నెట్ సర్వీస్‌లను మూసివేసినట్టు హర్యానా డీజీపీ బిఎస్ సంధూ తెలిపారు.
- మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తి హెలికాప్టర్‌లో రోహ్‌తక్‌లోని సునారియా జైలుకు చేరుకున్నారు.
- ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టు రూంలో శిక్ష ప్రకటించడానికి ముందు జరిగిన వాదోపవాదాలలో పదేండ్లు జైలు శిక్ష విధించాలని సీబీఐ కోరగా, గుర్మీత్‌పై దయ చూపాలని డిఫెన్స్ న్యాయవాది అభ్యర్థించారు.
- మధ్యాహ్నం 3.30 గంటలకు గుర్మీత్‌కు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.
- తీర్పు వెలువడిన తరువాత సాధారణ పరిస్థితులు కొనసాగాయని హర్యానా ప్రభుత్వ సమాచార, ప్రజా సంబంధాల విభాగ డిప్యూటి డైరెక్టర్ సతీష్ మెహ్రా ప్రకటించారు. పరిస్థితి అదుపులోనే ఉందన్నారు.
- సాయంత్రం 4.30 గంటల సమయంలో హర్యానా ముఖ్యమంత్రి ఖట్టర్ తన నివాసంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సీనియర్ రాష్ట్ర అధికారులు, పార్టీ నాయకులు, మంత్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఆమె నాతో జైల్లో ఉండాలి: గుర్మీత్



రోహతక్: లైంగికదాడి కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ పిటిషన్ వేశారు. జైలులో తనతో పాటు తన కుమార్తె హనీప్రీత్ ఇన్సాన్ కూడా ఉండాలని గుర్మీత్ పిటిషన్ దాఖలు చేశారు. ఇద్దరం ఒకే జైల్లో ఉండాలనుకుంటున్నామని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు.దీనికి సీబీఐ న్యాయస్థానం నిరాకరించింది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని వివరించారు.ఇందులో తాము ఎలాంటి జోక్యం చేసుకోమని కోర్టు స్పష్టం చేసింది. గుర్మీత్‌కి నడుము నొప్పి, మైగ్రేన్ ఉన్నదని ఆయనకి తరచూ ఆక్యూప్రెజర్ చేస్తుండాలని హనీప్రీత్ న్యాయస్థానం దృష్టికి తెచ్చారు.. ఈ విషయంలో.. రోహ్‌తక్ జైలు అధికారులనూ బాబా బెదిరించినట్టు తెలిసింది.హనీప్రీత్‌ని తనతో పాటు జైల్లో ఉండనివ్వకపోతే జైలు అధికారులను వదలని వార్నింగ్ ఇచ్చారట.వివాహితురాలైన హనీప్రీత్‌ని గుర్మీత్ 2009లో దత్తత తీసుకున్నారు. ఆమె అసలు పేరు ప్రియాంక తనేజా. స్వస్థలం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫతేపూర్. అత్తింటి . కట్నం వేధింపులు భరించలేక.. హనీప్రీత్ గుర్మీత్‌ను ఆశ్రయించారు. హనీని గుర్మీత్ దత్తత తీసుకున్నారు. తాను నటించే సినిమాల్లోనూ హనీప్రీత్‌కు అవకాశాలు ఇచ్చారు. బయట దర్జాగా బతికినప్పుడు తోడుగా ఉన్న దత్తత తనయను జైల్లో కూడా తోడుగా ఉండాలని గుర్మీత్ కోరుతున్నారు. దీనికి సీబీఐ కోర్టు నిరాకరించినా..బీజేపీ పాలిత రాష్ట్రమైన హర్యానా సర్కారు బాబాకు ఈ వెసులుబాటు కల్పిస్తుందా..లేదా అన్నదానిపై చర్చించుకుంటున్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

- కార్మికుల జీతాలు పెంచేందుకు సర్కారు అంగీకారం
- 7న మరోసారి కార్మిక సంఘాల జేఏసీతో చర్చలు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచేందుకు ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది. దీంతో మంగళ, బుధవారాల్లో నిర్వహించే రెండురోజుల టోకెన్ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు కార్మిక సంఘాలు (సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఏఎఫ్‌టీయూ, బీఎంఎస్, హెచ్ఎంఎస్) ప్రకటించాయి. అయితే వేతనాల చెల్లింపు విధివిధానాలపై స్పష్టత రాకపోవడంతో సెప్టెంబర్ 7న మరోసారి చర్చించనున్నారు. సోమవారం కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులతో మున్సిపల్ శాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్ సచివాలయంలో చర్చలు జరిపారు. చర్చలు సానుకూలంగా ముగిశాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు ప్రతిపా దించిన 15 డిమాండ్ల పరిష్కారానికి నవీన్‌మిట్టల్ అంగీకారం తెలిపారు. వేతనాల పెంపునకు అంగీకరించారు. జీవోనెంబర్ 14 అమలుకు ఇచ్చే ఉత్తర్వుల్లో ఎలాంటి షరతులు పెట్టకూడదనీ, స్కిల్డ్, సెమిస్కిల్డ్, హైస్కిల్డ్ వేతనాలు వేర్వేరుగా ఇవ్వాలని కార్మిక సంఘాలు కోరాయి. మున్సిపాలిటీల్లో కాంట్రాక్టర్ల వ్యవస్థను రద్దు చేయాలనీ, ప్రమాదంలో చనిపోయినా, వృద్ధాప్యంలో పనిచేయలేని వారిస్థానంలో వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలనీ, ప్రతి కార్మికునికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని జేఏసీ నాయకులు కోరారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంలో కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలనీ, కార్మికుల దహన సంస్కారాల ఖర్చులకు రూ.10వేల నుంచి రూ.20వేలు ఇవ్వాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, రక్షణ పరికరాలను ఇవ్వాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులకు 6, 12, 24 స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, సర్వీస్‌బుక్ అప్‌డేట్ చేయాలన్నారు. కార్మిక సంఘాలు పెట్టిన డిమాండ్లను పరిష్కరించేందుకు నవీన్‌మిట్టల్ అంగీకారం తెలిపారు. ఏయే క్యాటగిరికు ఎంత పెంచాలనే దాంట్లో నిర్దిష్ట నిర్ణయానికి రాలేదు ఈ సమావేశంలో డిఎంఎ టికె శ్రీదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీలేష్ కుమార్‌తో పాటు కార్మిక సంఘాల జేఏసీ నేతలు పాలడుగు భాస్కర్,కమర్‌అలీ (సీఐటీయూ), ఏసు రత్నం (ఏఐటీయూసీ), రెబ్బ రామారావు(హెచ్ఎంఎస్), శంకర్ (బీఎంఎస్), కృష్ణ(ఐఎఫ్‌టీయూ), షరీఫ్ (ఐఎన్‌టీ యూసీ), ఎంకే బోస్,శివకుమార్(టీఎన్‌టీయూసీ)తదితరులు పాల్గొన్నారు.

బాబాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుభాషిణి అలీ
- డేరా బాబా ఆగడాలు శృతిమించాయి
- మహిళలకు సాయుధ పోరాటమే స్ఫూర్తి.. : మల్లు స్వరాజ్యం

నవతెలంగాణ - కూకట్‌పల్లి



బాబాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుభాషి ణి అలీ అన్నారు. హైదరాబాద్ ప్రగతినగర్‌లోని మల్టీపర్పస్ హాల్‌లో మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డేరా బాబాకు ఆరుకోట్ల మంది భక్తులు ఉన్నారన్నారు. ఆయన భక్తి పేరుతో కోట్లాది రూపాయలను అక్రమంగా సంపాదించారని, ప్రజల్లో మూఢ విశ్వాసాలను పెంచి మోసం చేస్తున్నాడని అన్నారు. అనేకమందిపై లైంగిక వేధింపులతో పాటు లైంగిక దాడులు చేశాడని తెలిపారు. దీంతో అనేక కుటుంబాలు చెల్లాచెదరు కావడమే కాకుం డా, చాలామంది ఆత్మహత్య చేసుకున్నారని ఆందో ళన వ్యక్తం చేశారు. ఆయన ఆగడాలతో విసిగిన మహిళలు ఐద్వాతో చెప్పగా, వారికి అండగా నిలిచి, పోరాటాలు నిర్వహించి కేసులు నమోదు చేయించామన్నారు. తద్వారా తప్పనిసరి పరిస్థితి లో ప్రభుత్వం ఆయనను కోర్టుకు అప్పగించింద న్నారు. దీంతో అనుచరులు పంజాబ్, హర్యానా, ఢిల్లీల్లో పెద్దఎత్తున అల్లర్లు సృష్టించి 38 మందిని హత్య చేయడంతోపాటు అనేకమందిని గాయాల పాలు చేశారని తెలిపారు. భారీఎత్తున ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. అయినప్పటికీ ఆ బాబాకు ప్రభుత్వాలు మద్దతునిచ్చాయని విమర్శిం చారు. అనేక ప్రాంతాల్లో బాబా అనుచరులు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

సీనియర్ నాయకురాలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం మాట్లాడుతూ.. భూమి, భుక్తి, ప్రజాస్వామ్య విము క్తికోసం జరిగిన సాయుధ పోరాటంలో మహిళలు కీలకపాత్ర పోషించారన్నారు. అదే స్ఫూర్తితో నేడు మహిళా లోకం ఏకం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమావతి మాట్లాడుతూ.. ప్రగతినగర్‌లో అక్టోబర్ 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్ర ఐద్వా మహాసభకు పెద్దఎత్తున మహిళలను సమీకరించాలని సూచించారు. అందుకోసం ప్రతి మహిళా ప్రచార బాధ్యతలు చేప ట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆశాలత, జిల్లా అధ్యక్షురాలు సృజన, ప్రధాన కార్యదర్శి వినోదిని, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ప్రగతినగర్ సర్పంచ్ శాంతకుమారి, ప్రగతినగర్ అధ్యక్షురాలు లక్ష్మీకుమారి, ప్రధాన కార్యదర్శి రోజారాణి పాల్గొన్నారు.

పదో పీఆర్‌సీ ప్రకారం వేతనాలివ్వాలి

- కేజీబీవీ ఉపాధ్యాయుల ధర్నాలు
- రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

నవతెలంగాణ- యంత్రాంగం

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల ఉపాధ్యాయు లు, సిబ్బందికి పదో పీఆర్‌సీ ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేశారు. ఇతర టీచర్లతో సమానంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎ.నర్సిరెడ్డి, చావ రవి, ప్రొఫెసర్ హరగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. యాదాద్రి జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నాలో ఎ. నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యా య, ఉద్యోగ సిబ్బందిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఆమరవీరుల స్థూపం వద్ద, భూ పాలపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అధికారు లకు వినతిపత్రం అందించారు. ఇతర ఉపాధ్యాయులతో సమానంగా అన్ని రకాల సెలవులకు అర్హత కల్పించాలని భూపాలపల్లిలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ అవారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల ఎదుట ధర్నాలో ప్రొఫెసర్ హరగోపాల్ ప్రసంగిం చారు. తెలంగాణ ఉద్యమంలో మహిళలు కూడా ముందు వరుసలో ఉన్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన తర్వాత కేజీబీవీ విద్యాసంస్థలతోపాటు, ఎస్సీ, ఎస్టీ బీసీ గురుకులాల్లో మహిళలను తీసుకుంటున్నా, ఉద్యోగ భద్రత లేకుండా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ పేర్లతో తక్కువ వేతనాలు ఇచ్చి వెట్టిచాకిరీ చేయించుకుంటోందని అన్నారు. ఉపాధ్యాయురాళ్లంతా ఐక్యంగా ఉద్యమించాలని సూచించా రు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి కిష్టయ్య మాట్లా డుతూ.. కేజీబీవీ ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.


మహబూబ్‌నగర్ ధర్నాలో ప్రసంగిస్తున్న హరగోపాల్

భద్రాద్రి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వర్షాన్ని కూడా లెక్కచేయకుండా జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది కేజీబీవీ సిబ్బంది తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. భారీ వర్షంలో ర్యాలీ నిర్వహించారు. "కవితక్కా మా గోడు వినక్కా..." అంటూ నినాదాలు చేశారు. అనంత రం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందచేశారు.

జగిత్యాల జిల్లాలో యూటీఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు తోట రాజేశం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ఆందోళన చేశారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. పెద్దపలి జిల్లాలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జీ.జ్యోతి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇనుగుర్తి గంగాధర్, గోల్కొండ శ్రీధర్ అధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు డీవైఎఫ్ఐ, టీడీ పీ, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. నిర్మల్ కలెక్టరేట్, నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంత రం ఇన్‌చార్జి కలెక్టర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు.

సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. మెదక్‌లో డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నాలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట కూడా ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాకలెక్టర్ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీపార్కు ధర్నాచౌక్ వద్ద ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాకు పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

భువనగిరికి కేవీ మంజూరు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. ఈ మేరకు కేంద్రీయ విద్యాలయ సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఈ ప్రభాకర్ సోమవారం ఓ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం (2017-18) నుంచే ఈ విద్యాలయం పని చేయనుంది. మొదటి దశలో ఒకటి నుంచి ఐదు వరకు తరగతులు నిర్వహించనున్నారు. భవిష్యత్తులో సాధ్యాసాధ్యాలు పరిశీలించిన అనంతరం తరగతుల పెంపుపై నిర్ణయం తీసుకోనున్నట్టు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ కేంద్రీయ విద్యాలయానికి 30 రోజుల్లో అడ్మిషన్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ విద్యాలయం యాదాద్రి భువనగిరి జిల్లా.. భువనగిరిలోని బంజారాహిల్స్‌లోగల ఎఎల్ ఎన్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద ప్రారంభంకానుంది. దేశవ్యాప్తంగా మొత్తం 50 కేంద్రీయ విద్యాలయా లను ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో 50 విద్యాలయాల్లో తెలంగాణకు ఒకటి దక్కింది. కాగా భువనగిరికి కేంద్రీయ విద్యాలయం మంజూరవడంపై ఎంపీ బూర నర్సయ్యగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

నవంబర్ 4,5,6 తేదీల్లో

మధురైలో డీఎస్ఎంఎం జాతీయ మహాసభలు

మోడీ పాలనలో దళితులపై పెరిగిన దాడులు

- భవిష్యత్‌లో దేశవ్యాప్త ఉద్యమం
- రూపన్‌వాలా కమిషన్ నివేదికను రద్దు చేయాలి
- డీఎస్ఎంఎం నేతలు శ్రీనివాసరావు, రాధాకృష్ణన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమిళనాడులోని మధురైలో 2017, నవంబర్ 4,5,6 తేదీల్లో దళిత్ శోషణ్ ముక్తిమంచ్ (డీఎస్ఎంఎం) జాతీయ రెండో మహాసభలు జరగనున్నాయి. డీఎస్ఎంఎం జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైన డీఎస్ఎంఎం జాతీయ సమావేశాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్ఎంఎం జాతీయ కన్వీనర్ కె రాధాకృష్ణన్ మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక అనేక కార్యక్రమాలు, పథకాల ద్వారా కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఇంకా దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని చెప్పారు. మోడీ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని అన్నారు. చాతుర్వర్ణ వ్యవస్థను తేవాలని, కులవ్యవస్థను కొనసాగించాలని బీజేపీ చూస్తోందన్నారు. దళితులపై జరుగుతున్న హింస, దాడి, వివక్షకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని అన్నారు. డీఎస్ఎంఎం జాతీయ సమన్వయకర్త వి శ్రీనివాసరావు మాట్లాడుతూ గో సంరక్షణ, గౌరవం పేరుతో దళితులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా హిందుత్వ శక్తులు పేట్రేగిపోతున్నాయని విమర్శించారు. ఆవును చంపారనే కారణంతో బెంగాల్‌లో ఆదివారం ఇద్దరినీ చంపారని చెప్పారు. తెలంగాణలో గౌరవ హత్యల పేరుతో 13 మందిని చంపారని గుర్తు చేశారు. దళితులు మురికిగా ఉంటారని ఏపీ మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యానించడం అన్యాయమని అన్నారు. దళితులకు రక్షణ కల్పించి, వారి అభివృద్ధికి పాటుపడాల్సిందిపోయి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని విమర్శించారు. హెచ్‌సీయూలో రోహిత్ వేముల మృతికి కారకులైన వారిపై కేసు పెట్టకపోగా, దేశంలోనే తొలిసారి నిందితులే తమకు తాము రూపన్‌వాలా కమిషన్‌ను నియమించుకొని వారికి అనుకూలంగా నివేదిక వచ్చేలా చూసుకున్నారని అన్నారు. రూపన్‌వాలా కమిషన్ నివేదికను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. రోహిత్ మృతిపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో స్వతంత్రంగా విచారణ జరపాలని కోరారు. కలెక్టర్ నివేదిక ఆధారంగా రోహిత్‌ను ఎస్సీగానే గుర్తించాలని డిమాండ్ చేశారు. నిందితులు ఎంతటివారైనా, కేంద్ర మంత్రులైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల్లోనూ వివక్ష కొనసాగుతోందని చెప్పారు. సబ్‌ప్లాన్‌ను కేంద్రం ఎత్తేసిందని విమర్శించారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం లేదన్నారు. రూ.9 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. హక్కులను కాలరాస్తూ దళితుల ఉద్ధరణ పనిచేస్తున్నామని చెప్పడం మోసం చేయడం తప్ప మరొకటి కాదని ఎద్దేవా చేశారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని చెప్పారు. డీఎస్ఎంఎంతోపాటు అనేక దళిత సంఘాలతో కలిపి ప్రకాశ్ అంబేద్కర్ కన్వీనర్‌గా దళిత్ స్వాభిమాన్ సంఘర్ష్ ఏర్పడిందన్నారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లకు చటబద్ధం చేస్తూ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. సాంఘిక బహిష్కరణలు నిషేధిస్తూ కొత్త చట్టం తేవాలని కోరారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. డీఎస్ఎంఎం జాతీయ కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ, మమత మాట్లాడుతూ కులదురహంకార హత్యలను నిషేధిస్తూ ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె భాస్కర్, ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గ్రానైట్‌పై జీఎస్టీ తగ్గించే బాధ్యత నాదే

- బీజేపీ ఎంఎల్ఏ ఎంవీఎస్ ప్రభాకర్ హామీ
- గ్రానైట్ యజమానుల ఆమరణ దీక్ష విరమణ

నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

గ్రానైట్‌పై జీఎస్టీ తగ్గించే బాధ్యత తమదేనని బీజేపీ ఎంఎల్ఏ ఎంవీఎస్ ప్రభాకర్, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ధర్మారావు అన్నారు. బీజేపీ నాయకుల హామీ మేరకు గత మూడు రోజులుగా ఖమ్మంలో గ్రానైట్ అసోసియేషన్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షలు సోమవారం రాత్రి విరమించారు. ఇప్పటికే సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, టీడీపీ నాయకులు పూర్తి సంఘీభావం తెలిపిన విషయం తెలిసిందే. దీక్షలో పాల్గొన్న తొమ్మిది మంది సభ్యుల ఆరోగ్యం క్షీణించడంతో కొంత ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం బీజేపీ ఎమ్మెల్యే ఎంవీఎస్ఎస్ ప్రభాకర్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ధర్మారావు ఆమరణ నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి గ్రానైట్ యజమానులతో చర్చించారు. తాము కేంద్రంతో చర్చిస్తామని, ఇందుకు తాము హామీ ఇస్తామని తెలిపారు. దీక్షలో పాల్గొన్న వారు తమపై నమ్మకం ఉంచి దీక్షను విరమించాలని కోరారు. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఇందుకు సంబంధించి సానుకూల నిర్ణయం జరిగేలా బీజేపీ చొరవ తీసుకుంటుందని ఎమ్మెల్యే ప్రభాకర్ హామీ ఇచ్చారు. గ్రానైట్‌పై పన్ను తగ్గించాలన్న డిమాండ్‌కు సంబంధించి కౌన్సిల్ మీటింగ్ ఎజెండాలో కూడా చేర్చారని అన్నారు. ఆమరణ నిరాహారదీక్షల గురించి బీజేపీ అధిష్టానం ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంగా ఇక్కడికి పంపినందుకే వచ్చామని తెలిపారు. అనంతరం దీక్ష చేస్తున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఎంఎల్ఏ ప్రభాకర్ వెంట ఆ పార్టీ బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉదయ్ ప్రతాప్, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర క్వారీస్ అసోసియేషన్ అధ్యక్షులు గాయత్రి రవి ఉన్నారు. ఈ సందర్భంగా గ్రానైట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి మధుసూధన్‌రావు, వేముల రవికుమార్, కోశాధికారి వజినేపల్లి శ్రీనివాసరావు, తమ్మినేని వెంకటరావు మాట్లాడుతూ తమ ఉద్యమంలో పాల్గొన్న నాటి నుంచి దీక్ష విరమించే వరకూ సహకరించిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మీడియా ప్రతినిధులకు, ప్రజాసంఘాలకు, గ్రానైట్ అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రంపై రాజకీయ ఒత్తిడి పెంచాలి : పలువురి సంఘీభావం

గ్రానైట్‌పై విధించిన జీఎస్టీ 28శాతానికి వ్యతిరేంగా కేంద్రంపై రాజకీయ ఒత్తిడి పెంచాలని ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంఎల్ఏలు సండ్ర వెంకటవీరయ్య, పువ్వాడ అజయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. జీఎస్టీకి వ్యతిరేకంగా గ్రానైట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షలను తొలుత వారు సందర్శించి సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పార్లమెంట్‌లో గ్రానైట్ సమస్యపై మాట్లాడినా కేంద్రం స్పందించలేదని, సీఎం కేసీఆర్‌తో మాట్లాడి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు సత్తుపల్లి ఎంఎల్ఏ సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం విధించిన 28శాతం జీఎస్టీ పన్నును తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకపోతే పరిశ్రమలు మూతపడే పరిస్థితి ఏర్పడుతుం దన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని వెనుకబడిన జిల్లాల్లో లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమపై కేంద్రం విధించిన జీఎస్టీని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఖమ్మం ఎంఎల్ఏ పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసిందని, సెప్టెంబర్ 9న జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై మాట్లాడుతుందన్నారు.

కేసీఆర్ మరో డేరా బాబా

- నిత్యం అబద్ధాలు చెప్పే కోతల రాయుడు
- మాయ మాటలతో ప్రజలను వంచించాడు
- మూడున్నరేండ్లలో చేసిందేమీ లేదు : రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ - కూకట్‌పల్లి

నిత్యం అబద్దాలు చెబుతూ సీఎం కేసీఆర్ కోతల రాయుడుగానే మిగిలారని, ఆయన మరో డేరా బాబా అని టీటీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాప్ వద్ద రెండురోజుల కిందట టీడీపీ దిమ్మె కూల్చేసిన స్థలంలోనే మళ్లీ జెండా ఏర్పాటుచేసి ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ మాయమాటలతో ప్రజలను వంచించడమే తప్ప మూడున్నరేండ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. ఆయన చెప్పినట్టుగా కూకట్‌పల్లి న్యూయార్క్ కాలేదని, ఉస్మానియా 30 అంతస్తుల ఆస్పత్రి నిర్మించలేదని, మెట్రో ఇప్పటికీ మొండి గోడలుగా మిగిలిందని, కొబ్బరి నీళ్లుగా చేస్తానన్న హుస్సేన్‌సాగర్ మరింత దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. నూటికి నూరు శాతం అబద్దాలు చెబుతూ కేసీఆర్ కోతల రాయుడుగానే మిగిలారని విమర్శించారు. నిజాంపేట్‌లో పేదల ఇండ్లు కూల్చిన కేసీఆర్‌కు.. మంత్రి మహేందర్‌రెడ్డి హిమాయత్ సాగర్‌లో నిర్మించుకున్న గెస్ట్‌హౌస్, 111 జీఓ ఉండగా కేటీఆర్ 25 ఎకరాల్లో నిర్మించుకున్న గెస్ట్‌హౌస్‌లను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తే కేసీఆర్ లాగు విప్పి కొడతామని హెచ్చరించారు. కేసీఆర్ మాటలు విని నేరేళ్లలో దళితులపై దాడిచేసిన పోలీసులు శంకరగిరి మన్యాలు పట్టారని, ఇక్కడ కూడా వారి మాటలు విని జెండా కూల్చిన దోషులను విస్మరించొద్దని అన్నారు. ఒకవేళ పోలీసులు అదే తరహాలో వ్యవహరిస్తే కూల్చిన వారికి తమ కార్యకర్తలు తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఎమ్మెల్యేను చేసిన టీడీపీ జెండానే క్రిష్ణారావు కూల్చేయించడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నానని చెప్పిన క్రిష్ణారావు మూడున్నరేండ్లలో కూకట్‌పల్లికి ఏమి చేశాడో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రానున్న ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధిచెబుతారని అన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ లేకుంటే రాజకీయ భవిష్యత్ లేని క్రిష్ణారావుకు జెండా కూల్చే అధికారం ఎక్కడిదని ప్రశ్నించారు. అతని అవినీతి, అక్రమాలు, లంచగొండితనాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్తామన్నారు.



అంగన్‌వాడీలకు చౌకదుకాణాల నుంచి రేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సెప్టెంబర్ నుంచి చౌక దుకాణాల ద్వారా రేషన్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు స్థానికంగా ఉన్న స్టాక్ పాయింట్ డిపో రేషన్ సరఫరా చేస్తున్నారు. ఈ విధానాన్ని రద్దు చేస్తున్నట్టు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. సోమవారం తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు అంగన్‌వాడీ టీచర్లకు నిర్దేశించిన స్టాక్ పాయింట్ నుంచి పిల్లలకు అందించే రైస్ ట్రాన్స్‌పోర్టు అవుతున్నదని, అలాకాకుండా స్థానికంగానే వాటిని ఇవ్వడం ద్వారా వారికి కావాల్సినంత రేషన్ ఇవ్వడంతోపాటు టైమ్ కూడా ఆదా అవుతుందని మంత్రి చెప్పారు. అలాగే అంగన్‌వాడీ టీచర్ బయోమెట్రిక్ ఆధారంగా వారికి రేషన్ అందిస్తారని, ఆయా కేంద్రాల్లో ఉండే పిల్లల సంఖ్య మేరకు రేషన్ అందిస్తామని చెప్పారు. అంతేకాకుండా కేంద్రాల్లో పనిచేస్తున్న 60 ఏండ్లు నిండిన టీచర్లు, ఆయాలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద డబ్బులు అందిస్తామన్నారు. టీచర్లకు రూ.60 వేలు, ఆయాలకు రూ.30 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఇక కేంద్రాల్లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించగా, ఆ ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భగీరథ పనుల పరిశీలనకు మధ్యప్రదేశ్ బృందం

- నేడు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిషన్ భగీరథ ప్రాజెక్టుపై దేశంలోని పలు రాష్ట్రాలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్రలు తమ అధికారుల బృందాలను తెలంగాణకు పంపించాయి. తాజాగా మధ్యప్రదేశ్‌కు చెందిన 'జల్ నిగమ్ మర్యాదిత్ శాఖ' ఇంజినీర్లు మంగళవారం రాష్ట్రానికి రానున్నారు. మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఆ బందానికి ఉదయం పదకొండు గంటలకు ఎర్రమంజిల్ ఆర్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర కార్యాలయంలో మిషన్ భగీరథ ప్రాజెక్టు స్వరూపం, లక్ష్యాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ బందం క్షేత్రస్థాయి పర్యటనకు సైతం వెళ్లనుంది. బుధవారం మెదక్ జిల్లా సింగూరు, గురువారం మహబూబ్‌నగర్ జిల్లా ఎల్లూరులో సాగుతున్న భగీరథ పనుల పురోగతిని మధ్యప్రదేశ్ ఇంజినీర్ల బృందం, అధికారులు పరిశీలిస్తారు. అధ్యయనం చేస్తారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారు అయింది. భగీరథ కార్పొరేషన్ అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు.

స్వేచ్ఛ అంటే ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి లభించిన లైసెన్సు కాదు. – మహాత్మాగాంధీ


సంపాదకీయం

నేటి భారతం

హర్యానా, పంజాబ్ రాష్ట్రాలు అట్టుడికిపోయాయి. క్షణాల్లో ఈ దావానలం ఢిల్లీ సహా యూపీ, రాజస్థాన్‌లకు అంటుకుంది. వెరసి విధ్వంసం వికృతహేల చేసింది... ఎందుకీ విపరీతం...!? ఒక నిజం నిరూపితమైనందుకు..! ఇందులో దోషమేముంది... నిజం నిరూపణైతే మంచిదే కదా అనిపిస్తుంది ఎవరికైనా.. కానీ నేటి పరిస్థితుల్లో నిజాన్ని రహస్యంగా చెప్పడమే కష్టం... అటువంటిది బహిరంగంగా చెబితే ఎలా? అవి పత్రికలైతేనేమీ, ప్రసార మాధ్యమాలైతేనేమీ చివరికి న్యాయస్థానాలయితేనేమి? సమస్త పాలనా వ్యవస్థలు అపహాస్యం చేయబడతాయి..! ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ కరువవుతుంది..! డేరా బాబా గుర్మీత్‌సింగ్ ఉదంతంలో చెలరేగిన హింసే ఇందుకు నిదర్శనం... ఇదీ నేటి భారతం..!

డేరా వర్గం ఓట్లు అటు కేంద్రంలోనూ, ఇటు హర్యానా లోనూ బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడేందుకు తోడ్పడ్డాయి. అంతే సహజంగా డేరా బాబా రక్షణకు ఈ ప్రభుత్వాలు తోడ్పడుతున్నాయి. మధ్యలో ప్రజలేమైతేనేమీ.., న్యాయం ఏమైతేనేమీ.., ప్రజాస్వామ్య లౌకిక విలువలు ఏమైతేనేమీ..! ఇదీ నేటి బీజేపీ పాలన!!

డేరా సచ్చా సౌధా సంస్థ అధిపతి గుర్మీత్ రామ్ రహీం సింగ్ తన శిష్యురాళ్లపై లైంగిక దాడులకు పాల్పడ్డారని సీబీఐ ప్రత్యేక కోర్టు నిర్ధారించడమే తరువాయి... ఆయన శిష్యులు విధ్వంసం సృష్టించారు. పంచకులను అతలాకుతలం చేసారు. తాము దేవుని అంశగా భావించి ఆరాధించిన బాబా బండారం బద్దలవడంతో భక్తులంతా ఇన్నాళ్లుగా మోసపోయిన తమ అమాయకత్వానికి చింతిస్తుండగా, ఈ వీరభక్తులు మాత్రం వీరంగమాడుతున్నారు... వారేమైనా సాధారణ భక్తులా...? వీరభక్తులు... అందుకే వారి వద్ద రుద్రాక్షలు, విభూది ఉండలకు బదులు పెట్రోలు బాంబులు, ఏకే 47లు, రైఫిళ్లు, తల్వార్‌లు, తపంచాలు దర్శనమిస్తున్నాయి. తమ గురువుని నేరస్తునిగా నిర్ధారించినంతనే ఇంతటి ఘోరకలికి పాల్పడ్డారు ఈ వీరభక్తులు. చట్టాన్ని, న్యాయాన్ని, చివరికి రాజ్యాన్నే లెక్కచేయని వీరి తెగింపునకు కారణమేమిటి?




సాధారణంగా మనం దేవుడిని నమ్మినంత సులభంగా దేనినీ నమ్మం. ఈ బలహీనతను అడ్డుపెట్టుకునే ఇటువంటి బాబాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. చుక్క చెమట చిందించకుండా ఉన్న ఫళంగా కోట్లకు కోట్లు సంపాదించడానికి ఇదొక సులువైన మార్గం. ఇటువంటి బాబాలు, స్వామీజీలు, ఆధ్యాత్మిక గురువుల ఉదంతాలు ఈ దేశానికేమీ కొత్తకాదు. గుర్మీత్‌సింగ్‌ది మరో తాజా ఉదంతం మాత్రమే. దేశంలో స్వయం ప్రకటిత స్వామీజీలు, బాబాలు, ఆధ్యాత్మిక గురువులతో అధికార యంత్రాంగం, రాజకీయ పార్టీలు – నాయకుల బంధం కూడా ఈ దేశానికి కొత్త కాదు. కానీ నేడు బీజేపీ అధికారంలోకి వచ్చాక ఇది పరాకాష్టకు చేరింది. గుర్మీత్‌సింగ్ విషయంలో ఇది మరింత స్పష్టమైంది. లేదంటే ఇతనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యున్నత స్థాయి జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించడమేమిటీ..? న్యాయస్థానం దోషిగా తేల్చాక కూడా ఈ ప్రభుత్వాలు, పార్టీ నేతలు స్పందించకపోవడమేమిటి..!?

డేరా బాబాపై శనివారం న్యాయస్థానం తీర్పు నివ్వనున్నదని తెలిసీ, ఈ నేపథ్యంలో శాంతి భద్రతల సమస్య తలెత్తనున్నదని తెలిసీ ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టకుండా అంతమంది అనుచరగణాన్ని ఆశ్రమంలోకి అనుమతించడంలో హర్యానా ప్రభుత్వం ఆంతర్యమేమిటి..? తీర్పు అనంతరం అంతటి విధ్వంసం జరుగుతుంటే పాలనా యంత్రాంగమంతా చేతులు ముడుచుకుని కూర్చోవడమేమిటి? తమ రాజకీయ స్వార్థం కోసం నగరం తగులబడుతుంటే చూస్తారా..? శాంతిభద్రతలు కాపాడవల్సిన ప్రభుత్వ యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. తీర్పు నేపథ్యంలో వారం రోజుల ముందు నుండే డేరాబాబా అనుచరులు పంచకులకు చేరుకుంటున్నా నిలువరించలేకపోయింది. ఇవన్నీ దేనికి సంకేతాలు..? అందుకే "మోడీజీ.. మీరు దేశం మొత్తానికి ప్రధానమంత్రి... కేవలం బీజేపీకే కాదు... హర్యానా దేశంలో భాగం కాదా.." అంటూ హర్యానా – పంజాబ్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు గుర్మీత్‌సింగ్ అనుచరులకు మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రభుత్వం లొంగిపోయి, హింసను ప్రోత్సహించిందని కోర్టు మండిపడింది. ఇంత జరిగినా కనీస పశ్చాత్తాపం ప్రకటించకుండా కేవలం డీసీపీపై సస్పెన్షన్ విధించి చేతులు దులుపుకోజూస్తున్నారంటే కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాల అసలు నైజం ఇట్టే తెలిసిపోతోంది...

నిజానికి డేరాబాబాతో బీజేపీ బంధం బహిరంగ రహస్యమే... 2014 లోక్‌సభ ఎన్నికలు మొదలు హర్యానా అసెంబ్లీ ఎన్నికల వరకూ, ఆ తరువాత అది కొనసాగుతూనే ఉంది. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా హర్యానాకు వచ్చిన నాటి ప్రధాని అభ్యర్థి, నేటి ప్రధాని మోడీ సిర్సా బహిరంగ సభలోనూ, అంతకు పూర్వం పాల్గొన్న సభల్లోనూ డేరా బాబాను ఆకాశానికెత్తిన విషయం దేశం మొత్తానికి తెలుసు. బాబాల ప్రభావంలో ఉండే భక్తకోటి ఓట్లు వీరికి కావాలి. సకల పాపాల నుండి కాపాడుకోవడానికి వీరి ప్రభుత్వాల అండ వారికి కావాలి. ఇది కూడా బహిరంగ రహస్యమే..! సహజంగానే డేరా వర్గం ఓట్లు అటు కేంద్రంలోనూ, ఇటు హర్యానా లోనూ బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడేందుకు తోడ్పడ్డాయి. అంతే సహజంగా డేరా బాబా రక్షణకు ఈ ప్రభుత్వాలు తోడ్పడుతున్నాయి. మధ్యలో ప్రజలేమైతేనేమీ.., న్యాయం ఏమైతేనేమీ.., ప్రజాస్వామ్య లౌకిక విలువలు ఏమైతేనేమీ..! ఇదీ నేటి బీజేపీ పాలన!!

వాస్తవాన్ని కప్పిపుచ్చుతున్న మోడీ ప్రభుత్వం



వికాస్ రావల్

నయావుదారవాద శకం ఉద్యోగాలను సృష్టించజాలని వృద్ధి జరుగుతున్న కాలమని అందరికీ తెలుసు. 1999–2000, 2011–12 మధ్య కాలంలో ఉద్యోగాలు చేస్తున్న 15–59ఏండ్ల మధ్య వయసుగల పురుషులు 84శాతం నుంచి 81శాతానికి పడిపోయారు. అదే కాలంలో ఉద్యోగాలు చేస్తున్న అదే వయస్సు మహిళలు 41 నుంచి 32శాతానికి తగ్గిపోయారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టంతో ఎంతోకొంత ఉపశమనం పొందినప్పటికీ వ్యవసాయ రంగంలో శ్రామికుల వినియోగం క్షీణించటం, ఇతర రంగాలలో ఉద్యోగాలు సృష్టించబడక పోవటంవల్ల పనిపాటలు అందుబాటులోకి రావటం క్షీణించింది. ముఖ్యంగా 15–59ఏండ్ల మధ్య వయసు మహిళలు శ్రమలో పాలుపంచుకోవటం 11శాతం క్షీణించింది. గ్రామీణ ప్రాంతంలోని పురుషులు పట్టణ ప్రాంతంలోకి వలస పోవటమో లేక ఇంటి నుంచి పట్టణాలకు పనికి వెళ్ళి రావటమో చేస్తుండగా గ్రామీణ ప్రాంతంలో మహిళలు పని దొరకక యాతన పడుతున్నారు. గత ప్రభుత్వ కాలంలో ఉద్యోగాలు సృష్టించజాలని వృద్ధి కాలం నుంచి మోడీ పరిపాలనలో భారతదేశం ఉద్యోగాలులేని, వృద్ధిలేని ఆర్థిక వ్యవస్థగల దేశంగా పరిణామం చెందింది. మూడేండ్లలో కోటి ఉద్యోగాలు సృష్టిస్తానన్న మోడీ వాగ్దానం అమలయ్యే అవకాశం కనపడటం లేదు. కార్మికులు నేడు మరింత తీవ్రమైన నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటున్నారు.

నోట్ల రద్దు, పరిపక్వత లేకుండా రూపొందించిన జీఎస్‌టీని అరకొరగా అమలు చేయటం వల్ల ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలు తీవ్ర స్థాయిలో ప్రతికూలంగా ప్రభావితమౌతున్నాయి. సంఘటిత, అసంఘటిత రంగాలు నేడు ఒక తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. 'మేక్ ఇన్ ఇండియా' అనే ప్రభుత్వ నినాదం ఒక క్రూరమైన జోక్‌గా మారింది. నెలవారీగా పారిశ్రామిక ఉత్పత్తిని గణించే పారిశ్రామిక ఉత్పత్తి సూచిక 2015 డిసెంబరు నుంచి 120 పాయింట్లకు దగ్గరలో స్తబ్దంగా ఉన్నది.

వృద్ధిలేని వ్యవసాయ రంగం

2014–15, 2015–16 మధ్య రెండేండ్లలో కరువు తాండవించి పంటలు పండలేదు. ఒకవైపు రైతులు నష్టాలను భరించలేక సతమతమౌతుండగా, మరోవైపు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర పెంచకుండా ఆపింది. ఈ మూడేండ్ల మోడీ పాలనలో వరికి ఇస్తున్న కనీస మద్దతు ధరలో వచ్చిన పెరుగుదల వార్షికంగా కేవలం 4.7శాతం మాత్రమే. ఇందుకు భిన్నంగా 2004–2009 కాలంలోని యూపీఏ–1 పాలనలో వరికి ఇచ్చిన కనీస మద్దతు ధర వార్షికంగా 15.7శాతం. 2009–2014 మధ్యకాలంలోని యూపీఏ–2లో ఈ పెరుగుదల వార్షికంగా 7శాతంగా ఉన్నది. అదేవిధంగా గత రెండు రబీ పంట కాలాలలో గోధుమకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర సగటున వార్షికంగా కేవలం 4.5శాతం మాత్రమే. ఇందుకు భిన్నంగా యూపీఏ–1 పాలనలో గోధుమకు ఇచ్చిన కనీస మద్దతు ధర 14.3శాతంగాను, యూపీఏ–2 కాలంలో 5.9శాతంగాను ఉన్నది.

మోడీ పాలనలోని మొదటి రెండేండ్లలో కరువు పరిస్థితులు ఏర్పడటం, కనీస మద్దతు ధర తగినంతగా లేకపోవటం వంటి కారణాలతో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ కుదేలయింది. మూడో ఏడాదిలో వ్యవసాయం మీద నోట్ల రద్దు దెబ్బ పడింది. రెండేండ్ల కరువు తరువాత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు బాగా కురవటంతో పంటలు బాగా పండాయి. సరిగ్గా ఈ పంటను రైతులు అమ్ముకుంటూ రబీ సీజన్‌కు కావలసిన విత్తనాలు ఎరువులు సమకూర్చుకుంటుండగా మోడీ నోట్ల రద్దు ప్రకటించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో డబ్బులేని స్థితిలో ఖరీఫ్ సీజన్‌లో పండిన వ్యవసాయ పంటల ధరలు పతనమయ్యాయి. కొన్ని పంటలకు కనీసం పెట్టుబడులు కూడా రాకపోవటంతో రైతులు చాలా చోట్ల తమ పంటలను పొలంలోనే వదిలేశారు. రబీ పంట వేయటానికి విత్తనాలు కూడా కొనలేని దుస్థితి రైతులు చాలా చోట్ల ఎదుర్కొన్నారు. అయినప్పటికీ నోట్ల రద్దుతో రబీ పంటలకు ఎలాంటి ఇబ్బందీ రాలేదని ప్రభుత్వం బుకాయించింది. అయితే నోట్ల రద్దుతో రబీ సీజన్‌లో జరిగిన ఉత్పత్తి దెబ్బతినటం అందరమూ చూస్తున్నాం. నోట్ల రద్దు తరువాత పంటల ధరలు పతనం కాగా రబీ సీజన్‌లో పంటలు తగినంతగా పండకపోవటంతో రిటైల్ మార్కెట్‌లో కొన్ని ఆహార పదార్థాల ధరలు ఇటీవలికాలంలో చుక్కలనంటాయి.

ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల వ్యవసాయ రంగంలో ఏర్పడిన సంక్షోభం గ్రామీణ పేదలను తీవ్ర నైరాశ్యానికి గురిచేసింది. ప్రభుత్వ సమాచారం ప్రకారం రైతు ఆత్మహత్యలు తీవ్ర స్థాయిలో పెరిగాయి. 2015వ సంవత్సరానికి చెందిన నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన సమాచారం ప్రకారం 8,007మంది రైతులు, 4,595మంది వ్యవసాయ కార్మికులు, 23,779మంది ఇతర రోజు కూలీలు భారతదేశంలో ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే 2015లో భారతదేశంలో సగటున ప్రతీ గంటకు నల్గురు రైతులు, వ్యవసాయ కూలీలు ఆత్మహత్య చేసుకున్నారు! నోట్లరద్దు తరువాత పెరిగిన ఆర్థిక నైరాశ్యంవల్ల రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. వ్యవసాయ రంగంలో తీవ్రమైన నైరాశ్యంవల్ల రుణ భారం నుంచి విముక్తి కోరుతూ రైతులు పోరాటం చేయటం ప్రారంభించారు. తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌వంటి రాష్ట్రాలలో రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఏమాత్రం ఉపశమనం అందించలేదు.

ఆర్థిక విధాన వైఫల్యాలను కప్పిపుచ్చటం

వర్ధమాన దేశాలలోకెల్లా అత్యుత్తమ గణాంక వ్యవస్థ భారతదేశంలో ఉంది. అనేక కారణాలచేత ఈ గణాంక వ్యవస్థ విధాన నిర్ణేతలకు ఇబ్బందిగా మారింది. ఆర్థిక విధానాల వైఫల్యాలను గణాంకాలను తారుమారు చేసి కప్పిపుచ్చటం, వివిధ అభివృద్ధి పథకాల ఫలితాలను తప్పుగా చూపించటం గతంలో కూడా జరుగుతుండేది. అయితే ఇందుకు సంబంధించి మోడీ ప్రభుత్వం ఈ మధ్య కాలంలో తీసుకున్న కొన్ని నిర్ణయాల పర్యవసానం తీవ్ర స్థాయిలో ఉండబోతున్నది. గత మేలో ఉద్యోగితకు సంబంధించిన సమాచారాన్ని ఆధారపడే రీతిలో అందించటం కోసం మోడీ ప్రభుత్వం అరవింద్ పనగారియా నేతృత్వంలో ఒక టాస్క్‌ఫోర్స్ ప్రవేశపెట్టింది. ఉద్యోగులు, నిరుద్యోగులకు సంబంధించి నేషనల్ శాంపిల్ సర్వే, వార్షికంగా చేసే పారిశ్రామిక సర్వేలను నిలిపేయాలని ఈ టాస్క్ ఫోర్స్ సిఫారసు చేసింది. వీటి స్థానంలో గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే, పారిశ్రామిక వార్షిక సర్వేలను నిర్వహించాలని పేర్కొంది. నయావుదారవాద పాలనలో బూటకపు అభివృద్ధి నిజస్వరూపం తెలియాలంటే గతంలో అమలులోవున్న గణాంక వ్యవస్థకు చెందిన రెండు వనరుల అవసరం ఉంటుంది.



ఉద్యోగిత, నిరుద్యోగితలకు చెందిన సర్వేలను నిర్వహించే నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీసు నయా వుదారవాద సంస్కరణల తరువాత ఉద్యోగ కల్పన ఎంత బూటకమైందో నిలకడగా తెలియజేసింది. ఈ సంస్థచేత నిరుద్యోగిత మీద చేసిన సర్వేలు మూడో ప్రపంచ దేశాలలోనే అత్యంత గుణాత్మకమైనవిగా పేరొందాయి. అనేక మార్పులకు లోనయ్యే ఉద్యోగితగల అసంఘటితరంగం వున్న దేశంలో అత్యంత నాణ్యతగల గణాంగ పద్ధతులను ఉద్యోగితను, అరకొర ఉద్యోగితను, నిరుద్యోగితను గణించటానికి ఉపయోగించటం జరిగేది. ఏడాది పొడుగునా వివిధ సీజన్లలో జరిగే మార్పులను గ్రహించటానికి ఎక్కువ సంఖ్యలో కుటుంబాలను సర్వే చేయటం జరిగేది. అసంఘటిత శ్రామిక మార్కెట్ అస్థిత్వంలో వున్న స్థితిలో ఉద్యోగిత తీరుతెన్నులను గ్రహించటానికి పటిష్టమైన సర్వే పద్ధతులను అవలంబించటం జరిగేది. సర్వే జరిగిన ఏడాదిలో దారిద్ర్యాన్ని, నిరుద్యోగితను గణించటానికి వినిమయ వ్యయానికి సంబంధించిన సర్వేలను కూడా నిర్వహిస్తుండే వారు. ఈ సర్వేలవల్ల ప్రభుత్వం ఉద్యోగ కల్పనకు రూపొందించే కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావటం గురించి తెలిసేది. గ్రామీణ ఉపాధి పథకం వంటి పథకాలతో జరిగిన ఉద్యోగకల్పన గురించి ప్రభుత్వ ప్రకటనలను ప్రశ్నించే అవకాశం ఉండేది. ఉద్యోగ కల్పన, నిరుద్యోగాలకు సంబంధించిన సర్వేలలో మహిళల కార్యకలాపాల గురించిన సమాచారం అందుబాటులోకి వచ్చేది. మహిళలు ఇంటిపని, వంటపని చేస్తున్నామని చెప్పినా వారు తమ కుటుంబాల కొరకు అనేక రకాల ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనటం ఈ సర్వేల ద్వారా తెలిసేది. ఉదాహరణకు 1999–2000, 2011–12 మధ్యకాలంలో ఆహారం, పశుగ్రాసం, వంట చెరకులను సేకరించే 15–59ఏండ్ల మధ్య వయసున్న నిరుద్యోగులైన గ్రామీణ మహిళల సంఖ్య పెరిగింది. అలాగే సెంట్రల్ స్టాటిస్టికల్ ఆఫీసు(సీఎస్ఓ) ఆధ్వర్యంలో పరిశ్రమల గురించి సర్వేల ద్వారా ఆ రంగానికి చెందిన విలువైన సమాచారం అందుబాటులోకి వచ్చేది. ఈ సమాచారం ఆధారంగా నయా వుదారవాదం, ప్రపంచీకరణ విధానాలతో ఆర్థికాభివృద్ధికి కావలసిన పెట్టుబడులను పెట్టటానికి ప్రయివేటు పెట్టుబడిదారులు ఉవ్విళ్ళూరుతున్నారని ప్రభుత్వాలు చేసే ప్రకటనల వెనుకగల సత్యాన్ని పరిశోధకులు బయటపెట్టేవారు. సంస్కరణలను ప్రవేశపెట్టిన తరువాత ఉత్పత్తిలో పెరుగుదల, జోడింపబడిన విలువ, సంఘటిత రంగంలో సృష్టింపబడిన ఉద్యోగిత మందకొడిగా ఉన్నాయనే విషయం ఈ సర్వేల ద్వారా అందిన సమాచారాన్నిబట్టి తెలిసేది. పరిస్థితి ఇలావుండగా పరిశ్రమల గురించి, ఉద్యోగ కల్పనకు సంబంధించిన సమస్యల గురించి తెలియజేసే సర్వేలను నిలిపివేయటమంటే ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక కార్యకలాపాలను, ఉద్యోగ కల్పనను పునరుత్తేజింప జేయటంలో విఫలమైన ప్రస్తుత ప్రభుత్వాన్ని గణాంకాల ఆధారంగా ప్రశ్నించటానికి వీల్లేకుండా చేయటమే అవుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఇటువంటి నిర్ణయం కష్టజీవుల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసి ప్రభుత్వాన్ని ప్రశ్నించే సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది. దీనితో చాలా ప్రమాదకరమైన పర్యవసానాలుంటాయి.

అనువాదం: నెల్లూరు నరసింహారావు
సెల్ ఫోన్: 8886396999



గోరెంకల నర్సింహ్మా

వికలాంగులకు ఒరిగిందేమిటి?

ఈ మూడేండ్ల టీఆర్ఎస్ పాలనలో వికలాంగులకు ఒరిగిందేమిటీ..? వికలాంగులను అన్నివిధాల అభివృద్ధి చేసి వారికి అండగా ఉంటానని కేసీఆర్ చేసిన వాగ్దానాలు, ఎన్నికల అనంతరం పింఛను పెంచకుండా కాలయాపన చేశారు. దీంతో రాష్ట్రంలోని వికలాంగులు ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. పోరాటాల ఫలితంగా రూ.1500 పెన్షన్ సాధించుకున్నారు. జీవో 17 ప్రకారం ప్రతినెలా 7వ తేదీలోపు లబ్దిదారునికి పింఛనందాలి. కానీ నెలాఖరుకు కూడా పింఛన్లందక వికలాంగులు, వృద్దులు, వితంతువులు అష్టకష్టాలు పడుతున్నారు. పింఛను ఎప్పుడొస్తుందోనని కండ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ధనికరాష్ట్రం అంటున్న కేసీఆర్ వికలాంగుల పింఛన్లు నెల మొదట్లో ఇవ్వకుండా రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానన్న కేసీఆర్ వికలాంగుల బతుకులు మార్చకుండా ఎలా సాధ్యమో చెప్పాలి. అదేవిధంగా వైకల్యం 40శాతం వుంటే సంక్షేమ పథకాలకు అర్హులని చట్టం చెబుతుంటే ఈ ప్రభుత్వం మాత్రం బధిరులకు 51శాతంపైన వైకల్యం వుంటేనే పింఛన్లివ్వాలని ఆ జీవోలో పెట్టారు. దీనివల్ల వేలాదిమంది పేద వికలాంగులు పింఛన్లు పొందలేక వివక్షకు గురవుతున్నారు.

రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 10,46,822 మంది వికలాంగులున్నారని సర్వేలు చెబుతున్నాయి. పింఛన్లు మాత్రం 4,65,047మంది వికలాంగులకు మాత్రమే అందుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వృద్దులు, వికలాంగులు, వితంతువులు, తదితరులు 35.85లక్షల మంది ఆసరా పింఛన్లు పొందుతున్నారని ఇకనుండి 6నెలలకోసారి తప్పకుండా లైఫ్ సర్టిఫికెట్ (బతికున్నామని) ఇవ్వాలనీ, లేకుంటే పింఛను రద్దుచేస్తామనే ప్రభుత్వ నిర్ణయం సిగ్గుచేటు. వికలాంగులు, అంధులు, మీసేవా కేంద్రాలకు ప్రతి 6 నెలలకోసారి ధృవీకరణ పత్రాలు సమర్పించాలనడం వికలాంగులు బతికుండగానే నరకం చూపించడమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది.


1. వికలాంగులకు రూ.1500 పెన్షన్ పెంపు. 2. విద్యా, ఉద్యోగం, ఉపాధి అవకాశాల్లో 3శాతం రిజర్వేషన్లు కల్పించడం. 3. శారీరక వైకల్యాన్నిబట్టి ఉచితంగా ఉపకరణాల పంపిణీ. 4. ప్రతిజిల్లాలో స్టడీసర్కిల్స్ ఏర్పాటుచేసి ఇంజనీరింగ్, మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలు ఇతర పోటీ పరీక్షలకు స్పెషల్ కోచింగ్ ఉచితంగా ఇవ్వడం. 5. వికలాంగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితవైద్యం. 6. వికలాంగులకు మెరుగైన ఆర్థిక సహకారం అందించడం. 7. వికలాంగులైన క్రీడాకారులను, కళాకారులను గుర్తించి తగు ఆర్థిక సహకారాన్ని అందించడం. 8. సకలాంగులు వికలాంగులను వివాహం చేసుకుంటే ఆ జంటకు రూ.లక్షతోపాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామనీ టీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో వరాలజల్లు కురిపించారు.

కానీ కేసీఆర్ వాగ్దానాల్లో ఒక్క పింఛన్ పెంపు తప్ప మిగతా వేటిలో ముందడుగులేదు. అనేకరకాల దాడులు, దౌర్జన్యాలు వికలాంగులపై జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. మహిళా వికలాంగులపై అత్యాచారాలు జరుగుతున్నాయి. ఒకవైపు వికలాంగులు సమాజంలో ఎలాంటి వివక్షకు గురికాకుండా రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు అందరూ సమానులేనని, 15ఎ(1) అధికరణ ప్రకారం పౌరులపై జాతి, మత, లింగ, పుట్టుక ఆధారంగా ఎలాంటి వివక్ష వహించడానికి లేదనీ చెబుతోంది.

జిల్లాల పునర్విభజనలో భాగంగా అనుబంధ శాఖలన్నింటినీ ఒకే గొడుగుకిందకు తెస్తున్నామనే పేరుతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖల్లో వికలాంగుల శాఖను ప్రభుత్వం విలీనం చేసింది. కానీ ఇంకా విలీనం కాలేదని మాటలు చెబుతుందే గానీ జీవో గానీ, మెమోగానీ విడుదల చేయకుండా మోసపూరితమైన మాటలు చెబుతోంది.

ఎన్‌పీఆర్‌డీ 2010 ఫిబ్రవరి 21న ఆత్మగౌరవం, హక్కుల సాధన లక్ష్యాలతో ఏర్పడింది. దేశవ్యాప్తంగా వికలాంగులను తన హక్కుల సాధనకోసం ఐక్యం చేసి ఉద్యమాలను నడుపుతున్నది. 2016 వికలాంగుల హక్కుల నూతన చట్టం కోసం, దేశవ్యాప్తంగా ఒకేవిధమైన గుర్తింపు కార్డులివ్వాలని, రైల్వేలో ఒక్కరు వెళ్ళినా ప్రత్యేక రాయితీ కల్పించాలని, ఆరేండ్ల పాటు దేశవ్యాప్తంగా ఉద్యమించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఫించన్ రూ.1500కు పెంచుతామని ఇచ్చిన హామీ అమలు కోసం ఉద్యమించింది. అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, వికలాంగుల ప్రోత్సాహకం రూ.10వేలనుండి రూ.50వేలు పెంపుకోసం, ఉద్యోగ అర్హతను వికలాంగుల వయస్సు పదేండ్లకు పెంపుకోసం ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఉమ్మడి రాష్ట్రంలో రద్దు చేసిన 11 నెలల పింఛన్లు పునఃరుద్ధరించాలని, బస్‌పాస్, రైల్వేపాస్‌లకోసం గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించింది. ఇబ్రహీంపట్నంలో వికలాంగులకు ప్రత్యేక బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పథకం, 150 రోజుల పని కల్పించాలని కోరుతూ ఎన్‌పీఆర్‌డీ అనేక ఉద్యమాలు నిర్వహించింది. పిల్లలకు సర్వశిక్ష అభియాన్ ద్వారా విద్య అందించాలని, ఉచిత నిర్బంధ విద్యనందించాలని, ఉద్యోగ అవకాశాలు, సౌకర్యాలు కల్పించాలని, వికలాంగులపట్ల కొనసాగుతున్న వివక్ష రూపుమాపే చర్యలు చేపట్టాలని ఎన్‌పిఆర్‌డీ ఉద్యమిస్తోంది.

సెల్: 9490300731



కొండూరి వీరయ్య

ఈ ఆధిపత్యం ఏ ప్రస్థానం కోసం ?

ఆగస్టు రెండో వారంలో వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక కావటంతో స్వాతంత్ర్యానంతరం తొలిసారి కీలకమైన రాజ్యాంగ పదవులన్నీ ఆరెస్సెస్ కార్యకర్తలు అలంకరించిన తొలి సందర్భంగా మారింది. బీజేపీ కేవలం కేంద్రం లోనూ, కొన్ని రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉన్న పార్టీ మాత్రమే కాదు. భారత రాజకీయాల దిశను శాసించే స్థాయికి చేరుకున్న పార్టీ అన్న వాస్తవాన్ని యూపీ ఎన్నికలు, అనంతర పరిణామాలు రుజువు చేశాయి. నేడు లౌకిక ప్రజాతంత్ర భారతదేశపు రాజ్యాంగ నిర్దేశిత స్వభావం ప్రశ్నార్థకమవుతోంది.

స్వాతంత్ర్యానంతరం దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు కొనసాగిన కాంగ్రెస్ పార్టీ దేశంలోని సామాజిక రాజకీయ ఆర్థిక ఆధిపత్యం తర్వాతి కాలంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు దేశంలో సంకీర్ణ రాజకీయాలకు తెరతీసింది. 2014లో అధికారానికి వచ్చిన ఎన్డీయే 1999 నాటి ఎన్డీయేతో పూర్తిగా విరుద్ధమైన స్వభావం కలిగింది. పార్లమెంట్‌లో సంఖ్యాబలం అవసరాల కోసమన్నా రాజకీయ నమ్రత పాటించింది బీజేపీ 1999లో. నేటి పరిస్థితి దీనికి పూర్తి భిన్నం. సోకాల్డ్ మిత్రపక్షాలు మెప్పుకోసం రాజధానిలో పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు వచ్చాయి. రాజ్యసభలో సంఖ్యాబలం కోసం మోడీ బీహార్ మొదలు తమిళనాడు వరకు అన్ని ప్రాంతీయ పార్టీలను కూడా ప్రత్యక్షంగా నియంత్రించటానికి సిద్ధమైంది బీజేపీ.

ఇటీవల బీజేపీ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేసిన ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా 2019 ఎన్నికల్లో లోక్‌సభలో పార్టీకి 350సీట్లు కట్టబెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే లోక్‌సభలో పార్టీ అధికారంలో ఉండటానికి అవసరమైన సీట్లకంటే ఎక్కువ సీట్లు బీజేపీ ఖాతాలో ఉన్నాయి. పైగా మిత్రులు, మద్దతుదారుల సంఖ్యాబలం కూడా దండిగా ఉంది. ఇంత సంఖ్యాబలం కలిగిన ప్రభుత్వం ఏ ప్రజాహితమైన చట్టాలు, నిర్ణయాలు, చర్యలు తీసుకోవాలన్నా అడ్డు చెప్పేవాళ్లుండరు. ఉదాహరణకు మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించటానికి బీజేపీకి ఎటువంటి అవరోధమూ లేదు. ఐక్యరాజ్య సమితి మానవహక్కుల ప్రకటనలో పేర్కొన్న అనేక అంశాలను ప్రాథమిక హక్కులుగా గుర్తిస్తూ రాజ్యాంగ సవరణ చేయటానికి ఏ ప్రతిపక్షమూ అడ్డు చెప్పదు. చెప్పినా బీజేపీ తన సంఖ్యాబలంతో ప్రతిపక్షాల ప్రతపాదనలను ఓడించవచ్చు. ఈ విధంగా చూసుకుంటే పరిపాలన సజావుగా సాగించటానికి కావల్సిన అన్ని హంగులు, ఆర్భాటాలు, అవకాశాలు బీజేపీకి ఉన్నాయి. కానీ మోడీ కూడా పాల్గొన్న సమావేశంలో రానున్న ఎన్నికల్లో లోక్‌సభలో బీజేపీ ఆధిపత్యం 350సీట్లకు మించి పెరగాలని అమిత్‌షా పిలుపునిచ్చారు. ఏమి సాధించటానికి ఈ ఆధిపత్యం?

లోక్‌సభలో బీజేపీ ఆశించిన సంఖ్యాబలాన్ని పెంచుకోవటానికి అడ్డొస్తున్న రాష్ట్రాలు దక్షిణాదివి. స్వాతంత్ర్యోద్యమంలో ఈ రాష్ట్రాల భాగస్వామ్యం లేకపోతే సమాఖ్య రాజ్యాంగం ఆవశ్యకతను నాటి కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఉండేది కాదు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఇచ్చింది కేవలం రాజ్యాంగబద్ధమైన సమాఖ్య స్వభావాన్ని మాత్రమే కాదు. సాంస్కృతిక, భాషాపరమైన సమాఖ్య తత్వాన్ని కూడా. బీజేపీ ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయటం ద్వారా రాజకీయ సమాఖ్యస్వభావాన్ని కొనసాగించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్న తరుణంలో టీఆర్ఎస్, వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ లాంటి కొందరు అవకాశవాద రాజకీయ నాయకుల వల్ల దక్షిణాది ప్రజలు ఈ విలక్షణత కోల్పోతున్నారు. ఆరెస్సెస్ ఆలోచనల్లో దక్షిణ భారతీయుల పట్ల ఉన్న అభిప్రాయాన్ని ఆరెస్సెస్ సైద్ధాంతికవేత్తల్లో ఒకరిగా కొనియాడబడుతున్న తరుణ్ విజయ్ దక్షిణభారతీయులందరినీ నల్లజాతి వారితో సమానంగా పోల్చాడు. అంతే కాదు. దక్షిణాదిలో సైతం తెల్లతోలు కలిగిన వారున్నారని, వారంతా తమ వారేనని విజయ్ వ్యాఖ్యానించాడు. తరుణ్ విజయ్ వ్యాఖ్యలు ఖండించటానికి ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం ఏర్పడిన పార్టీకి నాయకుడినని చెప్పుకొంటున్న చంద్రబాబు నోరు పెగల్లేదు. ఆరెస్సెస్ ప్రతిపాదించిన జాతీయత పునాదులు ఎక్కడున్నాయో తరుణ్ విజయ్ చెప్పకనే చెప్పారు. భారతజాతి, భారతజాతీయత గురించి లౌకిక ప్రజాతంత్ర రాజ్యాంగం ఇచ్చిన నిర్వచనాన్ని ఆరెస్సెస్ అంగీకరించటం లేదన్న విషయాన్ని తరుణ్ విజయ్ ఉదంతం మరోమారు ముందుకు తెస్తోంది. ఈ అవగాహనను దేశమంతా రుద్దటానికి బీజేపీ తన సంఖ్యాబలాన్ని విస్తరించుకోవాలని కోరుకొంటోంది. యూపీలో బీజేపీ అనుసరించిన ఎన్నికల వ్యూహం పర్యవసనాలు గుర్తుకు తెచ్చుకుంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ వ్యూహం దక్షిణాది రాష్ట్రాల్లో ఎలా ఉండబోతోందో అర్థం చేసుకోవటం తేలికే. ముస్లిం వ్యతిరేకతను బాహాటంగా ప్రదర్శించే బీజేపీ యూపీలో ఒక్క ముస్లిం అభ్యర్థిని కూడా నిలబెట్టకుండా అధికారానికి రావటం ప్రజా తంత్ర ప్రాతినిధ్య ఎన్నికల వ్యవస్థకు ఓ సవాలు.



స్వాతంత్ర్యానంతరం రెండున్నర దశాబ్దాల పాటు కాంగ్రెస్ సైతం ఏకఛత్రాధిపత్యం వహించినప్పటికీ కాంగ్రెస్ రాజకీయాలు సమీకృత రాజకీయాలుగా ఉన్నాయి. అనంతరం తొలినాళ్లల్లో కాంగ్రెస్‌కు దూరమైన సామాజిక స్రవంతులను దగ్గరకు తెచ్చుకోవటానికి అన్ని స్థాయిల్లోనూ ప్రాతినిధ్య పార్టీ వ్యవస్థ మొదలు ప్రాతినిధ్య పార్లమెంటరీ వ్యవస్థను కొనసాగించటానికి ప్రయత్నించింది. దేశంలో దళిత రాజకీయాలు గురించి అధ్యయనం చేస్తే స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్ పార్టీకి దూరమైన దళితులను తిరిగి తమ గుప్పెట్లోకి తెచ్చుకోవటానికి అనుసరించిన వ్యూహాలు తెలుసుకోవచ్చు. స్వాతంత్ర్యం సాధించేనాటికి ప్రధానంగా దక్షణాది రాష్ట్రాల్లో దళితవాడలన్నీ కమ్యూనిస్టు శ్రేణులతో నిండి ఉండేవన్న విషయం చారిత్రక వాస్తవం. పార్లమెంటరీ రాజకీయాల్లో సంఖ్యా బలం పరిపాలన సజావుగా సాగించటానికి సరిపోయినంత ఉంటే చాలు. కానీ బీజేపీ ఆశిస్తున్న సంఖ్యాబలం కేవలం రాజ్యాంగ బద్ధమైన పరిపాలనకు కాదు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని, రాజ్యాంగ వ్యవస్థలను కూలదోయటమే లక్ష్యంగా పెట్టుకున్న పార్టీ అవసరానికి మించిన సంఖ్యా బలాన్ని కోరుకుంటుందంటే ఆ బలం వల్ల సాధించదల్చు కున్న ప్రయోజనాలు రాజ్యాంగ బద్ధమైన ప్రయోజనాలు కాదూ.. అన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఆర్థిక సంస్కరణలు ప్రారంభించినప్పటి నుండీ పాలక పార్టీకి, లేదా కూటమికి రాజ్యసభలో సంఖ్యాబలం లేకపోవటం వల్ల అనేక కీలకమైన ఆర్థిక సంస్కరణలను ముందుకు తీసుకెళ్లే చట్టాలను ఆమోదించలేక పోయాయన్నది వాస్తవం. కాంగ్రెస్ ముక్తభారత్ సాధిస్తానని 2014లో అధికారానికి వచ్చిన మోడీ 2019 ఎన్నికల్లో దేశాన్ని ప్రతిపక్ష పార్టీల పాలన నుండి విముక్తి చేయాలన్న నినాదాన్ని ముందుకు తెస్తున్నారు. బీజేపీ అమితంగా ఆరాధించే మార్కెట్ ఛాందసవాద విధానాలను ముందుకు తీసుకెళ్లటానికి రాజ్యసభలో ఆధిపత్యం లేకపోవటం ప్రధాన అవరోధంగా భావిస్తోంది. ఆర్థిక సర్వే 2వ భాగాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే మరింత కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని పిలుపు నిచ్చింది. ఆర్థిక సంస్కరణలను ప్రారంభించిన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇదేవాదన ముందుకు తెచ్చింది. ప్రజలు త్యాగాలకు సిద్ధపడాలని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లటానికి ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవటానికి వెనకాడబోదని నాటి ప్రధాని పివి నరసింహా రావు ప్రకటించారు. మొదలు వరుసగా గద్దెనెక్కిన ప్రధానులందరూ ఇదే వాక్యాన్ని పలు రూపాల్లో పునరావృతం చేస్తూ వచ్చారు. ఇటువంటి అవరోధా లను శాశ్వతంగా అధిగ మింటం అంటే అటు ఆరెస్సెస్ ఉన్మాదానికి దేశాన్ని బలి చేయటానికి సిద్ధం కావటమే కాదు. ఇటు మార్కెట్ ఉన్మాదానికి కూడా దేశాన్ని బలి చేయటానికి సిద్ధం కావటమే.

సెల్: 9871794037

పోచంపల్లే.. ఫ్యాషనబుల్‌గా..

ప్రపంచమే చిన్న గ్రామమైపోయాక... ఫ్యాషన్ నిర్వచనం మారిపోయింది. అన్ని రకాల దుస్తులు అందుబాటులోకి వచ్చాక స్థానికచేనేత కుటుంబాలు చితికిపోయాయి. అందులో ఒకటి పోచంపల్లి. ఒకప్పుడు కళలతో విలసిల్లినది... ఇప్పుడు సరైన మార్కెట్ లేక వెలవెలబోతున్నది. దానికి తిరిగి పూర్వవైభవాన్ని తెచ్చే ప్రయత్నాన్ని చేస్తున్నారు కొందరు డిజైనర్స్. 'ఫ్యాషన్ అనేది ఫ్యాబ్రిక్‌లో ఉండదు. డిజైనింగ్‌లోనే ఉంటుంద'ని నిరూపిస్తున్నారు. మనమూ చేనేతకు చేయూతనిద్దాం.



లలిత సంగీత సామ్రాజ్ఞి



రావు బాలసరస్వతీ దేవి (29 ఆగస్టు 1928)

Women of the day

కొందరి పేర్లు వినగానే.. వారి గళం గుర్తుకు వస్తుంది. అలాంటి వారిలో రావు బాలసరస్వతి ఒకరు. ఆమె పేరు వినగానే ఆకాశవాణి సంగీత కార్యక్రమాలలో లలితగీతాలతో శ్రోతలను అలరించిన మృదుమధుర కంఠస్వరం గుర్తుకు వస్తుంది. లలిత గీతాలలో గానప్రస్తానాన్ని ప్రారంభించి సినిమాల నేపథ్యగాయనిగా ఎంతో మంది అభిమానుల మనసులు దోచుకున్నారు. ఆరో ఏట ప్రారంభమైన ఆమె గాత్ర మాధుర్యం నిత్య నూతనం.

రావు బాలసరస్వతీ దేవి చైన్నెలో జన్మించారు. ఆమె తండ్రి పార్థసారథి. ఆమె తాతగారు మద్రాసు హైకోర్టులో న్యాయవాది. గుంటూరులో వీరికి 'రత్న మహల్' అని సినిమా థియేటర్ ఉండేది. దీని నిర్వహణ బాధ్యతలు చూసుకోవడానికి గుంటూరుకు వచ్చారు. సరస్వతీ దేవి మంచి గాయనిగా పేరు సంపాదించుకోవాలన్నది కర్నాటక సంగీతంలో దిట్ట అయిన ఆమె తండ్రి కోరిక. ఆయన హార్మోనియం వాయిస్తూ పాటలు పాడేవారు. బాలసరస్వతి గుంటూరులో అలత్తూర్ సుబ్బయ్య వద్ద శాస్త్రీయ కర్ణాటక సంగీతం మూడు సంవత్సరాలు నేర్చుకున్నారు. ఖేల్కర్, వసంత దేశాయ్‌ల వద్ద హిందుస్తానీ సంగీతం, కె.పిచ్చుమణి వద్ద వీణ, డానియల్ వద్ద పియానో వాయిద్యాలలో శిక్షణ తీసుకున్నారు.

ఆరేండ్ల వయసులోనే హెచ్.ఎం.వి. కంపెనీ ద్వారా "నమస్తే నా ప్రాణనాథ", "ఆకలి సహింపగజాల", "పరమపురుష పరంధామ" మొదలైన పాటలతో సోలో రికార్డు చేశారు.

ఆమె అసలు పేరు సరస్వతీదేవి. అతి చిన్నవయసులో పాటలు పాడటంతో ఆమెను "బాల" సరస్వతి అని పిలిచేవారు. అప్పటి నుండి ఈమె పేరు బాలసరస్వతిగా స్థిరపడింది.

ఆమె ఏడేండ్ల వయసులో తొలిసారిగా సి. పుల్లయ్య గారి దర్శకత్వంలో సతీ అనసూయ చిత్రంలో నటించారు. నటనతో పాటు పాటకూడా పాడారు. "ఏది దారి నాకిచట ఈ కలుష భూతములపాలైతిని...." అంటూ తన గళంతో శ్రోతల కంట నీరు పెట్టించారు. చిన్న వయసులో సినిమా పాటపాడి గాయనిగా, నటిగా అందరి ప్రశంసలు అందుకున్నారు. 1936లో విడుదలైన ఈ చిత్రంలో 60 మంది చిన్నపిల్లలు నటించడమే ఒక ప్రత్యేకత! ఈ చిత్రంలో నటన, పాటకు ఆమె అందుకున్న పారితోషికం రెండు వందల రూపాయలు.

1944లో కోలంక జమీందారీకి చెందిన రాజా రావు ప్రద్యుమ్న క ష్ణ మహీపతి సూర్యారావు బహద్దూర్‌ను పెండ్లి చేసుకొని సినిమాలలో నటించడం తగ్గించారు. ఆ తర్వాత నేపథ్యగాయనిగా సంగీతాభిమానుల అభినందనలు అందుకుంటున్నారు.

1944లో మద్రాసు ఆకాశవాణి రేడియో కేంద్రంలో, 1948లో విజయవాడ ఆకాశవాణి కేంద్రం కూడా లలిత సంగీత కార్యక్రమంతోనే ప్రారంభమయ్యాయి. ప్రసిద్ధ సంగీత దర్శకులు స్.రాజేశ్వరరావుగారితో కలిసి 1940-50 మధ్య కాలంలో ఎన్నో లలిత గీతాలను ఆలపించారు. . దేవులపల్లి కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు, ఆరుద్ర, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బాలాంత్రపు రజనీకాంతరావులు రచించిన ఎన్నో గేయాలు రేడియోలో పాడింది. బాల సరస్వతీ దేవి ఆలపించిన గీతాలలో వచ్చిన 'రాధామాధవం' సీడీ శ్రోతలను ఎంతగానో అలరించింది. లలిత సంగీత సామ్రాజ్ఞిగా ప్రశంసలు అందుకుంటున్నారు. ❄

ఒత్తిడి ఇలా మాయం...

ప్రపంచవ్యాప్తంగా డిప్రెషన్‌తో బాధపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతోంది. ముందు తాము డిప్రెషన్‌లో ఉన్నామనే నిజాన్ని గుర్తిస్తే ఆ బాధను అర్థం చేసుకునే శక్తి పెరుగుతుంది. అర్థం చేసుకునే శక్తి పెరిగితే దాన్ని అధిగమించగలిగే శక్తి కూడా మనలో ఏర్పడుతుంది. దాంతో క్రమక్రమంగా దాన్నించి బయటపడే ప్రయత్నాలు చేయగలం. అయితే డిప్రెషన్ నుంచి బయటపడటానికి వాకింగ్ బాగా తోడ్పడుతుంది. అదేలగో తెలుసుకుందాం...

వాకింగ్‌లో మనో వ్యథనుంచి విముక్తి చేసే లక్షణాలు ఉన్నాయి. నడిచేటప్పుడు లభించే తాజా గాలి, శరీరాన్ని ఉత్తేజితం చేయడమే కాకుండా, మెదడుకు బాగా ఆక్సిజన్ అందడంతో మన ఆలోచనలు ఒక స్పష్టరూపం ధరిస్తాయి. ఏదైనా పెంపుడు జంతువును కూడా తోడు చేసుకోగలిగితే అది మరింత మేలు చేస్తుంది. డిప్రెషన్ నుంచి బయటపడేలా చేసే కొన్ని ఆహార పదార్థాలు కూడా ఈ విషయంలో తోడ్పడతాయి. ముఖ్యంగా అరటి పండ్లు, ముడి ధాన్యాలు, చేపలు, బ్రౌన్ రైస్, పాలకూర బాగా సహకరిస్తాయి. కార్బోహైడ్రేట్లు ఉండే ధాన్యాల్లో మెదడును చైతన్య పరిచే సెరటోనిన్ సమృద్ధిగా ఉంటుంది. వీటితో పాటు బి- విటమిన్, ఫోలిక్ యాసిడ్ అదనంగా తీసుకోవడం వల్ల కూడా ఎంతో ప్రయోజనం ఉంటుంది. బి-విటమిన్ లోపిస్తే డిప్రెషన్ మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది అందువల్ల బి-విటమిన్ లభించే గుడ్లు, ఆకుకూరలు బాగా తీసుకోవాలి. ❄



పండ్లతో మెరిసిపోండి



ప్రతి రోజూ ఒక కప్పు పండ్ల జ్యూస్ తాగితే మన చర్మానికి నిగారింపు వస్తుందనే విషయం మనకు తెలిసిందే. అలాగే పండ్ల రసాన్ని ఫేసియల్‌గా ఉపయోగించినా మంచి ప్రయోజనం ఉంటుంది. చాలామంది చర్మ సౌందర్యం కోసం ఖరీదైన లోషన్లు, క్రీములను వాడుతుంటారు. ఇలా చేయడం వల్ల రసాయనాలతో దుష్ప్రభావం బారిన పడే ప్రమాదం ఉంది. అందుకే ఇంట్లోనే కొద్దిపాటి చిట్కాలు పాటిస్తే చర్మ సంరక్షణ సాధ్యపడుతుంది.

అరటిపండు: సంవత్సరం మొత్తం లభించే పండు ఇదొక్కటే. ఇందులో ఉంటే ఐరన్, మెగ్నిషియం, పోటాషియం వంటివి చర్మ నిగారింపుకు ఎంతో ఉపయోగపడతాయి. ఇందులో ఏ, బీ, ఈ విటమిన్స్ పుష్కలంగా ఉంటాయి. అందువల్ల మీ చర్మం మంచి రంగులోకి మారడానికి అవకాశం ఉంటుంది.

నిమ్మ: ఇది కూడా నిత్యం మన కిచెన్‌లో కచ్చితంగా ఉంటుంది. నిమ్మలో ఉండే విటమిన్ సీ చర్మం మెరిసిపోడానికి తోడ్పడుతుంది. ఉదయం లేవగానే పరగడుపున ఒక గ్లాస్ గోరువెచ్చని నీళ్లలో నిమ్మ, తేనే కలిపి తాగితే చర్మం నిగనిగలాడుతుంది. చర్మ లోపలి కణాలలోని నల్లటి మచ్చలను, ముడతలను పోగొడుతుంది. అలాగే నల్లటి వలయాలు ఉంటే ప్రాంతాల్లో నిమ్మతో రుద్దితే నలుపు తగ్గుతుంది.

యాపిల్: ఈ పండు వల్ల కూడా ప్రయోజనాలు చాలా ఉన్నాయి. యాపిల్ పండును చిన్న, చిన్న ముక్కలుగా కోసి మిక్సీలో వేసి మిశ్రమాన్ని తయారు చేసుకోండి. తర్వాత ఇందులో కాస్త తేనె, రోజ్ వాటర్ కలుపుకోండి. ఆ తర్వాత ఆ ఫేస్‌ప్యాక్‌ను మీ చర్మంపై పూయండి. ఇలా కొన్నిరోజుల పాటు క్రమం తప్పకుండా చేస్తే, నల్లటి మచ్చలు తొలగిపోయి చర్మం మంచి నిగారింపు పొందుతుంది. చర్మం పొడిబారడం, పగుళ్ల వంటి సమస్యలు కూడా ఉండవు.

ఆరెంజ్: ఆరెంజ్ లో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. యాపిల్ లాగానే ఇందులో ఉంటే విటమిన్స్ చర్మాన్ని అందంగా తయారు చేస్తాయి. ఆరెంజ్ పండ్ల తొక్కలను ఎండబెట్టి పొడిచేసి దీన్ని నేచరల్ స్రబ్ గా ఉపయోగించుకోవచ్చు.

బొప్పాయి: చర్మ సౌందర్యానికి ఈ పండు ఎంతో ఉపయోగపడుతుందని మన పెద్దలు చెబుతుంటారు. ఈ పండు రసాన్ని ముఖానికి ఫేస్‌ప్యాక్‌గా వేసుకుంటే ముఖంపై ఏర్పడిన మచ్చలకు, మొటిమలకే కాక, వివిధ చర్మ వ్యాధులను తగ్గించేందుకు చక్కగా పని చేస్తుంది. చర్మంపై ఏర్పడే మృత కణాలను, మృత చర్మాన్ని పోగొడుతుంది. ❄

... జీవితాల్లో నవ్వులు పూయిస్తూ

బంజారాహిల్స్ ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్. డిసెంబర్ నెలాఖరు కావడంతో చలి విపరీతంగా ఉంది. ఫుట్ పాత్ మీద, సర్కిల్ లాండ్ స్కేప్ పైన పాతికమంది దాకా ఉన్నారు. అందరూ వృద్ధులే. కొందరు ఎవరి ఒంటిమీద సరైన బట్టల్లేవు. డొక్కలోకి కాళ్లుముడుచుకుని పడుకున్నారు. చలిలో వణుకుతూ ఎలాంటి ఆచ్ఛాదనా లేకుండా పడి ఉన్న వాళ్లను చూసిన అర్చన కదిలిపోయింది. ఒక్క ఆ ప్రాంతంలోనే కాదు... జంటనగరాల్లో ఏ చోట చూసినా అవే దృశ్యాలు. ఇలాంటి వాళ్లకు ఏదో ఒక సాయం చేయాలి. చిన్న దుప్పటి ఇచ్చినా చాలు. వాళ్ల ముఖంలో చిన్న చిరునవ్వు చూడాలి అని నిర్ణయించుకుంది.



ఇదే విషయాన్ని తల్లితో షేర్ చేసుకుంది. కూతురి హృదయాన్ని అర్థం చేసుకున్న తల్లి 'నీ మనసులో ఏమనకుంటే అది చేయ్ ఆల్ ద బెస్ట్' అని చెప్పింది. అర్చన సురేశ్ కార్పొరేట్ కమ్యూనికేషన్ ప్రొఫెషనల్. 12 ఏండ్లు వివిధ మల్టీనేషన్ కంపెనీల్లో పనిచేసింది. యాహూ, హెచ్ఎస్‌బీసీ, మైక్రోసాఫ్ట్, ఐటీ హబ్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో వర్క్ చేసిన అనుభవం ఉంది. కానీ ఈ కార్యక్రమం ఎలా మొదలుపెట్టాలో తెలియదు. కానీ తల్లి ఇచ్చిన ధైర్యం అర్చనకు కొండంత బలం వచ్చింది. నగరంలో నిర్భాగ్యులకు ఒకపూట కడుపుండా తిండో, కప్పుకోడానికి బట్టో ఏదో ఒకటి ఇచ్చేందుకు ఓ బ్రహ్మాండమైన ఐడియా వచ్చిందామెకు.

అర్చన ఉండేది హైటెక్ సిటీలోని 'ఇందు ఫర్చ్యూన్ ఫీల్డ్స్' అనే గేటెడ్ కమ్యూనిటీలో. పదుల సంఖ్యలో కుటుంబాలు ఉంటాయి. అందరి నంబర్ తీసుకుని ఒక మెసేజ్ పాస్ చేసింది... 'మీకు అవసరం లేని బట్టలు, దుప్పట్లు ఉంటే ఇవ్వండి.. వాటిని సిటీలోని అభాగ్యులకు చేరవేద్దాం' అని. కొన్ని నిమిషాల వ్యవధిలో 40 మంది ముందుకొచ్చారు. ఒకతను సొంత ఖర్చుతో వెయ్యి పాంప్లెట్స్ ముద్రిస్తానని మాట ఇచ్చాడు. పైసా తీసుకోకుండా ఆ కరపత్రాలను న్యూస్ పేపర్లో పెట్టి ఇంటింటికీ వేస్తాను మేడం అంటూ వెండర్. అలా మొదలైంది 'బ్రింగ్ ఏ స్మైల్ ' హైదరాబాద్ నెట్‌వర్క్. 40 కుటుంబాల వాళ్లు ఒకరిని మించి ఒకరు సేవాభావంతో ఏడాదిపొడవునా జంటనగరాల్లోని బీదాబిక్కికి తోచిన సాయం చేశారు.

రోడ్డుసైడ్ నుంచి పిల్లల కోసం...

మొదట్లో బట్టలు, దుప్పట్లు లాంటి వాటితో సర్వీస్ మొదలైంది. తరువాత మెల్లిగా మురికివాడల్లోని పిల్లలు చదువుకునేందుకు పుస్తకాలు, బ్యాగులు, పెన్సిళ్లు పోగేసి ఇచ్చేవారు. తర్వాత ఒక్కో ఏరియా పెరుగుతూ వచ్చింది. కమ్యూనిటీ సర్వీస్ లాంటిది డెవలప్ అయింది. ఫేస్ బుక్‌లో పేజ్. వాట్సప్‌లో గ్రూప్. ఎవరికి ఏ అవసరం ఉన్నా చిన్న మెసేజ్ పెడితే చాలు. వ్యక్తులైనా, సంస్థలైనా.. ఎవరికి ఏం కావాలన్నా 'బ్రింగ్ ఏ స్మైల్' సమీకరించి పెడుతుంది. ట్రస్టుగా రూపాంతరం చెందాక బ్యాంక్ అకౌంట్, పాన్ నంబర్ కూడా తీసుకున్నారు. డైలీ ఈ ట్రస్టు నుంచి 6,500మంది ఏదో ఒక రూపంలో సాయం పొందుతుంటారు. 2015-16లో 56 మంది అనాథ పిల్లలకు చదువు చెప్పించారు. 2016 చలికాలంలో రోడ్డుమీదనే కాలం వెళ్లదీసేవారికి 2,300 దుప్పట్లను పంపిణి చేశారు. 2017 జూన్‌లో హైదరాబాద్, ఆదిలాబాద్ లో అనాథపిల్లలకు వెయ్యికి పైగా నోటు బుక్స్ అందజేశారు. వికలాంగులు కర్రీపాయింట్ లాంటి ఏదో ఒక వ్యాపారం పెట్టుకుని తమ సొంతకాళ్లమీద నిలబడతాం అని అర్థిస్తే, వారికి కొంత నగదు సాయం కూడా చేశారు. మరికొందరికి వీల్ చైర్లు ఇచ్చారు. మరో గ్రామంలో ఉపాధి కల్పించడం కోసం కుట్టు మిషిన్లను అందించారు. ప్రస్తుతానికి బ్రింగ్ ఏ స్మైల్ నెట్‌వర్క్ లో 200 దాకా ఉన్నారు. అందులో 50 మంది యాక్టివ్ పార్టిసిపేట్స్.

"సోషల్ మీడియా 'బ్రింగ్ ఏ స్మైల్'ని ఇంతపెద్ద సేవాసంస్థను చేస్తుందని అనుకోలేదు. స్కూల్ ఫ్రెండ్స్, కాలేజీ ఫ్రెండ్స్ నుంచి మొదట్లో డబ్బు సాయం కోరేందుకు ఇష్టపడలేదు. కానీ అవసరాలు మొహమాటాన్ని పోగొట్టాయి. ఏ సంస్థకైతే డబ్బుసాయం అవసరముందో దాతలంతా నేరుగా సంస్థలకే ఇచ్చేటట్టుగా చూడగలిగాను. వీలైనంత మందికి రశీదులు కూడా పంపించాను. ఒకసారి ఒక పేదమహిళకు రెండు ఇంజెక్షన్లేవో అవసరపడ్డాయి. వాటి ఖరీదు 70వేలు. ఆ విషయంలో వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాను. కొన్ని గంటల్లోనే, 'ఆ డబ్బంతా నేను సమకూరుస్తాను' అంటూ ఒకాయన 70వేలు తీసుకెళ్లి ఆవిడకిచ్చాడు. అప్పుడు నా హ దయం ఎంతగా పొంగిపోయిందో మాటల్లో చెప్పలేను" అంటారామె. ❄



దళిత మహిళా సర్పంచ్‌పై దౌర్జన్యం


భట్టిప్రోలు :దళిత మహిళా సర్పంచ్‌పై అధికార పార్టీకి చెందిన పాలకవర్గ సభ్యుడు లోకనాథం దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం అద్దెపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. ఉపాధి హామీ పథకం 14వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు పనులు జరిపించాల్సి ఉంది. అయితే సర్పంచ్‌గా తనకు తెలియకుండా ఈ రహదారి పనులు ఏవిధంగా జరిపిస్తారని గ్రామ సర్పంచ్ కంభం మరియమ్మ ఉప సర్పంచ్ సాయిబాబును నిలదీశారు. వారిరువురి మధ్య దూషణల పర్వం మొదలయ్యింది. ఈ నేపథ్యంలో సర్పంచ్ మరియమ్మపై పాలకవర్గ సభ్యుడైన లోకనాథం చెయ్యెత్తి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. మహిళా సర్పంచ్‌పై దురుసుగా ప్రవర్తించడం, ఆమెను దుర్భాషలాడడం సరైంది కాదని సాయిబాబు, లోకనాథం చర్యలను ఆ ప్రాంత గ్రామస్తులు ఖండించారు. దీంతో టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు కుక్కల భూషణరావు కలుగజేసుకుని ఈ పని ఎవరు చేయాలనేది మంత్రి ఆనందబాబు వద్ద తేల్చుకునేంత వరకు ఎవరు ప్రారంభించంకూడదని, పనిని నిలిపివేయాలని చెప్పడంతో ఇరువురు సమ్మతించారు. ఈమేరకు మంత్రిని కలిసి తేల్చుకునేందుకు వెళ్ళారు.

నేడు 'కాకినాడ' ఎన్నికల పోలింగ్

కాకినాడ:కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అధికారులు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో 241 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని పరీక్షించుకోనున్నారు. ఇప్పటికే పోలింగ్‌కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 48 డివిజన్లకు సంబంధించి 2,29,373 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం 196 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నీటి కోసం సుప్రీం కోర్టుకు

- అధికారులకు సీఎం ఆదేశం



అమరావతి:కృష్ణానది ప్రాజెక్టుల విషయంలో కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై సుప్రీం కోర్టుకు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జలవనరులశాఖ అధికారుల్ని ఆదేశించారు. ఈ వారంలోనే కోర్టును ఆశ్రయించే అవకాశం ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కృష్ణానదిపై ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు పూర్తిగా నిండుకున్నాయి. చుక్కనీరు లేదు. సెప్టెంబర్ వస్తున్నా నీరు ఒక్క అడుగు పెరగడం లేదు సరికదా, అంతకంతకూ తగ్గుతూనే వస్తోంది. మరోవైపు కర్నాటకలోని ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో కళకళలాడుతున్నాయి. నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన నీరు కూడా ఇవ్వడం లేదు. ఇప్పటి వరకూ అంతో ఇంతో ఆదుకుంటున్న తుంగభద్ర కూడా ఎండిపోతోంది. ఈ నేపథ్యంలో కోర్టును ఆశ్రయించడం మినహా ప్రభుత్వానికి మరోమార్గం లేదు. ఇదే పరిస్థితి మరి నాలుగు నెలలు కొనసాగితే రాష్ట్రంలో నీటి కరువు ఏర్పడే అవకాశం ఉంది. కృష్ణానదిలోకి పట్టిసీమ నీరు వస్తున్నా అది పైప్రాంతాలకు ఉపయోగం లేదు. నాగార్జునసాగర్లో ఉన్న నీటిని ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వాడుకుంటున్నారు. అది కూడా అంతకంతకూ అడుగంటిపోతోంది. ఈ నేపథ్యంలో పైభాగం నుండి రావాల్సిన నీటిని రాబట్టుకోవడం మినహా ప్రభుత్వానికి మరోమార్గం లేదు. కేసు వేశాక కూడా నీటిని విడుదల చేసే అవకాశం లేకపోయినా భవిష్యత్‌లో అయినా కొంత ఉపశమనం కలుగుతుందని సీఎం ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. ఒకే నదిపై ఉన్న రెండు ప్రాజెక్టుల్లో ఒకటి నిండి మరొకటి నిండకపోయినా ఆ ప్రాంతంలో ఉన్న ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కోర్టులు కూడా మానవతా దృక్పథంతో ఆదేశాలివ్వొచ్చనే ఆలోచనతో ప్రభుత్వ ముంది. అలాగే తెలంగాణతో నీటి పంపకాల విషయంలోనూ చర్చలు జరుగుతున్నాయి. నాగార్జునసాగర్ వద్ద రెండు రాష్ట్రాల మధ్య పెద్ద యుద్ధమే సాగుతోంది. నీటిని విడుదల చేయాలని ఏపీ, వద్దని తెలంగాణ అధికారులు వాదులాడుకుంటున్నారు. మరోవైపు కృష్ణాబోర్డు విషయాన్ని తేల్చకుండా నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోంది. దీనిపైనా త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఏదో ఒక విషయం తేల్చకపోతే సమస్య తీవ్రరూపం దాలుస్తుందని ఇటీవల జరిగిన సమావేశంలో బోర్డు దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో నీటి విషయంలో కోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

అగ్రశ్రేణి కట్టడాలకు దీటుగా ఐకానిక్ టవర్లు :సీఎం చంద్రబాబు

ప్రపంచంలోని పది అగ్రశ్రేణి కట్టడాలపై అధ్యయనం చేసి వాటికి దీటుగా అమరావతి ఐకానిక్ టవర్లను నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సచివాలయంలో రాజధాని ప్రాంత అభివద్ధి ప్రాధికార సంస్థ అధికారులు నిర్మాణ సంస్థ షాపూర్జీ-పల్లోంజీ ప్రతినిధులతో కలిసి సీఎం సోమవారం ట్విన్ టవర్ల నిర్మాణంపై వివరించారు. దుబాయ్‌లో బుర్జ్ ఖలీఫా వంటి కట్టడాలు ఉన్నాయని, మలేసియా, సింగపూర్ దేశాలలో ఈ తరహా నిర్మాణాలను చేపట్టారని సీఎం తెలిపారు.

ప్రయివేటీకరిస్తే ప్రతిఘటనే : మధు



అమరావతి:బీజేపీ, టీడీపీ పాలనలో ప్రయివేటీకరణ వేగం పుంజుకుంటోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం. మధు విమర్శించారు. ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రయివేటీ కరణకు వ్యతిరేకంగా ప్రజల్లో ప్రతిఘటన ప్రారంభమైందని తెలిపారు. విజయవాడలోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభలో ముందుగా సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు పాటూరు రామయ్యతో కలిసి మధు అమరవీరులకు పూలమాలల వేసి నివాళులర్పించారు. ప్రస్తుతం భోగాపురం విమానాశ్రయాన్ని, విజయవాడ, విశాఖపట్నం రైల్వే స్టేషన్లను ప్రయివేట్‌కు అప్పజేప్పేందుకు సాగుతున్న చర్యలకు ప్రతిఘటన ప్రారంభమైందని మధు తెలిపారు. దేశంలో పిపిపి పద్ధతిలో ప్రారంభించిన అనేక ప్రాజెక్టులు దివాళా తీస్తున్నాయని వివరించారు. వీటికి పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చిన ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా నేడు దివాళా తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్నీ కార్పొరేటీకరణ చేసేందుకు రైతాంగ విధానాలను ప్రభుత్వం పూర్తిగా మారుస్తోందని విమర్శించారు.



చట్టాల అమలులో వైఫల్యం

సీడబ్ల్యూఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి దెబంజన్ చక్రవర్తి

- నేటి నుంచి సీడబ్ల్యూఎఫ్ఐ కమిటీ సమావేశాలు

అమరావతి:భవన నిర్మాణ కార్మికుల కోసం 1996లో ఏర్పాటు చేసిన చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యూఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 11 ఏళ్ల తరువాత కూడా ఈ చట్టం పూర్తి రూపం దాల్చలేదని తెలిపారు. సీడబ్ల్యూఎఫ్ఐ 60వ జాతీయ కార్యవర్గ సమావేశాలను మంగళ, బుధ వారాల్లో విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేసింది. ఈ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చక్రవర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డుపై రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయన విమర్శించారు. దేశవ్యాప్తంగా 5.20 కోట్ల మంది భవన నిర్మాణ కార్మికులుంటే, కేవలం 1.20కోట్ల మందే బోర్డులో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. కార్మికులు బోర్డులో సభ్యత్వం తీసుకొనే విధంగా ప్రభుత్వాలు ప్రచారం చేయడం లేదన్నారు. బోర్డు నిధులను కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయడం లేదన్నారు. రూ.32,632 కోట్లు నిధులుంటే, కేవలం రూ.7,515 కోట్లు మాత్రమే కార్మికుల కోసం ఖర్చు చేసినట్లు స్టాండింగ్ కమిటీ పార్లమెంట్‌కు నివేదిక అందజేసిందని వివరించారు. మిగిలిన నిధులను ఏక్కడకి వెళ్లాయని పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. భవన నిర్మాణ కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని, అందులో భాగంగానే కార్మికులను కాకుండా యంత్రాలను ఉపయోగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రమాద బీమా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా అమలవుతోందని, దేశవ్యాప్తంగా ఒకే విధంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాగర్‌ను నిర్లక్ష్యం చేస్తే కేసీఆర్‌ను బజారుకీడుస్తం

నల్లగొండ, ఖమ్మం జిల్లాలు తెలంగాణలో లేవా..?

- ఉన్న ప్రాజెక్టుల్ని నిర్లక్ష్యం చేయడం అసమర్థత
- ప్రభుత్వాల అశ్రద్ధ వల్లే సాగర్‌కు నీటి కష్టాలు
- 7 లక్షల ఎకరాలు బీడుగా మారినా పట్టదా..
- ఎగువ రాష్ట్రాల ఇష్టారాజ్యంపై కేంద్రం స్పందించాలి
- 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలని సాగర్‌లో ధర్నా
- జలాశయంలోకి దిగి 'సాగర్ హారం'
- రైతాంగ ఆందోళనకు నాయకత్వం వహించిన తమ్మినేని



మాట్లాడుతున్న తమ్మినేని

నవతెలంగాణ - నల్లగొండ ప్రతినిధి

నాగార్జునసాగర్ ప్రాజెక్టును కావాలనే నిర్లక్ష్యం చేస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ బతుకును బజారుపాలు చేసేలా ఉద్యమిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. తాగు, సాగునీటి అవసరాల కోసం ఎగువ రాష్ట్రాల నుంచి నాగార్జునసాగర్‌కు కృష్ణాజలాల్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా సాగర్ ప్రాజెక్టు గేటు వద్ద ధర్నా చేశారు. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల నుంచి రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. ధర్నానుద్దేశించి తమ్మినేని మాట్లాడుతూ.. ఆధునిక దేవాలయంగా నాటి ప్రధాని నెహ్రూ అభివర్ణించిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆధారంగా నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లోని రైతాంగం, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు ఆర్థికంగా కొంత అభివృద్ధి చెందారని చెప్పారు. నేడు ప్రభుత్వాల నిర్లక్ష్యం, అశ్రద్ధ వల్ల ప్రాజెక్టు ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ ఏడాది జలాశయం ఒట్టిపోవడం వల్ల నీళ్ల కష్టాలు మాత్రమే రాలేదని ప్రాజెక్టు భవిష్యత్‌కు కష్టాలొచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు, వరదలకు నీళ్లు రావడం లేదనేది సమస్య కాదన్నారు. నీళ్లు వస్తున్నా సాగర్‌కు రాకుండా అడ్డుపడుతున్నందున ఈ ఏడాది జలాశయం అడుగంటిపోయిందన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఎగువ రాష్ట్రమైన కర్ణాటక ఆల్మట్టి నుంచి నీళ్లను దిగువకు రానివ్వకపోవడం వల్ల శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీళ్లు ఉండటం లేదన్నారు. బచావత్, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పుల మేరకు కేటాయించిన నీళ్లను వినియోగించడంలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు విఫలమవుతన్నాయని విమర్శించారు. సాగర్ ఎండిపోతున్నా..? ఎడమ కాల్వ కింద 7 లక్షల ఎకరాల ఆయకట్టు బీడుగా మారినా..? వేలాది గ్రామాల్లో లక్షలాది మంది తాగునీటికి అల్లాడుతున్నా..? ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శ్రద్ధలేకపోవడం విచాకరమన్నారు. రాష్ట్రంలో నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, హైదరాబాద్ ప్రాంతాలున్నాయా..? లేవా అని ప్రశ్నించారు. ఉన్న ప్రాజెక్టుల్ని నిర్లక్ష్యం చేస్తే అసమర్థ సీఎంగా మిగులుతారని హెచ్చరించారు. కేంద్రం నుంచి ఒత్తిడి తెచ్చి కర్ణాటకలోని అల్మట్టి, నారాయణపూర్ నుంచి నీళ్లను విడుదల చేసి సాగర్, శ్రీశైలం జలాశయాల్ని నింపాలని డిమాండ్ చేశారు. ఉన్న ప్రాజెక్టుల్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం కమీషన్లు వచ్చే కొత్త ప్రాజెక్టులకు వేల కోట్లు ఖర్చు చేస్తోందని విమర్శించారు. నాగార్జునసాగర్ నీటి సమస్య పరిష్కారం కోసం తాము చేస్తున్న ఈ పోరాటంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన రైతులు, కూలీలు, వృత్తిదారులు కలిసి రావాలని పిలుపునిచ్చారు.


సాగర్ గేట్ల వద్ద ఉద్రిక్తత... నీటిలో సాగర హారం

సాగర్‌కు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ధర్నా అనంతరం రైతులు ర్యాలీ నిర్వహించారు. సాగర్ జలాశయంలోకి వెళ్లి నీటి మట్టాన్ని పరిశీలిస్తామని చెప్పి డ్యామ్ గేట్లు తీయాల్సిందిగా పోలీసుల్ని కోరారు. అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. తోపులాట చోటుచేసుకుంది. చివరికి గేట్లు తీయడంతో వేలాది మంది రైతులు ఎర్త్ డ్యామ్ మీద నడుచుకుంటూ వెళ్లి జలాశయంలోకి దిగారు. అడుగంటిన నీటిని తమ్మినేని, జూలకంటి, పోతినేని ఇతర నాయకులు, రైతులు పరిశీలించారు. ప్రతి ఏటా ఆగస్టు ప్రాంతంలో నిండుకుండగా ఉండే జలాశయం ఈసారి ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జలాశయంలో సాగర్ హారం నిర్వహించారు.

కార్యక్రమంలో సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట నాయకులు నున్నా నాగేశ్వర్‌రావు, తుమ్మల వీరారెడ్డి, బండ శ్రీశైలం, పులిచింతల వెంకట్‌రెడ్డి, డబ్బీగార్ మల్లేశ్, మామిడి సర్వయ్య, పారెపల్లి శేఖర్‌రావు, నగేష్, రాంబాబు, హాషం, వి. వెంకటేశ్వర్లు, పల్లా వెంకట్‌రెడ్డి, కందాల ప్రమీళ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలో పెరుగుతున్న నీటిమట్టం

- ఇన్‌ఫ్లో 11,652 క్యూసెక్కులు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

ఉత్తర తెలంగాణ ప్రాంతానికి జీవనాధారంగా ఉన్న శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం స్వల్పంగా పెరుగుతున్నది. గోదావరి పరీవాహక ప్రాంతంలో గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఈ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 90.31 టీఎంసీలు కాగా సోమవారం 28.68 టీఎంసీలకు చేరింది. రిజర్వాయర్‌లో ఇన్‌ఫ్లో 11,652 క్యూసెక్కులుగా నమోదయింది. గత సంవత్సరం కూడా ఈ ప్రాజెక్టులోకి నీరు సెప్టెంబర్ నెలలలోనే రావడంతో రబీలో పూర్తిస్థాయిలో పంటలు పండాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో నామమాత్రంగానే ఉన్నది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 17.80 టీఎంసీలు కాగా 2.44 టీఎంసీలుగా ఉన్నది. ఇన్‌ఫ్లో 1,427 క్యూసెక్కులుగా ఉన్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో కూడా నీటి మట్టం స్వల్పంగా పెరుగుతున్నది. ఈ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో 6,366 క్యూసెక్కులుగా నమోదయింది. లోయర్ మానేర్ డ్యాంలో నీటి నిల్వ సామర్థ్యం 24.07 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 7.29 టీఎంసీలు మాత్రమే ఉన్నది. సింగూరు ప్రాజెక్టులో పరిస్థితి ఆశాజనకంగా ఉన్నది. ఈ ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా సోమవారం 20.34 టీఎంసీలకు చేరింది. ఈ ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో 7,093 క్యూసెక్కులుగా ఉన్నది. కాగా కృష్ణా బేసిన్‌లోని ప్రధాన ప్రాజెక్టుల్లో పరిస్థితి యధాతథంగా కొనసాగుతున్నది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో ఇన్‌ఫ్లో పెరగలేదు. సెప్టెంబర్‌లో కురిసే వర్షాలతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు నీరు వచ్చే అవకాశం ఉన్నదని ఇంజనీర్లు భావిస్తున్నారు.


శాస్త్రీయబద్ధంగా పునర్వర్గీకరణ : బీసీ కమిషన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాస్త్రీయబద్ధంగా బీసీ కులాల పునర్వర్గీకరణ చేపట్టాలని బీసీ కమిష న్ నిర్ణయించింది. ఇందుకుగాను వివిధ కమిషన్లు ఇచ్చిన నివేదికలను పరిగణలోకి తీసు కోనుంది. ప్రస్తుతం అమలులో ఉన్న జాబితా ప్రకారమే బీసీ కులాలు, సంచార జాతులు, ఎంబీసీలను గుర్తించనుంది. సోమవా రం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవ నరుల అభివృద్ధి సంస్థలో బీసీ కమిషన్ చైర్మెన్ బీఎస్ రాము లు అధ్యక్షతన పలు సామాజిక పరిశో ధన సంస్థల అధిప తులు, సామాజిక, ఆర్థిక, ఆంత్రొపాలజీ, పలు విశ్వ విద్యాల యాల అధ్యాపకులతో వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ సదస్సులో బీసీ కులాల జాబితా, సంచా ర కులాలు, ఎంబీ సీల గుర్తింపుపై విస్తృతంగా చర్చించింది. ఎంబీసీల గుర్తిం పు, సంచార జాతులు, బీసీ జాబితా గురించి కాకాకాల్కేర్, మండల్ కమిషన్ నివేదికలు, సంచార కులాలకు సంబంధిం చిన బాలకృష్ణ రెనెకె, ఇడాటే కమిషన్ నివేదికలలోని సిఫార్సులు, తమిళ నాడు రాష్ట్రానికి చెందిన సత్యనాధన్, జస్టిస్ జనార్ధనమ్, కర్ణాటకకు చెంది న హావనూర్ కమిషన్, ఓ చిన్నప్పరెడ్డి, వెంకటస్వామి కమిషన్, కేరళకు చెందిన కుమార పిళ్లై దామోదరన్ కమిషన్ల నివేదికల సిఫార్సులను సమా వేశం చర్చించింది.

పోరాట ఫలితమే.. ఆర్‌పీడీ 2016 చట్టం

- ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలి
- వికలాంగులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలి: ఎన్‌పీఆర్‌డీ అఖిలభారత ఉపాధ్యక్షుడు నాగరాజు



మాట్లాడుతున్న నాగరాజు

నవతెలంగాణ - సంగారెడ్డి అర్బన్

వికలాంగుల నాలుగేండ్ల అవిశ్రాంత పోరాట ఫలితంగానే వికలాంగుల హక్కుల చట్టం (ఆర్‌పీడీ 2016) అమల్లోకి వచ్చిందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) ఆలిండియా ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఈ చట్టం ద్వారా వికలాంగులకు కొంతమేరకైనా హక్కులు సాధించుకునే అవకాశం కలుగుతున్నదని చెప్పారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ద్వితీయ మహాసభ రెండో రోజు సోమవారం ప్రతినిధుల సభ జరిగింది. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఆర్‌పీడీ చట్టాన్ని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. వికలాంగులకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'దివ్యాంగ్' అనే పేరు పెట్టారని, దాని వల్ల వారికి ఒరిగిందేమీ లేదని అన్నారు. వికలాంగులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీని కోసం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు మొత్తం వికలాంగుల్లో 20శాతం మందికి కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా, ఉద్యోగావకాశాల్లో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ పోరాటం నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒకే చైర్మెన్ ఉన్న కమిటీతో న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని అవసరం మేరకు విస్తరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ మాట్లాడుతూ.. గతంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలపై మహాసభలో సమీక్ష నిర్వహించామన్నారు. ఈ సభల్లో పలు తీర్మానాలు ఆమోదించినట్టు చెప్పారు. సభ్యులు తెలిపిన సవరణలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు.

విద్యుత్ ఉద్యోగుల విభజన పూర్తిచేయండి

- 'టీస్పీ' ఆధ్వర్యంలో మహాధర్నా



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సంస్థల్లో ఉద్యోగుల విభజనను సత్వరం పూర్తిచేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టిస్పీ) డిమాండ్ చేసింది. సోమవారంనాడిక్కడి విద్యుత్‌సౌధలో టిస్పీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి సంపత్‌కుమార్, పి రత్నాకరరావు మాట్లాడారు. స్వరాష్ట్రం ఏర్పడి మూడేండ్లు దాటినా ఇంకా విద్యుత్ సంస్థల్లో ఉద్యోగుల విభజన పూర్తి కాలేదని, దీనిపై ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఆంధ్రాస్థానికత పేరుతో 1,253 మంది ఉద్యోగుల్ని విద్యుత్ సంస్థల నుంచి రిలీవ్ చేసి, మూడేండ్లుగా వారిని కూర్చోబెట్టి జీతాలు చెల్లిస్తున్నారని, ఇది తెలంగాణ విద్యుత్ సంస్థలపై ఆర్థికభారాలకు దారితీస్తున్నదని అన్నారు. పదోన్నతుల విషయంలో ఆంధ్రా స్థానికత రిలీవ్ ఉద్యోగులు కోర్టుల్లో కేసులు వేయడాన్ని వారు తప్పుపట్టారు. దీనివల్ల ఉద్యోగుల విభజన సమస్య మరింత జటిలమౌతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రప్రభుత్వం ఈ కేసుల్ని వాదించేందుకు సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాదిని నియమించాలని డిమాండ్ చేశారు. 9, 10 షెడ్యూల్ సంస్థల విభజనపై గవర్నర్ అధ్యక్షతన వేసిన మంత్రుల కమిటీ విద్యుత్ ఉద్యోగుల అంశాన్ని పరిష్కరించాలని కోరారు. అనంతరం 'టిస్పీ' నేతలు టీఎస్‌జెన్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావును కలిసి వినతిపత్రం సమర్పించారు.

అగ్రిగోల్డ్ చైర్మెన్‌కు హైకోర్టులో చుక్కెదురు

- బెయిల్ పిటిషన్‌ను తోసివేత

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అగ్రిగోల్డ్ కంపెనీ తెలుగు రాష్ట్రాల్లో ప్రజల నుంచి చిన్న మొత్తాల్లో సేకరించిన డిపాజిట్లలో రూ.600 కోట్ల వరకు తమ అనుబంధ కంపెనీల్లోకి మార్చేసినట్టు ఆధారాలున్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఉద్దేశపూర్వకంగానే భారీ మొత్తాలను మళ్లించినట్టుగా తమ వద్ద ప్రాథమిక సాక్ష్యాలున్నాయని హైకోర్టు న్యాయమూర్తి తాళ్లూరి సునీల్ చౌదరి వెలువరించిన తీర్పులో పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో తనకు సీఆర్‌పీసీ 438 సెక్షన్ కింద బెయిల్ మంజూరు చేయాలని అగ్రిగోల్డ్, దాని అనుబంధ కంపెనీలకు డైరెక్టర్, వైస్ చైర్మెన్ ఎం.బానోజీరావు దాఖలు చేసిన పలు పిటిషన్లను న్యాయమూర్తి డిస్మిస్ చేశారు. తాను కంపెనీలో కేవలం ఉద్యోగిని మాత్రమేనన్న బానోజీరావు వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. 13 కంపెనీల్లో డైరెక్టర్, వైస్ చైర్మెన్‌గా ఉన్నారని, డైరెక్టర్ పదవిని 2011లో రెన్యువల్ చేసుకున్నట్టు కంపెనీ డైరెక్టరేట్ రికార్డులు చెబుతున్నాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల పీపీల నివేదికల్లో కూడా వీటి గురించి స్పష్టం అవుతోందని వ్యాఖ్యానించారు. భారీ డిపాజిట్ల సేకరణకు డైరెక్టర్ కీలకకపాత్ర పోషిస్తారని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఇలాంటి కీలక కేసుల్లో ముందస్తు బెయిలు ఇవ్వడం సాధ్యం కాదని, ఎఫ్ఐఆర్‌లో ఆయిన పేరు లేకపోయినా ముందస్తు బెయిలు మంజూరు సాధ్యం కాదని న్యాయమూర్తి తన తీర్పులో తేల్చి చెప్పారు. 32 లక్షల మంది నుంచి రూ.6,300 కోట్ల డిపాజిట్లుగా వసూలు చేశారంటే ఆషామాషీ అంశం కాదన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక నుంచి అగ్రిగోల్డ్ 1,19 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయడాన్ని బట్టి ఆర్థిక నేర తీవ్రత, బాధితుల గోస స్పష్టం అవుతోందన్నారు.



బెర్కిలీలో జాతివిద్వేష ర్యాలీ

వాషింగ్టన్ : అమెరికాలోని నగరాల్లో వారాంతాలు ఉద్రిక్త వాతావరణం నెలకొంటున్నది. శ్వేతజాతి దురహంకారులు దేశవ్యాప్తంగా పలు నగరాల్లో విద్వేషాన్ని రగిల్చే ర్యాలీలని చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలిఫోర్నియాలోని బెర్కిలీ నగరంలో ఆదివారం అతివాద శ్వేత జాతీయులు, దురహంకారులు చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తంగా సాగింది.

వీరికి వ్యతిరేకంగా నగరంలో మరో గ్రూపు 'ర్యాలీ అగేయినెస్ట్ హేట్'ను నిర్వహించింది. ఈ ర్యాలీలో ప్రధానంగా నగరానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ దురహంకారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'నాజీస్ గో హెూం', 'నో హేట్, నో ఫియర్', 'నాజీస్ గెట్ అవుటాఫ్ హియర్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మరోపక్క జాతీయ అతివాదుల, శ్వేతజాతి దురహంకారులు నగరంలో అక్కడక్కడా పదుల సంఖ్యలో గుమిగూడి ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రదర్శనల్లో పాల్గొనేవారెవరైనా మాస్కులు ధరించరాదని పోలీసులు ముందస్తు షరతులు విధించారు. కానీ మాస్కులు ధరించి హింసాయుత చర్యలకు పాల్పడే ప్రయత్నం చేశారని ఈ గ్రూప్‌లోని 14 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

అఫ్ఘాన్‌లో ఉగ్రదాడి 13మంది మృతి

నవా(అఫ్ఘనిస్థాన్): ఉగ్రవాద ప్రతీకార దాడితో అఫ్ఘనిస్థాన్ దక్షిణ హెల్మండ్ ప్రాంతం నెత్తురోడింది. ఆదివారం సాయంత్రం నవా జిల్లాలో జరిగిన ఆత్మాహుతి దాడిలో ఇప్పటి వరకు 13 మంది మృతి చెందారు. దోపుల్ ప్రాంతంలో వాహనంలో వచ్చిన ఓ ఉగ్రవాది మానవ బాంబుగా మారి పేల్చుకోవటంతో ఈ దారుణం చోటు చేసుకుంది. తొలుత ఇద్దరు మాత్రమే చనిపోయారని అధికారులు ప్రకటించినప్పటికీ ఆ సంఖ్య ఇప్పుడు 13కు చేరింది. చికిత్స పొందుతున్న వారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉందని చెబుతుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.



హూస్టన్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు

హూస్టన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రాన్ని 'హార్వే' అతలాకుతలం చేసింది. ఈ వర్షాల వల్ల సుమారు ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, 14మంది గాయపడ్డారు. హార్వే ధాటికి టెక్సాస్ రాజధాని హూస్టన్ పూర్తిగా దెబ్బతిన్నది. టెక్సాస్ చరిత్రలోనూ ఇది అతిపెద్ద తుఫాను. హరికేన్ హార్వే వల్ల గత రెండు రోజుల్లో సుమారు 75 సెంటీమీటర్ల వర్షం పడింది. దీంతో రోడ్లు అన్ని నదులుగా మారిపోయాయి. భారీ స్థాయిలో వరద నీరు సిటీని ముంచెత్తింది. ఒక్క వారంలోనే సంవత్సరం వర్షం పడినట్టు వాతావరణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. హూస్టన్‌లో ఉన్న ప్రస్తుత పరిస్థితి అసాధారణమని, 'హార్వే' 4వ కేటగిరి తుఫాన్‌గా ప్రారంభమైందని అమెరికా వాతావరణశాఖ పేర్కొన్నది.

హూస్టన్ వర్సిటీలో చిక్కుకున్న 200 మంది భారతీయ విద్యార్థులు

హార్వే తుఫాన్‌లో భారతీయ విద్యార్థులు చిక్కుకున్నారు. హూస్టన్ వర్సిటీలో సుమారు 200 మంది భారతీయ విద్యార్థులు చిక్కుకున్నట్టు కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ సోమవారం తెలిపారు. గత మూడు రోజులుగా హూస్టన్‌లో భారీ వర్షాలు పడుతున్నాయి. ఆకస్మికంగా పోటెత్తుతున్న వరదల వల్ల కూడా హూస్టన్ యూనివర్సిటీ పూర్తిగా జలమయం అయ్యింది. అయితే నీటిలో చిక్కుకున్న భారతీయ విద్యార్థులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. హూస్టన్‌లో ఉన్న ఇండియన్ కౌన్సల్ జనరల్ అనుపమ్ రాయ్‌తో మాట్లాడినట్టు ఆమె తెలిపారు. విద్యార్థులు ఉన్న వర్సిటీ ప్రాంతంలో నీళ్లు పీకల్లోతు వరకు ఉన్నాయని, ఆ విద్యార్థులకు ఆహారాన్ని చేరవేసేందుకు భారత్ చేసిన ప్రయత్నాలను అమెరికా కోస్టు గార్డులు తిరస్కరించారని, రెస్క్యూ బోట్లు లేని కారణంగా సహాయాన్ని నిరాకరించినట్టు సుష్మా ట్వీట్ చేశారు. ప్రస్తుతం స్థానిక పోలీసులు వరద సహాయక కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

బీచ్‌లో విషపూరిత గాలులు

లండన్ : క్లోరిన్ వాయు మేఘాలు ఇంగ్లండ్‌లోని తూర్పు ససెక్స్‌లో కలకలం రేపాయి. బీచ్‌లో సేద తీరుతున్న ప్రజలను విష వాయువు తాకడంతో కళ్ల మంటలు, గొంతు రాజుకుపోవడం, ఊపిరాడకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని 233 మందికి పైగా బాధితులను అంబులెన్స్‌ల సాయంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఒక్కసారిగా వచ్చిన విష వాయు మేఘం నుంచి విపరీతమైన దుర్వాసన వచ్చిందని బీచ్‌లోని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు.

జైలుపాలైంది కొద్దిమందే..

బిలియనీర్లను ఆందోళనకు గురిచేసిన 'శాంసంగ్' వారసుడి జైలు శిక్ష

అవినీతి కుంభకోణం కేసులో 'శాంసంగ్' గ్రూప్ వారసుడు, వైస్ ఛైర్మన్ లీ జే యాంగ్‌కు ఐదేండ్ల జైలు శిక్ష పడటం..ప్రపంచవ్యాప్తంగా శతకోటీశ్వరుల్ని కొంత ఆందోళనకు గురిచేసింది. ఏదో ఒక రోజు తమ అవినీతి బాగోతం బయటపడితే... పరిస్థితి ఇలాగే ఉంటుందేమోనన్న భయం వారిలో ఏర్పడింది. చరిత్రలో లీ జే యాంగ్ లాంటివారికి కొదవ లేదు. కానీ ఒక ప్రపంచ ప్రఖ్యాత వ్యాపార సామ్రాజ్యానికి వారసుడు జైలు పాలవటం ఇదే మొదటిసారి. లీ జే యాంగ్ బాటలో నడిచి..ఆయనలాగా జైలుపాలైన కొద్దిమంది వ్యాపార ప్రముఖుల గురించి తెలియజేసే కథనం ఇది...



మిఖాయిల్ ఖోదోర్కొవస్కీ లీ జే యాంగ్

సియోల్: ఒక శతకోటీశ్వరుడిగా తానేం చేసినా చెల్లుతుందని ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల సంస్థ శాంసంగ్ గ్రూప్ వారసుడు, వైస్ ఛైర్మన్ లీ జే యాంగ్ భావించాడు. ప్రతిఫలంగా పెద్ద మూల్యం చెల్లించుకున్నాడు. ఐదేండ్లు జైలు శిక్షకు గురయ్యాడు. రాజకీయంగా పరిస్థితులు ప్రతికూలంగా మారటంతో, కోర్టు ముంగిట దోషిగా నిలబడాల్సి వచ్చింది. దక్షిణ కొరియాలో చోటుచేసుకున్న అవినీతి కుంభకోణంలో ఎంతోమంది వ్యాపార ప్రముఖులకు పాత్ర ఉందని, లీ జే ఒక్కడినే శిక్షించటం సరైంది కాదన్న వార్తలు కూడా వెలువడ్డాయి. అయితే ఇది కేవలం దక్షిణ కొరియా ఆర్థికరంగానికే పరిమితమైన అవినీతి కాదు, రాజకీయ అవినీతి కూడా ఇందులోఉంది. కాబట్టే దేశాధ్యక్షురాలిగా ఉన్న పార్క్ గ్యూయిన్ హైకు వ్యతిరేకంగా ప్రజలంతా ఏకమవ్వాల్సి వచ్చింది. కొద్ది నెలలపాటు దేశవ్యాప్తంగా రాజకీయ అస్థిరత కూడా ఏర్పడిం ది. తిరిగి ఎన్నికలు జరగటం ప్రధాన ప్రతిపక్ష నేత మూన్ జే-ఇన్ గెలవటంవంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. మొత్తంగా చూస్తే...ఈ అవినీతి కుంభకోణాలు దక్షిణ కొరి యా, జపాన్ వ్యాపార వర్గాల్ని (ఎల్జీ, హెూండా, సోనీ, లొట్టో, సుజికీ, కవాసకీ) ఆలోచనలో పడేశాయి.

ఐస్‌లాండ్ బ్యాంకింగ్ రంగ ప్రముఖులు

ఐస్‌లాండ్‌లో 2008లో చాలా తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. స్టాక్‌మార్కెట్ వ్యవహారాల్ని తారుమారు చేయటం, మోసాలు, ఆర్థిక నేరాలు పెరిగిపోయాయి. ఆర్థిక నేరాల కారణంగా 26 మంది బ్యాంకర్లను అరెస్టు చేసి, జైల్లో బంధించారు. అలా అరెస్టయి...జైలు పాలైన వారిలో ఐనార్సన్, సిగుర్డ్‌సన్ అనే బ్యాంకింగ్ రంగ ప్రముఖులు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా జైలులో లాండ్రీ పనులు, జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేయటం చేస్తూ గడుపుతున్నారు.

బెర్నీ మాడాఫ్..పోంజీ స్కీమ్

అమెరికా స్టాక్‌మార్కెట్ 'వాల్‌స్ట్రీట్'ను కుదిపేసిన వ్యక్తి బెర్నీ మాడాఫ్. స్టాక్‌మార్కెట్ మోసాల చరిత్రను ఇతడు తిరగ రాశాడని చెప్పటం అతిశయోక్తి కాదు. అమెరికాలో ఇతడు 'పోంజీ' స్కీమ్‌ను నిరాకాటంగా కొన్ని దశాబ్దాలపాటు నడిపాడు. ఈ స్కీమ్‌లో చేరినవారి నుంచి 65 బిలియన్ డాలర్లను సేకరించాడు. ప్రభుత్వాలకు లెక్కాపత్రం ఇవ్వకుండా ఈ నిధుల్ని దారిమళ్లించాడు. బాగోతం బయటపడింది. స్కీమ్‌లో చేరినవారు తమడబ్బు తమకు ఇవ్వాలనిడిమాండ్ చేస్తే 300 మిలియన్ డాలర్లు (రూ.1900 కోట్లు) మాత్రమే ఉన్నాయని చేతులుపైకెత్తాడు. కోర్టుఇతడికి 150ఏండ్ల జైలు శిక్ష వేసింది.

మిఖాయిల్ ఖోదోర్కొవస్కీ

1990లో రష్యాలో కమ్యూనిస్టుల పాలన కుప్పకూలటం, చమురు, ఖనిజాల తవ్వకం వంటి ముఖ్య వనరులు ప్రయి వేట్ వ్యక్తుల పరమయ్యాయి. రష్యా ప్రధాన ఆదాయ వనరు చమురు ఉత్పత్తి. అలాంటి రంగం బడాపారిశ్రామిక వేత్తల చేతుల్లో చిక్కింది. అలా చమురు రంగంపై పట్టుసాధించిన వ్యక్తుల్లో మిఖాయిల్ ఖోదోర్కొవస్కీ ముఖ్యుడు. సోవియట్ యూనియన్ పతనమైన కొద్ది సంవత్సరాలలోనే చమురు రంగ వ్యాపారంలో వేల కోట్లు సంపాదించాడు. అతడు 15 బిలియన్ డాలర్ల(సుమారుగా రూ.95 వేల కోట్లు) వ్యాపార సామ్రాజ్యాన్ని ఏర్పరుచుకున్నాడు. 2003లో ఇతడి ఆర్థిక నేరాలు బయటపడ్డాయి. మోసం, ప్రభుత్వ నిధుల్ని దారిమళ్లించటం, పన్ను ఎగవేత, మనీ లాండరింగ్ వంటి ఆరోపణలు నమోదయ్యాయి. మిఖాయిల్ ఖోదోర్కొవస్కీ, అతడి వ్యాపార భాగస్వామి ప్లాటన్ లెబెదెవ్‌ను కూడా దోషిగా తేలి జైలుపాలయ్యారు. 12 ఏండ్లు జైలు శిక్ష అనంతరం 2014లో వీరు విడుదలయ్యారు.

'సోషల్' సోయి సర్కారుకు ఏదోయీ!

- సామాజిక మాధ్యమాలే తెలంగాణ యువతకు వేదిక
- సమస్త అంశాలపై తెలివైన, లోతైన, ఆలోచింపజేసే సమాలోచనలు
- మీడియా వెలితి తీర్చుకుంటున్నామంటూ వ్యాఖ్య

ఇల్లెందుల దుర్గాప్రసాద్

రాబోయే ఎలక్షన్లలో యువత భాగస్వామ్యం ఎంత పెరిగితే..అంత ప్రభావవంతమైన తీర్పు వస్తుందని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పలువురు విద్యావంతులు పేర్కొన్నారు. ప్రాతిపదిక ఏంటి..? అని 'నవతెలంగాణ' ప్రత్యేక ప్రతినిధి అడిగితే..పాలకుల అసలు స్వరూపాన్ని సోషల్, డిజిటల్ మీడియాలో ఆ రేంజ్‌లో యూత్ ఫాలో అవడమే అంటూ బదులిచ్చారు. యువజనులు, విద్యార్థులు, నిరుద్యోగులు వంటి ఆయా సెక్టార్ల పౌరులు ఎవరికి వారు తెలివైన, చురుకైన, లోతైన, ఆలోచింపజేసేలా విశ్లేషణాత్మకమైన షార్ట్ పోస్టింగులను విస్తారం చేస్తున్నారని ఉటంకించారు. అయినా.. దిద్దుబాటు సోయి ఈ సర్కారుకు ఎక్కడుందన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఈ మధ్య టాక్ ఆఫ్ ద స్టేట్ అయింది. అంతేనా..తాజాగా సాక్షాత్తూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రతిధ్వనించింది. కారణమేంటో మదికి ఈపాటికే కనెక్టయి ఉంటుంది కదూ! ఎస్..మీరు ఊహించింది రైట్. అదే నేరెళ్ల దమనకాండ. ఉన్నతాధికారి డైరెక్షన్‌లో కొందరు ఖాకీల క్రూరత్వానికి స్థానిక బహుజనుల జీవితాలు నిస్తేజమయ్యాయి. నిజానికి దానిపై ప్రజానుకూల మీడియా తప్ప మెయిన్ స్ట్రీమ్‌గా చెప్పుకొనే కొన్ని పత్రికలు, చానెళ్లు ధైర్యంగా కవర్ చేయలేదు. ఏదో అచ్చు వేసీ వేయనట్టు, చెప్పీ చెప్పనట్టు, చూపీ చూపనట్టు నాటకం ఆడాయనే ఫీలింగ్ ఆ జిల్లాలో ని అనేకుల్లో నాటుకొంది. కానీ, ఆ వెలితిని వాట్సప్, ఫేస్‌బుక్, డిజిటల్ మీడియా లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా తీర్చుకోగలిగామని తేల్చి చెప్పారు. తమ మనోభావాలు, అభిప్రాయాలు సోషల్ మీడియా కేంద్రంగా పరస్పరం షేర్ చేసుకు న్నామని తెలిపారు. ఇసుక లారీలపై తిరుగుబాటు తర్వాత పోలీసుల భయానక దుశ్చర్యలు ప్రతి ఒక్కరినీ కలిచివేశాయని ప్రస్తావించారు. ప్రతిపక్షాల తోపాటు సాధారణ ప్రజల్లోనూ ఈ స్థాయిలో తీవ్రమై న వ్యతిరేకత రాకుంటే..మున్ముందు మరిన్ని అనర్థా లు సంభవించేవని ఒకింత ఆందోళన వెలిబుచ్చారు. ఈ 'సోషల్' జాగృతానికి భావాలే ఇంధనంగా, మొబైల్ ఫోన్లే వాహకాలయ్యాయని గుర్తు చేశారు. కీర్తి ప్రతిష్టలు, గౌరవ సూచకాలంటూ పైకి ఏవి ప్రకటించినా ప్రస్తుతానికి జిల్లా ఎస్పీని కదిలించడం గమనించాల్సిన అంశమని ఉటంకించారు.

రూపాలు వేరు..అణిచివేత ఒక్కటే

నేటి పాలకులు తెలంగాణ ఉద్యమంలో మెదిలిన తీరుకు, ఇప్పుడు అనుసరిస్తున్న వైఖరిలో తేడాను జిల్లా ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు. నాటి, నేటి మాటలు, చేతల వీడియో, ఫొటో క్లిప్స్ వ్యాప్తిలోకి రావడాన్ని గుర్తు చేస్తున్నారు. ఉద్యమ కాలంలో పోలీసులపట్ల ఇప్పటి అధికార పార్టీ నేతలు, మంత్రులు కొందరు ఎట్లా ప్రవర్తించారో కండ్లకు కడుతున్న పాత దృశ్యాలు సెల్‌ఫోన్ తెరల్లో చక్కర్లు కొట్టడాన్ని చర్చకు పెడుతున్నారు. జీవించే స్వేచ్ఛకు, కనీస హక్కులకు, ఆఖరికి దారెంట పోతుంటే రక్షణ ప్రశ్నార్థకమైన కోణంలోనే ఇసుక లారీలకు అగ్గి పెట్టడాన్ని చూడాలన్నారు.

కానీ, సంయమనం పాటించకుండా, సానుభూతి చూపకుండా స్వయానా సీఎం కటువుగా కామెంట్ చేయడాన్ని వాళ్లు మరిచిపోవడంలేదు. ఎప్పటికప్పుడు తమ ఒపీనియన్నును అనేక మంది సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారని ఆ జిల్లాలో పర్యటించిన 'నవతెలంగాణ' ప్రత్యేక ప్రతినిధికి చెప్పారు. తాము చెప్పిందే వేదం, చేసిందే శాసనమన్నట్టుగా 'ముఖ్య'మైన పెద్దల మనస్తత్వం తరచూ ఏదో రూపంలో బహిర్గతమవుతూనే ఉన్నదంటూ నేరెళ్ల ఉదంతం, కోదండరాం యాత్రల అడ్డగింపు లాంటి అనేక విషయాలను ఉదహరిం చారు. అణిచివేయడమే అసలు ఉద్దేశమని అందరికీ అర్థమవుతోందన్నారు.



ఫైల్

ప్రజలు ఏమనుకుంటున్నారో గ్రహిస్తే కదా!

తమను తామే స్తుతించుకోవడంపై ఏలికలు ధ్యాస పెట్టడం ఎక్కువైందనే భావన జనంలో నెలకొంటోంది. అసలు తెలంగాణలో సాధారణ ప్రజలు, బడుగూ బలహీన వర్గాలు ఏమనుకుం టున్నారో, సోషల్ మీడియా ఏం చెబుతుందో గ్రహించే ఆసక్తి వారికి లేదని పెదవి విరుస్తున్నారు. ఎన్నికలు 2018లో వచ్చినా నిర్ణీత సమయానికి అంటే 2019లో తల(లు)పు తట్టినా..యువత పోలింగ్ బూత్‌లకు పోటెత్తాలే గానీ, ఆ ప్రభావం తీరే వేరుంటుందని ధీమాగా చెబుతున్నారు.

వాళ్లు (ప్రజా జీవితంలో ఉన్న కేసీఆర్ ఫ్యామిలీలోని వ్యక్తులు)మస్తు ఓవర్ కాన్ఫిడెన్సుతో ఉన్నారు. ఉండనీ, ఉండనీ తెలంగాణకు ఒక రకంగా అదే మంచిది..! ఆ పెద్దలు మేల్కొనక పోవడమూ, ఈ సొంపులో మునగడమూ డబుల్ మంచిది..!!

ఎందుకంటే..

స్వతహాగా చైతన్య వంతమైన తెలంగాణ గడ్డ గట్టి గుణపాఠం నేర్పడానికి అదే ప్రేరణ అవుతుంది కాబట్టి!!! అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ తటస్థ విద్యాధికుడి భాషణ ఈ కథనంలో కొసమెరుపు!

కేవలం అతిథిని మాత్రమే..


నాగార్జున

టాలీవుడ్ మన్మథుడిగా ప్రేక్షకులు, అభిమానుల మనసుల్లో సుస్థిర స్థానం సొంతం చేసుకున్న నాగార్జున మూడు దశాబ్దాల కెరీర్‌లో ఎన్నో అద్భుతమైన చిత్రాల్లో నటించారు. పాత్ర ఏదైనా సరే అందులో జీవించడం నాగార్జున స్పెషాలిటీ. ప్రయోగాలకు కేరాఫ్‌గా నిలిచి, న్యూ టాలెంట్‌ను ప్రోత్సహించడంలోనూ తనకు తానే సాటి అని ప్రూవ్ చేసుకున్నారు. 'విక్రమ్', 'గీతాంజలి', 'శివ', 'నిన్నే పెళ్లాడతా', 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'రాజన్న', 'మన్మథుడు', 'మనం', 'ఊపిరి' ఇలా చెప్పుకుంటే ప్రతి సినిమా దేనికదే భిన్నం. నటుడిగా అలరిస్తూనే ఉత్తమాభిరుచిగల నిర్మాతగానూ ప్రేక్షకులను మెప్పిస్తున్న నాగార్జున పుట్టినరోజు నేడు (మంగళవారం). ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయన మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలేమిటో ఓ లుక్కేద్దాం..

మీ 'రాజుగారి గది 2' సినిమా విశేషాలేమిటి?

– షూటింగ్ మొత్తం పూర్తయ్యింది. సెప్టెంబర్ 10వరకు ఫస్ట్ కాపీ వస్తుంది. గతేడాది వచ్చిన 'రాజుగారి గది'కి దీనికి సంబంధం లేదు. టైటిల్‌కు మాత్రమే సీక్వెల్. కంటెంట్ మొత్తం భిన్నంగా ఉంటుంది. దర్శకుడు ఓంకార్ చాలా పర్‌ఫెక్షనిస్ట్. ఈ సినిమాలో నటించడానికి కారణం హర్రర్ కామెడీ అంటే నాకెంతో ఇష్టం. చాలా రోజులుగా చేయాలనుకుంటున్నా. దీంతో కుదిరింది. నా పాత్రలో కామెడీ ఉండదు. ఇతర హాస్యనటులు బాగా కామెడీ చేశారు. ఇందులో నేను మైండ్ రీడర్‌గా నటించాను. మనిషిని చూడగానే వాళ్ల మనసులోని మాటల్ని కనిపెట్టగల సమర్థుడి పాత్ర నాది. బేసిక్‌గా ఇది మలయాళంలో వచ్చిన ఓ చిత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని దర్శకుడు ఈ కథ రాసుకున్నారు. కేరళకు చెందిన ఓ వ్యక్తి పది ప్రశ్నలేసిన తర్వాత మనం ఏ అనుకుంటున్నామో చెప్పగలడు. నిజం చెబుతున్నామా? అబద్ధం చెబుతున్నామో కూడా కనిపెట్టగలడు. మిర్రర్ మెమొరీ ఉంటుంది. అతన్ని స్ఫూర్తిగా తీసుకుని నా పాత్రను డిజైన్ చేశారు. నేను కూడా అతడితో మాట్లాడాను. అందువల్లే ఈ పాత్రను బాగా చేయగలిగాను. ఇందులో నా పాత్ర, సమంత పాత్ర చుట్టూతే సినిమా కథ తిరుగుతుంది. ఇందులో సమంత దెయ్యంగా కనిపిస్తుంది.

చైతూ 'యుద్ధ శరణం' సినిమా గురించి?

– ఇదొక మైండ్ గేమ్ చిత్రం. ఇందులో చైతూ యాక్టింగ్ సూపర్‌గా ఉంటుంది. చైతూ కెరీర్‌కి బాగా ఉపయోగపడే సినిమాగా భావిస్తున్నాను. ఈ సినిమా సెప్టెంబర్ 8న ప్రేక్షకుల ముందుకొస్తోంది.

అఖిల్ సినిమా 'హలో' ఎలా ఉండబోతోంది?

– ఇదొక కొత్తరకమైన జోనర్‌లో ఉండే యాక్షన్ లవ్‌స్టోరీ. ప్రేమ కథ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. దీని కోసమై హీరోయిన్‌గా ఓ ఫ్రెష్ ఫేస్‌ను తీసుకోవాలనుకున్నాం. 'గీతాంజలి'లో గిరిజలాగా, 'ఏం మాయ చేసావె'లో సమంతలాగా కొత్త అమ్మాయి అయితే బాగుంటుందనిపించి ముంబై, చాలా మందిని ఆడిషన్ చేశాం. ఫైనల్‌గా ప్రియదర్శన్‌గారి అమ్మాయి కళ్యాణిని ఎంపిక చేశాం. తన పాత్రను ఎక్స్‌లెంట్‌గా చేస్తోంది. దర్శకుడు విక్రమ్ చాలా బాగా తెరకెక్కిస్తున్నారు. ఆయన చాలా క్రియేటివ్ పర్సన్. ఆర్టిస్టుల నుంచి ఎలాంటి నటన రాబట్టుకోవాలో ఆయనకు బాగా తెలుసు. అయితే సినిమాకు ఏ టైటిల్ పెట్టాలని చాలా రోజులుగా దర్శకుడితోపాటు టీమ్ అంతా ఆలోచిస్తున్నారు. ఓ రోజు ఉదయం 'హలో' పేరైతే బాగుంటుందనిపించి, సుప్రియకు ఫోన్ చేసి చెప్పా. ఎవరైనా దాన్ని రిజిస్టర్ చేయిస్తారేమో అనుకున్నాం. కానీ లక్కీగా ఈ ఐదారు సంవత్సరాలలో ఎవ్వరూ ఆ పేరుతో రిజిస్టర్ చేయించలేదు. అయితే 'హలో' అనే టైటిల్ పెట్టడానికి సినిమాకు ఓ సంబంధం ఉంది. హీరో తన ప్రియురాలి నుంచి ఒక్క 'హలో' కోసం వెయిట్ చేస్తుంటాడు. అలా ఈ చిత్రానికి ఈ టైటిల్ యాప్ట్ అవుతుంది. ఈ చిత్ర టైటిల్‌ను ఎన్టీఆర్ (సీనియర్)తో ప్రారంభించి చివరికి నాన్నగారు(ఏఎన్నార్)తో ముగిస్తూ సినిమా పేరును చెప్పించాలనుకున్నాం. పెద్దాయన పేరు కాబట్టి తారక్‌తో ప్రారంభించి నాన్నగారితో 'హలో' అనిపించాం. ఆ వీడియోకు మంచి స్పందన వచ్చింది.

మీ బర్త్‌డే సెలబ్రేషన్స్ ఎలా ఉండబోతున్నాయి?

– ఇంకా ప్లాన్ చేయలేదు. అదంతా మా పిల్లలు (చైతూ, అఖిల్) చూసుకుంటారు. ఎక్కడికైనా బయటకి వెళ్ళాలనుకుంటున్నాను. ఇంట్లో డిస్కస్ చేసుకుని వెళతాం. బర్త్‌డే సెలబ్రేషన్స్‌పై మొదట్లో ఆసక్తి ఉండేది. మా పిల్లలు పెద్దవడంతో ఇప్పుడు ఆసక్తి తగ్గింది.

బర్త్‌డే సందర్భంగా మీ అభిమానులకు ఏం చెప్పాలనుకుంటున్నారు?

– వాళ్ళకంటూ ప్రత్యేకంగా ఏం చెప్పగలను. అభిమానుల గురించి ఏం చెప్పినా తక్కువే అవుతుంది. నాన్నగారి నుంచి మమ్మల్ని అభిమానించే వారున్నారు. పెద్ద వాళ్ళు తరచూ ఫోన్ చేసి మాట్లాడుతుంటారు. నాన్నగారికి ఎక్కడెక్కడి నుంచో పచ్చళ్ళు, స్వీట్లు వచ్చేవి. ఆయనలేకపోవడంతో ఇప్పుడు అవన్నీ నా దగ్గరకు వస్తున్నాయి. నిజం చెప్పాలంటే అభిమానులు తెలుగు హీరోలకు ఒక వరం.

ఇన్నేండ్ల కెరీర్‌ను ఎనాలిసిస్ చేసుకుంటే మీకేమనిపిస్తుంది?

– సినిమాల పరంగా ఎన్నో తప్పులు చేశాం. వాటిని సరిదిద్దుకున్నాం కూడా. అయినా ఇంకా తప్పులు చేస్తాం (నవ్వుతూ). కానీ ఇప్పటి వరకు ఎలాంటి రీగ్రెట్స్ లేకపోవడం హ్యాపీ.

ఈ ఏడాది మీకు ప్రత్యేకమని చెప్పొచ్చా?

– అవును (నవ్వుతూ). చైతూతో నిర్మించిన 'రారండోయ్ వేడుక చూద్దాం' నిర్మాతగా నాకు మంచి విజయాన్ని అందించింది. ఇప్పుడు చైతూదే 'యుద్ధం శరణం' విడుదల కాబోతుంది. అలాగే అక్టోబర్‌లో చైతూ, సమంతల పెళ్ళి, త్వరలోనే నా సినిమా 'రాజుగారి గది 2' విడుదల కానుంది. ఈ ఏడాది చివరల్లో అఖిల్ సినిమా వస్తుంది. అటు సినిమాల పరంగా, ఇటు వ్యక్తిగతంగా ఈ ఏడాది నాకొక సూపర్ స్పెషల్ ఇయర్. ఇక చైతూ పెళ్ళికి సంబంధించిన పనులన్నీ వాళ్లే చూసుకుంటున్నారు. నేను కేవలం గెస్ట్‌ను మాత్రమే. జస్ట్ చెక్‌పై సంతకం పెట్టమంటున్నారు (నవ్వుతూ). అక్టోబర్ 6న చైతూ పెళ్ళి ఉంటుంది. హిందూ, క్రిస్టియన్ పద్ధతుల్లో చేస్తాం. వాళ్ళు పెళ్ళి సింపుల్‌గా చేసుకోవాలనుకుంటున్నారు. రిసెప్షన్ ఎలా చేయాలనేది నేను ఆలోచించాలి. రిసెప్షన్‌ను పెద్దగా చేయాలనేది నా ప్లాన్. అలాగే త్వరలో నాన్నగారి జాతీయ అవార్డుల వేడుక ఉంటుంది. ఈసారి చాలా మంది ప్రముఖులను ఆహ్వానిస్తున్నాను. వారంతా కన్ఫమ్ అయిన తర్వాత ఈ వేడుక గురించి అధికారికంగా ప్రకటిస్తాను.

ఇటీవల వస్తున్న సినిమాలపై మీ కామెంట్?

– 'అర్జున్‌రెడ్డి' ట్రెండ్ సెట్టర్ చిత్రమంటున్నారు. చాలా సంతోషం. ఇంకా ఆ సినిమాని నేను చూడలేదు. చూశాక మాట్లాడతా. అయితే ఇలాంటి సినిమాలు బాలీవుడ్‌లో ఎప్పట్నుంచో వస్తున్నాయి. 'నిన్నుకోరి', శేఖర్ కమ్ముల 'ఫిదా' సైతం చాలా బాగున్నాయి. 'ఫిదా'లో సాయి పల్లవి నటన సూపర్. శేఖర్ సింపుల్ ఎమోషన్స్‌ను బాగా తీశాడు. మొత్తానికి తెలుగు చిత్ర పరిశ్రమ కొత్త పుంతలు తొక్కుతున్నందుకు సంతోషంగా ఉంది.

నెక్స్ట్ ప్రాజెక్ట్స్ గురించి?

– తమిళంలో వచ్చిన 'విక్రమ్ వేద' రీమేక్ కోసం నన్ను కలిశారు. నేనింకా ఆ సినిమా చూడలేదు. చూశాక చెబుతానని చెప్పా. అలాగే 'బంగార్రాజు' సినిమా చేయాలనుంది. దర్శకుడు కళ్యాణ్‌కృష్ణ దానికి సెట్ అయ్యే కథ ప్రిపేర్ చేయలేదు. మలయాళంలో తీయబోతున్న 'మహాభారతం'లో కర్ణుడి పాత్రపై ఇంకా క్లారిటీ రాలేదు. ఇటీవల చిరంజీవి నటించే 'సైరా నరసింహారెడ్డి' ఫస్ట్‌లుక్ చూశా. చాలా బాగుంది. ఇదొక భారీ సినిమా అవుతుందనిపించింది. 'రాజన్న' తరహాలో మంచి కథ వస్తే నేను కూడా చేయడానికి సిద్ధమే.

నవచిత్రం

అభిమానులు కోరుకున్న రీతిలోనే..


'పైసా వసూల్' చిత్ర ఆడియో సక్సెస్ వేడుక దృశ్యం

నందమూరి బాలకృష్ణ, శ్రియ, ముస్కాన్, కైరాదత్ హీరో,హీరోయిన్లుగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనంద్‌ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'పైసా వసూల్'. ఈ చిత్ర ఆడియో సక్సెస్ మీట్‌ను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు.

ఈ సందర్భంగా అతిథిగా విచ్చేసిన మోహన్‌బాబు మాట్లాడుతూ, 'సినిమాలకు సంబంధించి రకరకాలుగా ట్వీట్లు చేస్తుంటారు. అది మంచిదికాదు. బాలయ్య గురించి కొత్తగా చెప్పక్కర్లేదు. ఆయన తన సినిమాలను డబ్బు ఇచ్చి ఆడించలేదు. ఈ సినిమాలో అన్నయ్య (ఎన్టీఆర్)ని బాలయ్య ఇమిటేట్ చేశాడంటే నేను ఒప్పుకోను. ధైర్యం చేసి హీరో ఒక పాట పాడటం మామూలు విషయం కాదు. బాలకృష్ణ ఈ చిత్రంలో రిథమ్‌కు తగ్గట్టు అద్భుతంగా పాడారు. సక్సెస్, ఫెయిల్యూర్ గోస్ టు ది డైరెక్టర్. నాకు పూరీ అంటే చాలా ఇష్టం. ఆయనలా ఫాస్ట్‌గా తీసే డైరెక్టర్‌ని నేను చూడలేదు. మన తల్లిని ఎలా గౌరవిస్తామో, మన కళను కూడా అలా గౌరవించాలి. సినిమానే మన ఊపిరి. ఈ సినిమా రూ.101కోట్ల కన్నా ఎక్కువ కలెక్ట్ చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

'పూరీ జగన్నాథ్‌తో ఎప్పట్నుంచో సినిమా చేయాలని ఉంది. కాస్త లేట్ అయ్యింది. పోర్చుగల్‌లో 36 రోజులు షెడ్యూల్ చేశాం. పూరీలో ఎప్పుడూ టెంపర్ లూజ్ కావడం, విసుక్కోవడం చూడలేదు. సినిమా చాలా భారీగా ఉంటుంది. సెట్స్, కారు ఛేజ్‌లు భారీగా ఉన్నాయి. సెట్‌లో అందరికి మంచి వాతావరణం కల్పించేది నిర్మాత, తర్వాత దర్శకుడు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 29న విడుదల చేయాలనుకున్నాం. ఐదు వారాల ముందుగా విడుదల చేస్తున్నాం. అలాగని క్వాలిటీ విషయంలో రాజీ పడలేదు. ఛార్మి అన్ని బాధ్యతలను బాగా నిర్వర్తించింది. ఈ సినిమా చేసినందుకు శ్రియకు థ్యాంక్స్. అనూప్ రూబెన్స్ మంచి బాణీలను అందించారు. ఈ చిత్రానికి ముందు 'రైతు' సినిమా అనుకున్నాం. నాన్నగారి బయోపిక్ కోసం కూడా చాలా చేస్తున్నా. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో నటిస్తున్న సినిమా ఫస్ట్ షెడ్యూల్ పూర్తయ్యింది. ఆర్టిస్టులకు ఛాలెంజ్ ఎప్పుడొస్తుందంటే ఒక మంచి సినిమా చేసిన తర్వాత ఇమేజ్ అడ్డు వచ్చినప్పుడు సవాల్ ఎదురవుతుంది. నేను వాటి గురించి ఆలోచించను. ఇప్పటికే వివిధ నేపథ్యాలలో సినిమాలు చేశాను. ఇంకా చేస్తాను. ప్రేక్షకుల మీద నమ్మకంతో నాన్నగారు ఎన్నో సినిమాలు చేశారు. ఆయన అందించిన ధైర్యం, ఆవేశం, స్ఫూర్తితోనే సినిమాలు చేస్తున్నా. సినిమాల్లోని పాత్రలు పంచభక్ష పరమాన్నాన్ని పళ్లెంలో వడ్డించినట్టు చేయాలనే తపన ఉంటుంది. బాలకృష్ణ సినిమా ఎలా ఉండాలని అభిమానులు కోరుకుంటారో అలాగే ఉండే చిత్రమిది' అని బాలకృష్ణ తెలిపారు.

పూరీ జగన్నాథ్ మాట్లాడుతూ, 'నిర్మాత ఆనంద్ ప్రసాద్ బ్యానర్‌లో పనిచేయడం ఆనందంగా ఉంది. బాలయ్య పాడిన 'మామా ఏక్ పెగ్ లా..' పాట రాకింగ్. ఇప్పుడు దాన్ని పిల్లలు కూడా పాడేస్తున్నారు. బాలయ్యతో సినిమా చేయక చాలా మిస్ అవుతున్నా. ఇప్పుడు షూటింగ్ పూర్తయ్యాక కూడా చాలా మిస్ అవుతున్నా. ఇలాంటి హీరోను ఇప్పటి వరకు చూడలేదు. క్రమశిక్షణ, అంకితభావం ఉన్న నటుడాయన. రామారావుగారి లక్షణాలన్నీ బాలయ్యలో ఉన్నాయి. ఈ సినిమాకు కొత్తవాళ్ళు చాలా మంది పనిచేశారు. వారందరినీ ఆయన బాగా ఎంకరేజ్ చేశారు' అని చెప్పారు. 'ఈ సినిమాను నిర్మించే అవకాశం ఇచ్చిన బాలకృష్ణకు కృతజ్ఞతలు. ఆయనతో సినిమా చేయాలనే కోరిక తీరింది. పూర్తి మాస్ మసాలా సినిమా ఇది. సెప్టెంబర్ 1న విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని నిర్మాత చెప్పారు.

సరికొత్త అనుభూతినిచ్చే ఆక్సిజన్


గోపీచంద్
అను ఇమ్మాన్యుయెల్

గోపీచంద్, రాశీఖన్నా, అను ఇమ్మాన్యుయెల్ హీరో,హీరోయిన్లుగా ఏ.ఎం.జ్యోతికృష్ణ దర్శకత్వంలో శ్రీసాయిరామ్ క్రియేషన్స్ పతాకంపై ఎస్.ఐశ్వర్య నిర్మిస్తున్న చిత్రం 'ఆక్సిజన్'. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత ఎస్.ఐశ్వర్య మాట్లాడుతూ, 'యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. గోపీచంద్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్‌తో రూపొందించాం. ముంబయి, గోవా, సిక్కిం, చెన్నై లాంటి అందమైన ప్రదేశాలలో రాజీపడకుండా నిర్మించాం. యువన్ శంకర్ రాజా సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలోని పాటలు తెలుగు ప్రేక్షకులకి ఒక సరికొత్త అనుభూతిని కలిగిస్తాయి. దర్శకుడు జ్యోతికృష్ణ టేకింగ్ స్టాండర్డ్స్ సినిమా విడుదలయ్యాక అర్థమవుతుంది. ఆయన అద్భుతంగా తెరకెక్కించారు. సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలోనే ఆడియోను విడుదల చేసి అక్టోబర్ 12న సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

దీపావళికి వలపు సౌధం


'వలపు సౌధం'లో సాయికిరణ్, ప్రాచి అధికారి

సాయికిరణ్, ప్రాచి అధికారి జంటగా కృష్ణమోహన్ దర్శకత్వంలో తుల్జా భవాని ఫిల్మ్స్ పతాకంపై పి.విజయ్ శేఖర్ సమర్పణలో సునీల్ సాగర్, మజ్ను సొహ్రాబ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'వలపు సౌధం'. మాజీ మిస్టర్ ఆంధ్ర బల్వాన్ ప్రధాన పాత్రధారిగా నటిస్తున్న ఈ చిత్రం గురించి నిర్మాత సునీల్ సాగర్ మాట్లాడుతూ, 'లవ్, హర్రర్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇందులో ఏడు పాటలున్నాయి. నూతన సంగీత దర్శకుడు ఎస్.కె.మజ్ను స్వరపరిచిన పాటలు శ్రోతలను విశేషంగా అలరిస్తాయి. రీ-రికార్డింగ్ అద్భుతంగా కుదిరింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఆడియోను త్వరలో విడుదల చేసి, దీపావళికి సినిమాను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. "నువ్వే కావాలి', 'ప్రేమించు' చిత్రాల తర్వాత సాయికిరణ్‌కు ఈ చిత్రం మంచి బ్రేక్ ఇస్తుంది. బల్వాన్ ఇందులో పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. ఆయన పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. అందరిని అలరించే చిత్రమిది' అని దర్శకుడు అన్నారు.

కాజల్‌ని ఇంప్రెస్ చేసిన వాలుజడ


'వాలుజడ'లో సాయిధన్సిక

'కబాలి' చిత్రంలో రజనీకాంత్ కూతురిగా నటించి మెప్పించిన సాయి ధన్సిక ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'వాలుజడ'. ఇందులో నవీన్ సంజయ్ హీరో. రమణ మల్లం దర్శకుడిగా పరిచయమవుతూ రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని సింహ వాహిని చలన చిత్ర పతాకంపై సింహ వాహిని నాగరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని తమిళంలో 'కులలి' పేరుతో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను అగ్రకథానాయిక కాజల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర పోస్టర్ చాలా బాగుందని, తనను బాగా ఇంప్రెస్ చేసిందని తెలుపుతూ చిత్ర యూనిట్‌ను కాజల్ అభినందించారు. 'యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. ఇప్పటి వరకు 50శాతం షూటింగ్ పూర్తయ్యింది. సెప్టెంబర్ నుంచి మరో భారీ షెడ్యూల్‌ను జరుపబోతున్నాం. తమిళ దర్శకులు చేరన్, గౌతమ్‌మీనన్, విక్రమ్ కుమార్‌ల వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన రమణ మల్లంను ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది. ధన్సిక ఇందులో విభిన్నమైన పాత్ర పోషిస్తుంది. మరో ముఖ్య పాత్రలో బాలీవుడ్ నటుడు నానా పటేకర్ నటిస్తుండటం విశేషం' అని నిర్మాత చెప్పారు.


తమన్నా

ఎన్టీఆర్‌తో స్పెషల్ సాంగ్..!

'అల్లుడు శీను', 'స్పీడున్నోడు', 'జాగ్వార్' చిత్రాల్లో ప్రత్యేక పాటల్లో స్టెప్పులేసి అలరించిన తమన్నా మరోసారి ఓ ప్రత్యేక గీతంలో నటించేందుకు రెడీ అవుతోంది. ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న 'జై లవకుశ' చిత్రంలో ఎన్టీఆర్ సరసన ఓ స్పెషల్ సాంగ్‌లో తమన్నా నటించనుంది. ఇప్పటి వరకు వచ్చిన వాటితో పోల్చితే ఇందులోని పాట విభిన్నంగా ఉంటుందట. అందుకు తమన్నా అయితే అటు పాటకు, ఇటు సినిమాకు మరింత అందం వస్తుందని భావించిన చిత్ర బృందం తమన్నాను ఎంపిక చేశారు. ఇందులో తమన్నా గెటప్ కూడా సరికొత్తగా ఉంటుందని తెలుస్తోంది. తమన్నా ప్రస్తుతం 'స్కెచ్', 'ఖామోషి', కునాల్ కోహ్లి చిత్రంతోపాటు కళ్యాణ్ రామ్ చిత్రంలోనూ నటిస్తోంది.

యుద్ధం శరణం పాటలొచ్చాయ్


లావణ్య త్రిపాఠి, నాగచైతన్య

నాగచైతన్య, లావణ్య త్రిపాఠి జంటగా కృష్ణ ఆర్.వి.మారి ముత్తు దర్శకత్వంలో వారాహి చలన చిత్ర బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్న చిత్రం 'యుద్ధం శరణం'. ఈ చిత్రం ఆడియో లాంచ్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ చిత్ర పాటల సీడీలను అతిథిగా విచ్చేసిన కీరవాణి ఆవిష్కరించి తొలిసీడీని రాజమౌళికి అందించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ, 'ట్రైలర్ చూశాక ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందనిపించింది. చైతన్య కథలు ఎంచుకునే తీరు నాకు బాగా నచ్చింది. విలన్‌గా శ్రీకాంత్ గెటప్ బాగుంది. వివేక్ సాగర్ అద్భుతమైన సంగీతాన్ని సమకూర్చారు' అని అన్నారు. హీరో నాగచైతన్య చెబుతూ, 'టీజర్ విడుదలైనప్పుడు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ మా యూనిట్‌కు ఎంతో బలాన్నిచ్చింది. ఈ సినిమా ఇక్కడి వరకు వచ్చిందంటే కారణం సాయి కొర్రపాటిగారే. ఓ సామాన్యుడు శక్తివంతమైన విలన్‌ను ఎలా గెలిచాడనేది కథ. ఇందులో హీరో ఎక్కడా ఆయుధం ఉయోగించడు. సోషల్ మీడియా, టెక్నాలజీ, ఇంటెలిజెన్స్‌ని మాత్రమే ఆయుధాలుగా వాడతాడు. సాధారణంగా నా సినిమా విడుదల టైమ్‌లో అభిమానులు వచ్చి కలుస్తుంటారు. కానీ ఈసారి నేనే అభిమానులను కలుస్తాను. సెప్టెంబర్ 8న విడుదలయ్యే ఈ చిత్ర యుద్ధంలో డైరెక్టర్‌గా నా స్నేహితుడైన కృష్ణ గెలుస్తాడు' అని చెప్పారు. 'చైతూ నన్నెంతో ప్రోత్సహించాడు. నేను ఇక్కడ ఉన్నానంటే దానికి కారణం చైతూనే. సాయి కొర్రపాటి అమేజింగ్ ప్రొడ్యూసర్. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నా' అని దర్శకుడు తెలిపారు.

నిటిఆయోగ్ సిఫారసులకు తలొగ్గొద్దు...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'తెలంగాణాలో విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. మంచిదే.. కానీ దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రయివేటీకరించాలంటూ నిటి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. త్వరలోనే ఈ సిఫారసులను రాష్ట్రాలపై రుద్దబోతున్నారు. ఇదే జరిగితే మరింతగా విద్యుత్ భారాలు జనాన్ని అతలాకుతలం చేస్తాయి. ఇది అన్ని రాష్ట్రాలకూ అత్యంత ప్రమాదకరం... కాబట్టి ఉభయ తెలుగు రాష్ట్రాలూ ఈ సిఫారసులకు లొంగొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. లేదంటే బషీర్‌బాగ్ తరహాలో మరో పోరటానికి ప్రజల్ని సన్నద్ధం చేస్తాం...' అంటూ వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల నాయకులు హెచ్చరించారు.


విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ చౌరస్తా వద్దగల స్థూపానికి సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, బి.వెంకట్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కె.రామకృష్ణతోపాటు ఝాన్సీ (సీపీఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ), తాండ్రకుమార్ (ఎంసీపీఐ-యు), గోవర్ధన్ (సీపీఐ ఎంఎల్-న్యూడెమోక్రసీ), మురహరి (ఎస్‌యుసీఐ-సీ), జానకి రాములు (ఆరెస్పీ), బండ సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), గుర్రం విజయకుమార్ (సీపీఐ ఎంఎల్) తదితరులు పూలమాలలేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అమరులు బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలకు జోహార్లర్పించారు. 2000 సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన విద్యుత్ విధానాలు, ఫలితంగా ప్రజలపై భారాలు, వామపక్షాలు, ప్రజా సంఘాలు, ఇతర విపక్షాలు చేసిన పోరాటాలను వారు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.



ఏదో ఒక రూపంలో భారాలు : రాఘవులు

ఆనాటి పోరాట ఫలితంగా విద్యుత్ చార్జీలు పెరక్కుండా, పెంచకుండా చాలా వరకు నిరోధించగలిగామని రాఘవులు చెప్పారు. అయితే పాలకులు ఏదో ఒక రూపంలో వాటిని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రణాళికా సంఘం స్థానంలో కేంద్రం ఏర్పాటు చేసిన నిటి ఆయోగ్.. మూడేండ్లలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రయివేటీకరించాలంటూ సిఫారసు చేసిందని అన్నారు. ఇదే జరిగితే ప్రయివేటు, కార్పొరేట్ శక్తులు పంపిణీ వ్యవస్థను హస్తగతం చేసుకుంటాయని హెచ్చరించారు. విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ చెబుతున్న పాలకులు.. అప్పుడు తమకు ఇష్టం ఉన్నా లేకపోయినా ప్రజలపై భారాలు మోపాల్సి వస్తుందని హెచ్చరించారు. అందువల్ల ఈ సిఫారసులను తిరస్కరించాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. అంతేతప్ప ముందు సిఫారసులకు తలొగ్గి.. ఆ తర్వాత మా చేతుల్లో ఏమీ లేదంటూ చెప్పటం వల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండబోదని హెచ్చరించారు.

నేటి పరిస్థితి మరీ దారుణం : సురవరం



అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేసిందని సురవరం చెప్పారు. అయితే ఆనాడు కనీసం నిరసన తెలిపే హక్కైనా ఉందని తెలిపారు. అందుకు భిన్నంగా నేడు కేంద్రంలో మోడీ సర్కారు.. తెలంగాణాలో కేసీఆర్ ప్రభుత్వం భావ ప్రకటన స్వేచ్ఛను, రాజ్యాంగ హక్కులను కూడా హరించి వేస్తున్నాయని విమర్శించారు. గతంలో జరిగింది కేవలం విద్యుత్ చార్జీల వ్యతిరేక పోరాటమే కాదు.. అది సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమని తెలిపారు. ఇప్పుడు వీటితోపాటు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నిత్యం దేశభక్తి గురించి మాట్లాడే మోడీ.. దేశంలోకి ఇబ్బడి ముబ్బడిగా ఎఫ్‌డీఐలను ఆహ్వానిస్తున్నారని చెప్పారు. ఇవి దేశ ప్రజానీకానికి అత్యంత హానికరమని హెచ్చరించారు.

మరిన్ని ఐక్య ఉద్యమాలు : గోవర్ధన్



బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో టీఆర్‌ఎస్ సర్కారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మరిన్ని ఐక్య ఉద్యమాలు నిర్మించాలని గోవర్ధన్ చెప్పారు. ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం జరిపిన కాల్పులు జలియన్‌వాలాబాగ్‌ను తలపించాయని గుర్తుచేశారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆనాటి టీడీపీ ప్రభుత్వంలో కేసీఆర్ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారని గుర్తుచేశారు. అందువల్ల అప్పటి విధానాల్లో ఆయనకు కూడా భాగస్వామ్యం ఉందని విమర్శించారు. పాలకులు మారినా విధానాలు మారటం లేదని జానకిరాములు చెప్పారు. నాటి ఉద్యమంలో ఆందోళనకారులు పోలీసు తుపాకులకు తమ గుండెలను ఎదురొడ్డారని ఝాన్సీ తెలిపారు. విద్యుత్ పోరాటం ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచిందని మురహరి చెప్పారు. బషీర్‌బాగ్ అమరుల స్ఫూర్తితో ప్రస్తుతం ఉద్యమాలకు రూపకల్పన చేయాలని తాండ్రకుమార్ కోరారు. ప్రయివేటీకరణను నిరసిస్తూ పెద్ద ఎత్తున జనాన్ని కదిలించాలని విజయకుమార్ చెప్పారు.



బషీర్‌బాగ్ స్ఫూర్తితో ముందుకెళ్తాం : ఉత్తమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకులకు సరైన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమారరెడ్డి హెచ్చరించారు. ఇది బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమం అనంతరం టీడీపీని అధికారానికి దూరం చేసిన సంగతితో తేలిపోయిందన్నారు. బషీర్‌బాగ్ కాల్పుల్లో మరణించిన విద్యుత్ అమరులకు నివాళులర్పించిన అనంతరం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడిపి నిరంకుశ విధానాలు,, విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజలు తిరగబడి చేసిన పోరాటంలో పోలీసుల కాల్పుల్లో అమరులైన వారిని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు కేసీఆర్ పాలనలో కూడా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా.. టీఆర్‌ఎస్ సర్కారు తన స్వప్రయోజనాలు, రాజకీయ స్వార్థంతోనే ముందుకు పోతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయ తీవ్రమైన తీవ్రమైన సంక్షోభంలో ఉంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. రాజకీయ అభద్రతలో ఉన్న కేసీఆర్, సర్వేల పేరు చెబుతూ ఎమ్మెల్యేలు, ఎంపీలను నమ్మిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు కుమార్ రావు, వినోద్ రెడ్డి, నిరంజన్, బొల్లు కిషన్, అనిల్ కుమార్ యాదవ్, నేరేళ్ల శారద, నాయకులు ఇందిరా శోభన్, సమ్మిరెడ్డి, కిరన్ యాదవ్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి; షబ్బీర్‌అలీ



సమగ్ర భూ సర్వేపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని శాసనమండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు. టీఆర్‌ఎస్ ప్రతినిధులతోనే మాట్లాడడం సరికాదన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూ సర్వేపై వెంటనే అసెంబ్లీని సమావేశ పరచి చర్చించాలని డిమాండ్ చేశారు. గతంలో హడావుడిగా చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఏమైందో అందరికీ తెలుసన్నారు. ఈ సర్వేకు సంబంధించిన వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వంద స్థానాలు గెలుస్తామంటూ చెప్పడం కాదని, కేసీఆర్‌కు దమ్ముంటే.. ఇతర పార్టీల్లో గెలిచి, టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో గెలిపించుకోని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

45వ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాణం చేయించారు. సీజేఐ(రిటైర్డ్) జస్టిస్ జగదీశ్‌సింగ్ ఖేహార్ పదవీకాలం ఆదివారం ముగియడంతో ఆయన స్థానంలో తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్‌మిశ్రా బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ ఖేహార్ తరువాత సుప్రీంకోర్టులో దీపక్‌మిశ్రా అత్యంత సీనియర్ న్యాయమూర్తి. 2018 అక్టోబర్ 2వ తేదీతో దీపక్‌మిశ్రా పదవీ కాలం ముగియనుంది. ఒడిషా నుంచి సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన వారిలో జస్టిస్ దీపక్‌మిశ్రా మూడో వ్యక్తి కావడం విశేషం. ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం సీజేఐ దీపక్‌మిశ్రా.. జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎఎం ఖాన్‌విల్కర్‌తో సోమవారం ధర్మాసనం ఏర్పడింది. గతంలో జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం పలు కీలకమైన తీర్పులు వెలువరించింది. ముంబాయి పేలుళ్ల దోషి యాకుబ్‌మెమన్‌కు, నిర్భయ దోషులకు ఉరిశిక్ష విధించింది. ఇక తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కేసులోనూ జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రజాప్రతినిధులకు ఉపాధ్యాయులు పీఏలుగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఉపాధ్యాయుల ఖాళీల భర్తీపై పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అలాగే కృష్ణా జలాల కేసును సైతం విన్నది. ప్రస్తుతం సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో.. న్యాయమూర్తుల నియామక ప్రక్రియ, అయోధ్య కేసు తదితర సవాళ్లు ఆయన ముందున్నాయి. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే 'విభజన'కు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

ఏపీ సీఎస్ దినేష్‌కుమార్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం కోరితే తెలంగాణ స్థానికత కలిగిన సెక్షన్ ఆఫీసర్లను తెలంగాణకే కేటాయిస్తామని దినేష్‌కుమార్ చెప్పారు. ఏ రాష్ట్రానికి చెందిన వారిని ఆ రాష్ట్రానికి బదిలీ చేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

సంస్థల విభజనపై ఆరా

9, 10 షెడ్యూల్లో ఉన్న సంస్థల విభజనపై డీఓపీటీ అధికారి అజయ్ మిట్టల్ ఆరా తీశారు. రాష్ట్రం విడిపోయి మూడేండ్లు అవుతున్నా ఇప్పటికీ పూర్తి స్థాయిలో సంస్థల విభజన జరగలేదని రెండు రాష్ట్రాల సీఎస్‌లు అజయ్ మిట్టల్‌కు వివరించారు. మొత్తం 160 సంస్థలు ఉండగా కేవలం 82 సంస్థలను మాత్రమే విభజించారన్నారు. కార్పొరేషన్ల విభజన, వాటి ఆస్తులు, అప్పులను విభజించాల్సి ఉందని తెలిపారు. ప్రధానంగా ఆర్టీసీ, టూరిజం, వ్యవసాయం లాంటి కార్పొరేషన్లను విభజించకపోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఉద్యోగులకు వేతనాలు చెల్లించడం కూడా కష్టమవుతున్నదని తెలిపారు. అక్టోబర్ నెలాఖరులోగా కార్పొరేషన్ల విభజనను పూర్తి చేస్తామని అజయ్ మిట్టల్ హామీ ఇచ్చినట్టు సమాచారం.

విచారణలో జాప్యమెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

మంజూరు చేయాలని కోర్టును ఒప్పించేలా అతని ఆరోగ్యానికి సంబంధించి 'కల్పిత పత్రం' దాఖలు చేశారని అత్యున్నత న్యాయస్థానం గుర్తించింది. నకిలీ పత్రాలను తయారుచేసిన బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాల్సిందిగా ఆ సందర్భంలో అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. ఆశారాం కుమారుడు నారాయణ్ సాయి కూడా ఈ కేసులో నిందితుడు. అత్యాచారం కేసులో ఆశారాం బాపును జోధ్‌పూర్ పోలీసులు 2013 ఆగస్టు 3వ తేదీన అరెస్టు చేశారు. అప్పటినుంచి ఆశారాం బాపు జైలులోనే ఉన్నారు.

నంద్యాలలో భూమా గెలుపు

(మొదటిపేజీ తరువాయి)

జగన్ మీడియా సమావేశం పెట్టి..నంద్యాల ఉపఎన్నికల రెఫరెండం కాదని, టీడీపీ 200 కోట్లు ఖర్చుపెట్టిందని ఆరోపించారు..

ఢిల్లీ బైపోల్ ఆప్‌దే..

ఢిల్లీలోని బావన అసెంబ్లీ స్థానంలో ఆమ్‌ఆద్మీపార్టీ అభ్యర్థి రామ్‌చందర్ 24,052 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.దేశరాజధానిలో జరిగిన బైపోల్‌లో ఎదగాలని బీజేపీ చేసిన వ్యూహం బెడిసికొట్టింది. ఆప్‌కు వస్తున్న వ్యతిరేకత కారణంగా..బీజేపీ వైపు ఓటరు మొగ్గుచూపుతాడని పార్టీ అధిష్టానం భావించింది. కానీ ఆ పార్టీ నేతలకు పరాభవం మిగిలింది.గోవాలో రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా బీజేపీ కైవసం చేసుకున్నది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్‌పారికర్ పనాజీ అసెంబ్లీ స్థానంలో 4803 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వాల్పోయి స్థానం నుంచి బీజేపీకి చెందిన విశ్వజిత్‌రాణే 10,066 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ స్థానాలకు ఆగస్టు 23న పోలింగ్ నిర్వహించగా, 28న ఓట్ల లెక్కింపు జరిగింది.


చిన్నమ్మ, దినకరన్‌పై వేటు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. ప్రస్తుతం నమదు ఎంజీఆర్ పత్రిక జయ పబ్లికేషన్ ఆధ్వర్యంలో నడుస్తోంది. దీనికి శశికళ యజమానిగా ఉన్నారు. పార్టీ అధినేత్రి జయలలిత మృతి తర్వాత రెండు వర్గాలుగా చీలిపోయిన పార్టీ.. ఇటీవలే మళ్లీ కలిసిపోయిన విషయం తెలిసిందే. విలీనంపై దినకరన్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో చివరకు ఆయనపైనే వేటువేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం సమావేశమైన అన్నాడీఎంకే పార్టీ.. శశికళ, దినకరన్‌ను బహిష్కరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశానికి హాజరైన అన్నాడీఎంకే ఎంపీ ముతుకరప్పన్ 'శశికళ, దినకరన్‌ల బహిష్కరణ విషయాన్ని ధృవీకరించారు. ఇకపై పార్టీ తరపున దినకరన్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అది చెల్లదని చెప్పారు.

చైనా స్ఫూర్తితో త్రైవార్షిక ప్రణాళికలు

- ఎజెండా రూపొందించిన నిటి ఆయోగ్



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం చైనా స్ఫూర్తితో త్రైవార్షిక ప్రణాళికలను రూపొందిస్తోంది. 2017-18 నుండి 2019-20 మధ్య కాలానికి నిటి ఆయోగ్ రూపొందించిన త్రైవార్షిక ప్రణాళిక అజెండాలో 'చైనా', 'చైనీస్' అంటూ దాదాపు 67 సార్లు ప్రస్తావించటం ప్రభుత్వ ఆలోచనా ధోరణికి అద్దం పడుతోందని పరిశీలకులు విశ్లేషిస్తు న్నారు. ఈ నెల 24న ఈ ఎజెండాను ఆవిష్కరించిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అజెండా రూపకల్పనకు చైనా స్ఫూర్తి అని చెప్పటమే కాక త్వరలోనే భారత్ ఈ లక్ష్యాన్ని చేరుకుంటుందని అన్నారు. చైనా భారత్‌కు పొరుగుదేశంగా మాత్రమే కాక ప్రపంచంలోనే రెండో పెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఉద్యోగాల కల్పన కోసం ప్రత్యేక ఆర్థిక మండళ్ల నుండి ప్రపంచ స్థాయి యూనివర్శిటీ ల ఏర్పాటు, స్మార్ట్ సిటీల రూపకల్పన, కమ్యూనికేషన్ టెక్నాలజీ వంటి రంగాలలో చైనా స్ఫూర్తిదాయక ప్రగతిసాధించిందని ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షత న జరిగిన నిటి ఆయోగ్ భేటీలో ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. చైనా విస్తృత స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్) తరహాలో మన దేశంలో కూడా సెజ్‌లు ఏర్పాటు చేయాలని ఈ ఎజెండాలో ప్రతిపాదించారు. ప్రధాని ఆవిష్కరించిన మేకిన్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చైనా, తదితర దేశాల తరహాలోనే ప్రపంచ మార్కెట్‌కు భారత్ ఉత్పత్తులు అందచేయాలని సూచించారు. ఇందుకు వీలుగా ఇతర దేశాల నుండి ఎదురయ్యే పోటీని తట్టుకునే విధంగా భారతీయ ఉత్పాదనలు నాణ్యతతో వుండాలని ఈ ఎజెండా సూచించింది. ఉత్పాదకతను పెంచుకోవటం ద్వారా ఎగుమతులను పెంపొందించుకోవాలని సూచించిన ఈ అజెండాను అమలుపరిచి చైనా, తైవాన్, సింగపూ ర్, ద.కొరియా దేశాలు మూడు దశాబ్దాల కాలంలో తమను తాము సమూలంగా మార్చుకుని అగ్రదేశా లుగా ఆవిర్భవించిన వైనాన్ని ఉదహరించింది.

ఉపాధ్యాయవిద్యలో ఎన్‌సీటీఈ నిబంధనలపై హైకోర్టులో విచారణ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఉపాధ్యాయ విద్యను బోధించే విద్యా సంస్థలు కచ్చితంగా జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) జారీ చేసే అక్రిడేషన్ పొందాలన్న చట్ట సవరణ నిబంధనను సవాల్ చేసిన వ్యాజ్యాలపై సోమవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. పలు రాష్ట్రాల హైకోర్టుల్లోని ఈ తరహా కేసుల్ని ఢిల్లీ హైకోర్టుకు బదలాయించాలని తాము సుప్రీంకోర్టులో కేసు వేశామని, కాబట్టి ఈ కేసు విచారణ జరపరాదని ఎన్‌సీటీఈ స్టాండింగ్ కౌన్సిల్ కె.రమాకాంత్‌రెడ్డి అభ్యర్థించారు. ఎన్‌సీటీఈ గుర్తింపు తమకు ఉందని, అయితే ఎన్‌సీటీఈ వెబ్‌సైట్‌తో తమ విద్యా సంస్థ లింక్ అవ్వాలంటే లక్షాయాభై వేల రూపాయలు చెల్లించాలనడం అన్యాయమని పిటిషనర్ల తరపు లాయర్లు వాదించారు. ఆ మొత్తం చెల్లింపు లేకుండా వెబ్‌సైట్‌తో లింక్ అయ్యే అవకాశం ఉందేమో తెలపాలని ఎన్‌సీటీఈని హైకోర్టు వివరణ కోరింది. ఎన్‌సీటీఈ చట్టం (1993) నిబంధన 8(3) సవరణపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఉపాధ్యాయ విద్యాసంస్థల కేసు విచారణ వచ్చే గురువారానికి వాయిదా పడింది. ఎన్‌సీటీఈ విధించిన అక్రిడేషన్ తీసుకోవాలన్న గడువు కూడా అదే రోజుతో ముగియనుంది.

7 నుంచి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

- 9 నుంచి వెబ్‌ఆప్షన్లు నమోదు
- 20న సీట్లు కేటాయింపు
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎడ్‌సెట్ తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ వచ్చేనెల ఏడో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఎడ్‌సెట్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, ఎడ్‌సెట్ కన్వీనర్ మధుమతి షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 30న ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. వచ్చేనెల 7 నుంచి 13వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. వచ్చేనెల 9 నుంచి 16వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసేందుకు అవకాశముందని తెలిపారు. వచ్చేనెల 17న వెబ్‌ఆప్షన్లలో మార్పుచేర్పులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చేనెల 20న సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వచ్చేనెల 25వ తేదీ నాటికి అభ్యర్థులకు కేటాయించిన కాలేజీల్లో చేరాలని పేర్కొన్నారు. వచ్చేనెల 25 నుంచి బీఎడ్ రెండేండ్ల కోర్సు తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. జులై 16న ఎడ్‌సెట్ రాతపరీక్ష జరిగిన విషయం తెలిసిందే. 64,029 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 58,738 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారిలో 57,413 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.

హోస్ట్ ఎనలాటిక్స్ ఆర్‌అండ్‌డీ విస్తరణ

నవతెలంగాణ, వాణిజ్యవిభాగం:

క్లౌడ్ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ ఫెర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ (ఈపీఎం) పరిష్కారాలను అందించే హోస్ట్ ఎనలిటిక్స్ భారత్‌లో తన కార్యకలాపాలను విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. హైదరాబాద్‌లోని తమ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ) కేంద్రం సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తున్నామని తెలిపింది. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హోస్ట్ ఎనలిటిక్స్ సీఈవో డేవిడ్ కెల్లాగ్ మాట్లాడుతూ ఇందుకోసం 25 మిలియన్ డాలర్ల (సుమారు రూ.162 కోట్లు) పెట్టుబడులు పెడుతున్నామన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య

హాస్టల్ సమస్యలపై పలుమార్లు ఫిర్యాదు

- సీనియర్లు వేధిస్తున్నారని చెప్పినా పట్టని యాజమాన్యం
- తమ కూతురి ఆత్మహత్యకు నిర్వాహకులే కారణమన్న తండ్రి
- సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో ఘటన



నవతెలంగాణ-నర్సాపూర్(హత్నూర)

కళాశాలలో వసతుల లేమి.. సీనియర్ల వేధింపులు.. ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురైన పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం తుర్కల ఖానాపూర్ శివారులోని రత్నపురి ప్రయివేటు కళాశాలలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన అనకపల్లి రాజశేఖర్, అరవింద దంపతుల కుమార్తె సహస్ర(17) పదో తరగతి వరకు అక్కడే చదివింది. టెన్త్‌లో పాఠశాల టాపర్‌గా నిలువడంతో బాలికను 2016లో రత్నపురి పాలిటెక్నిక్ కాలేజీలో అగ్రికల్చర్ డిప్లొమాలో చేర్పించారు. సహస్ర చదువుతోపాటు క్రీడా, క్విజ్ పోటీల్లోనూ చురుకైన విద్యార్థినిగా పేరు తెచ్చుకుంది. హాస్టల్లో సరైన సౌకర్యాలు కల్పించడం లేదని, మహిళా వార్డెన్ కూడా లేదని, ఒక్క మంచంపైనే ఇద్దరి చొప్పున పడుకోమంటున్నారని తరచూ తల్లిదండ్రులకు చెప్పేది. సమస్యలపై యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా వారు పరిష్కరించలేదు. 'అందరి సమస్యలపై నీకెందుకు పట్టింపు' అని విద్యార్థినినే మందలించేవారు. దీనికి తోడు కొందరు సీనియర్ విద్యార్థులు వేధించేవారు. దీంతో మనస్తాపం చెందిన సహస్ర ఆదివారం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సోమవారం తెల్లవారుజామున కళాశాలకు చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. తమ కూతురు మృతికి కళాశాల యాజమాన్యమే కారణమని తండ్రి రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశాడు. సీనియర్ విద్యార్థినులు పెడుతున్న ఇబ్బందులపై, అక్కడి వసతులపై తరచూ తనకు ఫోన్‌లో చెప్పేదని తెలిపారు. తాను ఏఓ భిక్షపతి, యాజమాన్యం దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదన్నారు. చివరకు తన బిడ్డను పొట్టన పెట్టుకున్నారని బోరున విలపించాడు. సహస్ర మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

దేవుడా ..ఈ కాలేజీలో ఉండలేకపోతున్నాం...

'దేవుడా ఈ కాలేజీలో ఉండలేకపోతున్నాం. నరకం అనుభవిస్తున్నాం' అని హాస్టల్‌లో గోడలపై విద్యార్థినులు రాసిన రాతలు దర్శనమిస్తున్నాయి. కొందరు సీనియర్ల వేధింపులతో కూడా వారు భయాందోళనకు గురవుతున్నారనే ఆరోపణలు న్నాయి. ఇదే హాస్టల్‌లో నాలుగు నెలల కిందట ఓ విద్యార్థిని డబ్బు తీసిందని మరో విద్యార్థినిపై నెపం మోపడంతో ఆమె కళాశాలపై నుంచి దూకి ఆస్పత్రిపాలైంది. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా యాజమాన్యం చర్యలు తీసుకోలేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కళాశాల వద్ద ఉద్రిక్తత...

విద్యార్థిని ఆత్మహత్య విషయం తెలుసుకున్న సమీప గ్రామాల ప్రజలు కళాశాల వద్దకు తరలి వచ్చారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిన్నారం సీఐ వెంకటేశం, ఎస్ఐ రాజేష్‌నాయక్ అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పౌరసరఫరాల హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర సివిల్ సప్లయిస్ పనిచేస్తున్న హమాలీలు, సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. గత 30 ఏండ్లుగా హమాలీలు కనీస జీవన ప్రమాణాలు లేకుండా ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రావిడెంట్ ఫండ్ చట్టాన్ని అమలు చేస్తూనే ఈఎస్ఐ చట్టాన్ని అమలు చేయకుండా కాలయాపన చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ చట్టాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రేషన్ బియ్యం సబ్సిడీని బ్యాంక్ ఖాతాలో వేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. 14 రకాల నిత్యావసర వస్తువుల్ని పంపిణీ చేయాలన్నారు. 50 ఏండ్లు నిండిన హమాలీలకు నెలకు రూ.3 వేల పింఛన్ చెల్లించాలని సూచించారు. ప్రస్తుతం ఇస్తున్న దహన సంస్కారాలకు చెల్లిస్తున్న రూ.10వేల నుండి రూ.20వేలకు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌కే బాబుమియా, ఎలమకంటి శ్రీనివాస్, గొరిగె నర్సింహ్మా, దేశబోయిన యాదయ్య, వంకాయలపాటి జకరయ్య, ఉపేందర్, పరుశరాం, సాంబన్న, మహబూబ్, సోమయ్య, కొమరయ్య, రాంబాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో అన్ని జిల్లాల నుండి రాష్ట్ర సమితి సభ్యులు పాల్గొన్నారు.

'గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా '

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం అందించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతామని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా వెల్లడించారు. సోమవారం సచివాలయంలో పిల్లల వైద్యాన్ని అందించడంలో పేరొందిన 'పనాసియా' సంస్థ అధికార ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు 'పనాసియా' సంస్థతో కలిసి పని చేస్తారని తెలిపారు. గిరిజన పాఠశాల, కళాశాల, వసతి గృహంలో ఉన్న ప్రతి విద్యార్థి వద్దకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. దాన్ని బట్టి విద్యార్థి డేటాను కూడా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల్లో ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలన్నారు.

కాలేయ బాధితుడికి సీఎం ఆర్థిక సహాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాలేయ మార్పిడి చేయాల్సిన అవసరం ఉన్న పేద బాలుడికి ముఖ్యమంత్రి కేసీఆర్ మానవతా హృదయంతో ముందుకొచ్చి ఆర్థిక సహాయం చేశారు. గజ్వేల్‌కు చెందిన దేవసాయి శ్రీమాన్ (11 నెలల) పుట్టినప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యపరీక్షలు చేయగా కాలేయ మార్పిడి చేయాల్సిందిగా వైద్యులు తల్లిదండ్రులకు సూచించారు. ఇందుకు భారీగా ఖర్చవుతుందని చెప్పారు. అంతఖర్చు భరించలేని తల్లిదండ్రులు ఆందోళన చెందారు. విషయాన్ని పత్రికల్లో తెలుసుకున్న సీఎం వెంటనే స్పందించారు. వివరాలు తెలుసుకొని రూ.25 లక్షలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును సిద్దిపేట కలెక్టర్ ద్వారా హైదరాబాద్ గ్లోబల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు.

రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-నాంపల్లి

అప్పుల బాధతాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. మహ్మదాపురం గ్రామానికి చెందిన రాచిక యాదయ్య(30) తన రెండెకరాలతోపాటు, మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. గతేడాది సరైన దిగుబడి, పంటకు ధర లేక, పెట్టుబడులు వెళ్లక సుమారు రూ.5 లక్షల వరకూ అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ యాలాద్రి తెలిపారు.

సెన్సెక్స్ ▲155	నిఫ్టీ ▲56	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10గ్రా)	వెండి (కేజీ)
31,750	9,912	63.90	రూ. 29,893	రూ. 42,000





కోడిగుడ్లు			
హైదరాబాద్	355	విజయవాడ	359
ఒక్కగుడ్డుకు	4.15	చెన్నై	397
వరంగల్	357	ముంబయి	400



డిసెంబరు నాటికి రూ.1000 నోటు!

- ఇప్పటికే ఆర్‌బీఐ నుంచి పచ్చజెండా
- రెండు ముద్రణాలయాల్లో సన్నాహాలు

న్యూఢిల్లీ: వచ్చే డిసెంబరు నాటికి వ్యవస్థలోకి కొత్త రూ.1000ల కరెన్సీ నోట్లు అందుబాటులోకి రానున్నట్టుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంతో సంబంధమున్న అధికారులను ఉటంకిస్తూ డీఎన్‌ఏ పత్రిక ఇందుకు సంబంధించి ఒక కథనాన్ని ప్రచురించింది. పెద్దనోట్ల రద్దు ప్రక్రియలో భాగంగా సర్కారు గత నవంబరులో రూ.500, రూ.1000ల కరెన్సీ నోట్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. రూ.1000 నోట్లు వ్యవస్థలో అందుబాటులో లేకపోవడంతో రూ.500, రూ.2000 నోట్ల మధ్య అంతరం భారీగా పెరిగి ఇటు విత్త సంస్థలకు.. అటు సామాన్యులకు పలు రకాల ఇబ్బందులు ఎదురవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో రూ.1000 నోటును సరికొత్త అవతారంలో తీసుకురావాలని సర్కారు యోచిస్తున్నట్టుగా డీఎన్‌ఏ వెల్లడించింది. త్వరలో భారతీయ రిజర్వు బ్యాంకునకు చెందిన మైసూర్, సాల్బోనీ ప్రింటింగ్ కేంద్రాలో రూ.1000 నోట్ల ముద్రణ మొదలు కానుందని డీఎన్‌ఏ సంబంధిత అధికారులను ఉటంకిస్తూ వివరాలను వెల్లడించింది.

రూ.200 నోటుకు వారం ఆగాల్సిందే...

భారతీయ రిజర్వు బ్యాంకు మొదటి విడత రూ.200 నోట్లను వ్యవస్థలోకి విడుదల చేసినప్పటికీ అవి సామాన్యులను చేరేందుకు మరో వారం పైనే పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏటీఎం యంత్రాలలోని క్యాట్రిడ్జ్‌లలో మార్పులు చేయాల్సి ఉన్నందున కొత్త నోట్లు అందుబాటులోకి వచ్చేందుకు గాను వారం నుంచి పది రోజులు సమయం పట్టే అవకాశ ఉందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్ మార్కెట్లోకి కొత్త వెర్నా



నవతెలంగాణ,వాణిజ్యవిభాగం: ప్రముఖ కార్ల తయారీ కంపెనీ హ్యుందాయ్ తాజాగా అందుబాటులోకి తెచ్చిన కొత్త వెర్నా కారు హైదరాబాద్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఐయిదో తరానికి చెందిన ఈ కొత్త కారు పెట్రోల్ వర్షన్ రూ.7,99,900-12,23,900 ధరల శ్రేణిలోనూ.. డీజిల్ వర్షన్ రూ.9,19,900-12,39,900 ధరల శ్రేణిలో (ఎక్స్ షోరూం ఢిల్లీ) అందుబాటులో ఉంటాయని కంపెనీ పేర్కొంది. కొత్త వేరియంట్‌ను 50 శాతం అత్యాధునిక దృఢత్వంతో కూడిన స్టీల్‌తో రూపొందించినట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ కారులో 1.6 లీటర్ పెట్రోల్/ డీజిల్ ఇంజిన్, 6-స్పీడ్ మాన్యువల్/ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్స్, ఆరు స్పీకర్లు, డ్యూయల్ ఎయిర్ బ్యాగ్స్, యాంటీ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్), ఫ్రంట్ ప్రొజెక్టర్ పోగ్ లాంప్స్ , కార్నరింగ్ లాంప్స్, రియర్ పార్కింగ్ సెన్సార్ వంటి లాంటి పలు ప్రత్యేకతలు ఉన్నాయని తెలిపింది.

ప్రమాదకర బాండ్లలోకి ఈపీఎఫ్‌వో!

ఏఏ + కార్పొరేట్ 'బాండ్ల'పై దృష్టి

- అధికాదాయమే లక్ష్యంగా నిర్ణయం
- ఈ ఏడాది 3వేలకోట్ల పెట్టుబడులు



హైదరాబాద్: పెట్టుబడులపై అధిక మొత్తంలో రాబడి ఆర్జించేందుకు గాను 'ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ' (ఈపీఎఫ్‌వో) అధిక రిస్క్‌తో కూడుకున్న కార్పొరేట్ బాండ్లపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ తరహా బాండ్లలోకి (ఏఏ+) దాదాపు రూ.3000 కోట్ల మేర ఈపీఎఫ్‌వో సొమ్మును పెట్టుబడిగా పెట్టనుంది. ఈ విషయాన్ని కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ సోమవారం వెల్లడించారు. ఇప్పటి వరకు ఈపీఎఫ్‌వో సంస్థ ఎక్కువగా రిస్క్ లేని ఏఏఏ రేటెడ్ బాండ్లలో పెట్టుబడులు పెడుతూ వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సదరు బాండ్లలో రూ.15,000 కోట్ల మేర నిధులను పెట్టుబడిగా ఉంచాలని కూడా నిర్ణయించారు. ఈ మొత్తంలోంచి రూ.3000 కోట్ల మేర నిధులను ఏఏ+ రేటెడ్ బాండ్లకు తరలించాలని తాము నిర్ణయించినట్టుగా మంత్రి వెల్లడించారు. అధికాదాయంతో పెట్టుబడులను పెంచుకోవాలనే ధ్యేయంతోనే ఈ దిశగా తాము నిర్ణయం తీసుకున్నట్టుగా మంత్రి తెలిపారు. ఈ ఏఏ+ తరహా బాండ్లలో పెట్టుబడుల మూలంగా 25-45 బేసిస్ పాయింట్ల మేర అధిక ఆదాయం లభించగలదని బండారు దత్తాత్రేయ వివరించారు. అయితే సర్కారు తీసుకున్న నిర్ణయం పట్ల ఆర్థిక విశ్లేషకులు ఉద్యోగ వర్గాల్లో ఆందోళన కనిపిస్తోంది. అధిక మొత్తం వస్తుందన్న ఆశకు పోతే.. అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం లేకపోలేదని వారు అభిప్రాయ పడుతున్నారు. పెట్టుబడుల కోసం బాండ్లను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకొనేలా సర్కారు జాగ్రత్తలు వహిస్తున్నట్టుగా ఈపీఎఫ్‌వో అధికారులు చెబుతున్నారు. రెండు రేటింగ్ ఏజెన్సీలు సదరు బాండ్లను మేటి బాండ్ల రేటింగ్‌ను ఇవ్వడంతో పాటు వరుసగా రెండేండ్ల నుంచి లాభాలను ఆర్జిస్తూ.. రూ.1000 కోట్లకు పైగా నెట్‌వర్త్ ఉన్న కంపెనీల్లోనే తాము పెట్టుబడులు పెట్టనున్నట్టుగా అధికారులు వివరిస్తున్నారు. స్టాక్ మార్కెట్లకు చెందిన ఎక్స్ఛేంజ్ ట్రేడ్ ఫండ్స్‌లో (ఈటీఎఫ్) ఈపీఎఫ్‌వో సంస్థ గత రెండేండ్లుగా రూ.27,000 కోట్ల మేర నిధులను పెట్టుబడిగా పెట్టింది. వీటి నుంచి 12.55 శాతం వడ్డీ రానుంది. అయితే ఈపీఎఫ్‌వో సంస్థ సభ్యులకు కేవలం 8.65 శాతం వడ్డీ మాత్రమే చెల్లించనుంది. మిగతా సొమ్మును డివిడెండ్ల రూపంలో ఎలా పంచాలి అన్న విషయమై ఐఐఎం అహ్మదాబాద్ అందించిన నివేదికను పరిశీలించేందుకు గాను ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టుగా తెలిపారు.

మూడేండ్ల గరిష్టానికి పెట్రోల్ ధర



న్యూఢిల్లీ: పెట్రోలు ధరలు మండుతున్నాయి. ప్రభుత్వ రంగ చమురు కంపెనీల గణాంకాల ప్రకారం జులై ఒకటి నుంచి సోమవారం నాటికి పెట్రోలు ధరలు దాదాపు రూ.ఆరు రూపాయల మేర పెరిగాయి. దీంతో పెట్రోలు ధర మార్కెట్లో మూడేండ్ల గరిష్టాన్ని దాటేసింది. ఆగస్టు 2014లో లీటర్ పెట్రోల్ ధర రూ.69.04 (న్యూఢిల్లీ) ఉండగా, 2017 ఆగస్టు 28 నాటికి రూ.70.33కు చేరువైంది. హైదరాబాద్‌లో సోమవారం లీటరు పెట్రోలు ధర రూ.73.23లు పలికింది. రోజువారీ పెట్రోలు ధరల విధానాన్ని అమలులోకి తెచ్చిన తరువాత ధరలపై సామాన్యుడి అంతగా దృష్టి పెట్టడం లేదు. దీనిని అసరా చేసుకొని చమురు కంపెనీలు క్రమంగా ధరలను పెంచుతూ వస్తున్నాయి. ఇప్పుడు ధరలు మూడేండ్ల గరిష్ట స్థాయికి చేరువవడంతో తేరుకున్న ప్రజలు సర్కారుపై తమ ఆగ్రహాన్ని వెల్లగక్కుతున్నారు. మరోపక్క డీజిల్ ధర కూడా పెరిగింది. లీటర్‌కు డీజిల్ ధర రూ.3.67 మేర పెరిగి దేశ రాజధాని ఢిల్లీలో లీటరు రూ.57.03కు చేరింది.

నేడు ఎన్‌టీపీసీలో డిజిన్వెస్ట్‌మెంట్

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ 'నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ' (ఎన్‌టీపీసీ)లో కేంద్రం మరో 5 శాతం వాటాను ఉపసంహరించుకోనుంది. దాదాపు రూ.7,000 కోట్ల విలువ చేసే వాటాలను మార్కెట్ శక్తులకు విక్రయించనుంది. ఇందుకుగాను రెండు రోజుల పాటు 'ఆఫర్ ఫర్ సేల్' (ఓఎఫ్ఎస్) నిర్వహిస్తున్నట్లు సంస్థ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. నేటి (మంగళవారం) నుంచి ఆఫర్ ప్రారంభం కానుంది. షేర్ కనీస ధర రూ.168గా నిర్ణయించింది. దీంతో సోమవారం బీఎస్ఈలో ఎన్‌టీపీసీ షేర్ 2.5 శాతం పెరిగి రూ.173.55 వద్ద ముగిసింది.

దీపావళికి మార్కెట్లోకి రెనో క్యాప్చర్



ముంబయి: ఫ్రెంచ్ ఆటో దిగ్గజం రెనో మార్కెట్లోకి సరికొత్త ప్రీమియం స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాన్ని అందుబాటులోకి తేనుంది. వచ్చే దీపావళికి క్యాప్చర్‌ను మార్కెట్లోకి విడుదల చేయనుంది. మార్కెట్లో ఇప్పటికే హల్‌చల్ చేస్తున్న హ్యుందయ్ క్రెటా, మహేంద్రా ఎక్స్‌యూవీ-500 వాహనాలకు పోటీగా సంస్థ దీనిని మార్కెట్లోకి తేనుంది. ఈ రెండు వాహనాల ప్రీమియం ధర కంటే కూడా తక్కువ ధరకు దాదాపు రూ.12 లక్షలలోనే కంపెనీ ఈ వాహనాన్ని అందించనున్నట్టుగా సమాచారం. పెట్రోల్‌లో వర్షన్‌లో 1.6 లీటర్ ఇంజిన్‌తోను, డీజిల్ వర్షన్‌లో 2 లీటర్ల సామర్థ్యపు ఇంజిన్‌తోను దీనిని రెనో మార్కెట్లోకి తేనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 10 లక్షల వాహనాలను సంస్థ విక్రయించింది. రెనో సంస్థ మార్కెట్లోకి తెచ్చిన డస్టర్ ఇప్పటికే మార్కెట్లో మేటిగా రాణిస్తున్న నేపథ్యంలో సంస్థ ప్రీమియం ఎస్‌యూవీని మార్కెట్లోకి తేనుండడం గమనార్హం.

పరుగులు పెట్టిన మార్కెట్లు



ముంబయి: కన్స్యూమర్ డ్యూరెబుల్స్, ఐటీ, మౌలిక వసతుల సూచీల మద్దతుతో వరుసగా నాలుగో సెషన్‌లోనూ మార్కెట్లు పరుగులు పెట్టాయి. సానుకూల అంతర్జాతీయ పరిణామాలకు తోడు డోక్లాంలో భారత్-చైనా మధ్య ఉద్రిక్తలు సద్దుమనగడం తదితర పరిణామాలు మార్కెట్లకు మద్దతునిచ్చాయి. గత కొద్ది రోజులుగా నేల చూపులు చూస్తోన్న ఇన్ఫోసిస్ షేర్ పుంజుకోడంతో పాటు ఎన్‌టీసీపీ షేర్ కూడా రాణించడం తదితర పరిణామాల మధ్య సోమవారం బీఎస్ఈ సెన్సెక్స్ 154.76 పాయింట్లు పెరిగి 31,750.82కు చేరింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 55.75 పాయింట్లు ర్యాలీతో 9,912.80 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ స్టాక్ నిలేకని ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి రాణించి రూ.940 వద్ద ముగిసింది. కాగా డాక్టర్ రెడ్డీస్‌కు వ్యతిరేకంగా అమెరికా కోర్టులో కేసు దాఖలు కావడంతో ఆ కంపెనీ షేర్ 2.9 శాతం మేర కోల్పోయింది.

నిఫ్టీలోకి బజాజ్ ఫైనాన్స్, హెచ్‌పీ

'నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ' (ఎన్ఎస్ఈ) అధికారిక సూచీ నిఫ్టీ నుంచి ఏసీసీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, టాటా పవర్, టాటా మోటార్స్ డీవీఆర్‌లను తొలగిస్తున్నట్టుగా ఎన్ఎస్ఈ అనుబంధ సంస్థ ఐఐఎస్ఎల్ తెలిపింది. వీటి స్థానంలో కొత్తగా బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ పెట్రోలియం, యూపీఎల్ సంస్థలు నిఫ్టీలో తాజాగా స్థానం సంపాదించుకోనున్నాయి. ఈ మార్పు సెప్టెంబరు 29 నుంచి అమలులోకి రానున్నట్టుగా వెల్లడించింది.

పీఎస్‌యూల భూముల్లో ఇండ్లు

- దేశంలో 1.2 కోట్ల గృహాల కొరత
- రాష్ట్రాలతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు



న్యూఢిల్లీ: దేశంలో 2022 నాటికి అందిరికీ గృహ వసతి కల్పించేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తోందని హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి దుర్గా శంకర్ మిశ్రా తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 'నరేడ్‌కో-2017' సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ సరసమైన ధరల్లో ప్రజలందరికీ గృహ వసతిని అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నట్టుగా తెలిపారు. గృహ వసతి ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ రంగంలోని సంస్థల (పీఎస్‌యూల) వద్ద ఉన్న మిగులు భూమిని సమీకరించాలని యోచిస్తున్నట్టుగా ఆయన వివరించారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థల (సీపీఎస్‌యూల) వద్ద అందుబాటులో ఉన్న మిగులు భూమిని సేకరించే మోడల్‌ను పరిశీలిస్తున్నట్టుగా ఆయన వివరించారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వాలతో తాము చర్చలు జరుపుతున్నామని అన్నారు. దేశంలో దాదాపు 1.2 కోట్ల గృహాల కొరత ఉందని ఆయన విశ్లేషించారు. ఇందులో అత్యధికం అల్పాదాయ, ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికే గృహ వసతి లేదని తేలిపారు. మురికివాడల అభివృద్ధి ప్రాధాన్యతను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

సీపీఎస్ రద్దు పోరాటానికి టీటీయూ మద్దతు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సీపీఎస్ విధానాన్ని రద్దు కోసం సెప్టెంబర్ 1న నిర్వహించతలపెట్టిన సామూహిక సెలవు ఉద్యమానికి తెలంగాణ ఉపాధ్యాయ సంఘం(టీటీయూ) సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి వేణుగోపాలస్వామి, ఎం రాధాకృష్ణరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు.

పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యదర్శిగా కృష్ణా బోర్డు చైర్మన్ శ్రీవాత్సవకు అదనపు బాధ్యతలు

నవతెలంగాణ, హైదరాబాద్

పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యదర్శిగా ఏకే శ్రీవాత్సవను అదనపు బాధ్యతలపై నియమించారు. ప్రస్తుతం కృష్ణా బోర్డు చైర్మన్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు కేంద్ర జలవనరుల శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీడబ్ల్యూసీలో సీనియర్ చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్రీవాత్సవ కృష్ణా బోర్డు చైర్మన్‌గా నాలుగు నెలల క్రితమే బాధ్యతలు స్వీకరించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యాలయం హైదరాబాద్‌లోని సీడబ్ల్యూసీ ప్రాంతీయ కార్యాలయంలో కొనసాగుతున్నది.

ఆ గొర్రెలకు ఇన్సూరెన్స్ ఇవ్వాలి

- చనిపోయిన మూగజీవాలతో బాధితుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గొల్లకుర్మలు

నవతెలంగాణ-మద్నూర్

ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలకు ఇన్సూరెన్స్ అందివ్వాలని, అవి ఆరోగ్యంగా లేక, ఇక్కడి వాతావరణానికి తట్టుకోలేక చనిపోతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పదిరోజుల్లోనే ప్రతి ఇంటా రెండు మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయని వాపోయారు. ఈ నేపథ్యంలో గొర్రెలపై ఇన్సూరెన్స్ అందించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీప జాతీయ రహదారిపై గొల్లకుర్మలు సోమవారం రాస్తారోకో చేశారు. మృతిచెందిన గొర్రెలతో అక్కడే బైటాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ... తమ బతుకులు రోడ్డు పాల్జేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఆరు మాసాల గొర్రెల పిల్లకు కూడా రూ.5 వేల లెక్క కట్టి పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసి ఇక్కడికి తెచ్చేసరికి అనారోగ్యం పాలై చనిపోతున్నాయని అన్నారు. యూనిట్‌లో రెండు, మూడు, నాలుగు.. ఇలా చనిపోతున్న వాటి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పంపిణీ చేసిన గొర్రెలకు నెంబర్లతో సహా ట్యాగ్ వేసినప్పటికీ మృతిచెందిన వాటికి ఇన్సూరెన్స్ అందడం లేదని, ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా విరమించలేదు. ఎస్ఐ కాశీనాథ్ సంఘటనా స్థలానికి వచ్చి జాతీయ రహదారిపై రాస్తారోకో చేయొద్దని కోరారు. ఆ తర్వాత యాదవులు అక్కడ్నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చనిపోయిన గొర్రెలతో వెళ్లి, రెండు గంటల పాటు ధర్నా చేశారు. 'చనిపోయిన గొర్రెలకు ఇన్సూరెన్సు వస్తుందా లేదా చెప్పండి' అంటూ ఫోన్‌లోనే పశువైద్యుడితో వాగ్వాదానికి దిగారు. అన్నింటినీ పరిశీలిస్తామని చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

వయోపరిమితి రగడ!

అటవీ పోస్టులకు వర్తించని సడలింపు

- రేంజ్ ఆఫీసర్లకు 28 ఏండ్లకే కుదింపు
- అభ్యర్థుల్లో ఆందోళన
- 38 ఏండ్లకు పెంచాలని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అటవీ శాఖలో వయో పరిమితి సడలింపు అంశంపై రగడ జరుగుతున్నది. అటవీ శాఖలో ఇటీవల ప్రకటించిన పోస్టులకు వయో పరిమితిని కుదించడంతో అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ (ఎఫ్‌బీఓ)కు 18 నుంచి 31 ఏండ్లకు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ (ఎఫ్ఆర్ఓ)కు 18 నుంచి 28 ఏండ్లకు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు (ఎఫ్ఎస్ఓ)కు 18 నుంచి 31 ఏండ్లుగా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్ణయించి నోటిఫికేషన్లు ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సం కానుకగా జారీ చేసింది. ఇందులో బీట్ ఆఫీసర్స్ 1,857 పోస్టులు, రేంజ్ ఆఫీసర్స్ 67 పోస్టులు, సెక్షన్ ఆఫీసర్స్ 90 పోస్టుల చొప్పున మొత్తం 2,014 పోస్టులకు మూడు నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఈనెల 21 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చేనెల 12వ తేదీ వరకు గడువుంది. నోటిఫికేషన్లలో పేర్కొన్న వయోపరిమితి అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నది. రేంజ్ ఆఫీసర్లకు 28 ఏండ్లు గరిష్ట వయోపరిమితి నిర్ణయించడం పట్ల అభ్యర్థులు మనోవేదనకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 8న వయో పరిమితిని 34 నుంచి 44 ఏండ్లకు సడలింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2019, జులై 26 వరకు వయో పరిమితి సడలింపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వయోపరిమితి సడలింపు మాత్రం అటవీ శాఖలో ప్రకటించిన పోస్టులకు వర్తింపచేయలేదు. దీంతో అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. రేంజ్ ఆఫీసర్లకు గరిష్ట వయో పరిమితిని 28 ఏండ్లకు టీఎస్‌పీఎస్సీ కుదించింది. అభ్యర్థులకు ఇది మరింత ఆవేదనను కలిగిస్తున్నది. అటవీ శాఖలో పోస్టులకు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్రలో 38 ఏండ్లు, ఉత్తరాఖండ్‌లో 42 ఏండ్లు, ఉత్తరప్రదేశ్‌లో 40 ఏండ్లు, అస్సాంలో 38 ఏండ్లు గరిష్ట వయోపరిమితి ఉంది. కానీ ఉద్యమించి సాధించిన తెలంగాణలో మాత్రం రేంజ్ ఆఫీసర్లకు గరిష్ట వయోపరిమితి 28 ఏండ్లుగా నిర్ణయించడాన్ని తప్పుపడుతున్నారు. ఉద్యమ కాలంలో, ఆ తర్వాత నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడం వంటి కారణాలతో నష్టపోయిన అభ్యర్థులకు వయో పరిమితి సడలింపును పదేండ్లకు పెంచాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు. రేంజ్ ఆఫీసర్లకు 28 ఏండ్ల నుంచి 38 ఏండ్లకు పెంచాలని నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ మానవతారాయ్ డిమాండ్ చేశారు. వయో పరిమితి సడలింపు అంశాన్ని చేర్చి తిరిగి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతున్నారు. అభ్యర్థులకు న్యాయం చేయాలని టీఎస్‌పీఎస్సీకి సూచించారు. ఎఫ్ఎస్‌వో ఉద్యోగాలకు సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్ చదివిన అభ్యర్థులకే దరఖాస్తు చేసేందుకు అవకాశం ఇవ్వడాన్ని అభ్యర్థులు తప్పుపడుతున్నారు. ఎఫ్ఆర్ఓ పోస్టులకు ఇంజినీరింగ్ విద్యార్హతను పేర్కొన్నట్టుగానే ఎఫ్ఎస్ఓ పోస్టులకూ ఇంజినీరింగ్ చదివిన అందరికీ దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

కోర్టును ఆశ్రయించే యోచనలో అభ్యర్థులు!

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) పోస్టులకు గరిష్ట వయో పరిమితి 28 ఏండ్లుగా నిర్ణయించడం పట్ల కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ స్పందించి రేంజ్ ఆఫీసర్ల పోస్టులకు గరిష్ట వయో పరిమితి పెంచాలని అభ్యర్థులు కోరుతున్నారు.

30న చెరువుల్లో చేప పిల్లల విడుదల

తలసాని శ్రీనివాస్‌యాదవ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి పర్చాలనే ఉద్దేశంతో 30న సింగూరు జలాశయం నుంచి చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రూ.52 కోట్లతో దాదాపు 70 కోట్ల చేప పిల్లల పంపిణీకి మత్స్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 77 జలాశయాలు, మత్స్యశాఖ పరిధిలో ఉన్న 4647 చెరువులు, 20,391 గ్రామ పంచాయతీ కుంటలకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో కొనుగోలు కమిటీల ద్వారా, ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా టెండర్లు పిలిచి, చేప పిల్లల కొనుగోలు ధరలు నిర్ణయించామని వివరించారు. ఈ పథకం పట్ల అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా 4200 మత్స్య సహకార సంఘాలలోని 3 లక్షల మత్స్య కార సభ్యులకు లబ్ది చేకూరుతుందని అన్నారు. 2018-19లో వెయ్యి కోట్లతో సమీకృత మత్స్య అభివృద్ధి పథకాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. మత్స్య శాఖను బలోపేతం చేసేందుకు 214 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్‌చందా, రాష్ట్ర గొర్రెల మేకల అభివృద్ధి సహకార సమాఖ్య సంస్థ చైర్మెన్ రాజయ్య, మత్స్య శాఖ కమిషనర్ సువర్ణ, పశు సంవర్థక శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేయూలో నాక్ బృందం

- మూడు రోజులు పరిశీలించనున్న సభ్యులు

నవతెలంగాణ-కేయూ క్యాంపస్

కేయూలో నాక్ బృందం మూడు రోజుల సందర్శన సోమవారం ప్రారం భమైంది. మధ్యప్రదేశ్ మహాత్మా గాంధీ చిత్రకూట్ గ్రామోదయ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ ఎన్‌సీ గౌతం నేతృత్వంలో ఏడుగురు సభ్యుల బృందం ఉదయం కేయూకు చేరుకుంది. వారికి ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనం చేశారు. వీసీ కమిటీ హాల్లో యూనివర్సిటీ గత అయిదు సంవత్సరాల్లో సాధించిన ప్రగతిని బృంద సభ్యులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కేయూ వీసీ సాయన్న వివరించారు. అనం తరం న్యాక్ సభ్యులు మూడు బృందాలుగా విడిపోయి వివిధ విభాగాలను సందర్శిం చారు. బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, బాటనీ, జువాలజీ, సెరికల్చర్, జియాల జీ, కామర్స్ కళాశాల, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ, తెలుగు, పొలిటికల్ సైన్స్ విభాగాలను పరిశీలించారు. మధ్యాహ్నం ఫార్మసీ, ఫిజిక్స్, మ్యాథ్స్, లైబ్రరీ, ఎకనా మిక్స్, ఎడ్యుకేషన్, లైబ్రరీ సైన్స్, స్టాటిస్టిక్స్ విభాగాలను పరిశీలించారు. వీటితో పాటు మధ్యాహ్నం మహిళాధ్యయన కేంద్రం, ఫారిన్ రిలేషన్స్ ఆఫీస్, ఎన్ఎస్ఎస్, ఇండస్ట్రీ లింకేజ్ విభాగం, యోగా సెంటర్, పరీక్షల విభాగాన్ని సందర్శించారు. ఆయా విభాగాల అధ్యాపకులు తమ ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు వివరించారు. ల్యాబ్‌లను, తరగతుల స్థితిగతులను బృందం సభ్యులు పరిశీలించారు. ఇక్కడి సౌకర్యాలను అడిగి తెలుకున్నారు. అనంతరం వారు విద్యా ర్థులు, అధ్యాపకులు, ఉద్యోగుల, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో భేటీ అయ్యారు.

పాలమూరు తర్వాతే ఇతర జిల్లాలకు..

- అనాలోచిత నిర్ణయాలతో తగాదాలు పెట్టొద్దు: నీటి తరలింపుపై అఖిలపక్షం ధర్నాలు



మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

నవతెలంగాణ - యంత్రాంగం

ఉమ్మడి పాలమూరు జిల్లాకు నీళ్లు సరిపోయాకే ఇతర జిల్లాలకు తరలింపు ఆలోచన చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం ధర్నాలు నిర్వహించారు. అనాలోచిత నిర్ణయాల వల్ల ఉమ్మడి పాలమూరు, నల్లగొండ జిల్లాల మధ్య తగాదాలు వస్తాయని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణానది నీళ్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో చేపట్టిన ధర్నాలో కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి ప్రసంగించారు. రాష్ట్రంలో నీళ్ళు, నిధుల కోసం మరో ఉద్యమం చేపట్టే తరుణం ఆసన్నమైందన్నారు. రాష్ట్రం వస్తే వెనుకబడిన ప్రాంతాల వారీగా ప్రాజెక్టులు నిర్మిస్తారని అనుకున్నామన్నారు. కానీ అందుకు భిన్నంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతోందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి నల్లగొండకు నీరు తీసుకెళ్తున్న డిండి ప్రాజెక్టు రెండు జిల్లాల రైతుల మధ్య తగాదాలు సృష్టిస్తుందన్నారు. నీటి పంపకాల్లో జిల్లాకు అన్యాయం చేస్తే ప్రజల పక్షాన పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. గద్వాల ఎమ్మెల్యే డికె.అరుణ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో కమీషన్‌కు కక్కుర్తిపడి కోట్ల రూపాయలు దోపిడీ చేస్తున్నారన్నారు. రైతులకు నష్టపరిహారం లక్షల్లో ఇచ్చి కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయలు దోచిపెడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం), సీపీఐ, టీడీపీ, సీపీఎంఎల్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నీళ్ల కోసం, నిర్వాసితుల కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రులకు ప్రాజెక్టులపై అవగాహన లేదన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కృష్ణానది నీళ్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ జిల్లాలకు నీళ్లు సరిపోయాకే ఇతర జిల్లాలకు నీటి తరలింపు ఆలోచనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక సభ్యులు రాఘవాచారి, మురళీధర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.జబ్బార్, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్రయ్య, టీడీపీ జిల్లా అధ్యక్షులు రాములు, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సాంబశివరావు, కాంగ్రెస్, వైసీపీ, బీఎస్పీ, ఎంసీపీఐ, తెలంగాణ ఇంటిపార్టీ, బహుజన్‌ముక్తి పార్టీ, లోక్‌సత్తా, ఏఐఎంఐఎం, ఐయూ ఎంఎల్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఆర్డీఓ కార్యాలయం, కొల్లాపూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద, కల్వకుర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కల్వకుర్తిలో ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే యడ్మ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. జోగులాంబ జిల్లాలోని వడ్డేపల్లి మండల కేంద్రంలో ధర్నా చేశారు.



తిమితి పండుగ

తమిళనాడులోనే కాక ప్రపంచవ్యాప్తంగా తమిళులు అత్యధికంగా నివసించే ప్రాంతాల్లో జరిగే పండుగల్లో ముఖ్యమైనది 'తిమితి' పండుగ. ఇది అక్టోబర్ - నవంబర్ మాసాల్లో వచ్చే పండుగ. తిమితి అంటే గుండం అనే అర్థం ఉంది. ఈ పండుగ రోజు అగ్నిగుండంలో నడుస్తారు కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. తిమితిని ద్రౌపది అమ్మాళ్ గౌరవార్థం జరుపుకుంటారు. పాండవ పత్నియైన ద్రౌపది అవతారమే మరియమ్మన్ దేవత అని తమిళ హిందువులు నమ్ముతారు. అందుకే ఈ పండుగరోజున ఇద్దరినీ పూజిస్తారు. శ్రీలంక, సింగపూర్, మలేషియా, మారిషస్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో తమిళులు ఈ పండుగను అత్యంత ఉత్సాహంతల జరుపుకుంటారు. పండుగ రోజు అనేక భక్తులు, డ్రామా ట్రూపులవారు అనేక సంఘటనలను వేషధారణతో ప్రదర్శిస్తారు. పెరియాచికి హిజ్రాను బలివ్వడం ఈ ప్రదర్శనల్లో ఒకటి. అట్లాగే మరియమ్మన్‌కి క్షీరాభిషేకం చేస్తారు. అన్నింటికన్నా ముఖ్యమైనది అగ్నిగుండంలో కణ కణలాడే నిప్పకణికల మీద నడవడం.



సింగపూర్‌లోని సిరంగూన్ రోడ్డులో ఉన్న శ్రీ శ్రీనివాస పెరుమాల్ దేవాలయంలో ఈ ఉత్సవాలు రాత్రి పదిగంటలకు ప్రారంభమవుతాయి. అక్కడి నుంచి పూజారి ఆధ్వర్యంలో భక్తులు ఊరేగింపుగా సౌత్ బ్రిడ్జి రోడ్‌లో ఉన్న మరియమ్మన్ దేవాలయానికి పోతారు. ఇక్కడే ప్రధానంగా తిమితి పండుగ జరిగేది. ఈ దేవాలయం దగ్గర ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో పూజారి ఒక పవిత్రజల పాత్ర (కరకట్టం)ను నెత్తినపెట్టుకొని నడవడంతో ఉత్సవం ప్రారంభమవుతుంది. పూజారిని అనుసరిస్తూ పురుష భక్తులు తమ కోర్కెలను తీర్చమని కోరుతూ నిప్పులమీద నడుస్తారు.

పండుగ సందర్భంగా జరిగే కార్యక్రమాలు



తిమితి పండుగకు ఒక వారం రోజుల ముందే మహాభారతంలోని వివిధ ఘట్టాలను భక్తులు, నాటకాలు వేసేవారు ప్రదర్శిస్తారు. అట్లాగే పెరియాచి దేవునికి ప్రార్థనలు చేస్తారు. ఈ పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కాపాడమని పెద్దఎత్తున మరియమ్మన్‌ని ఉద్దేశించి ప్రార్థనలు చేస్తారు.

ఇక రెండవ కార్యక్రమంగా అర్జునుడు-ద్రౌపది వివాహ మహోత్సవాన్ని ప్రతీకాత్మకంగా నిర్వహిస్తారు. ఈ వివాహ కార్యక్రమం జరిగిన వెంటనే అతిముఖ్యమైన తంతునొకదాన్ని నిర్వహిస్తారు. అదే హిజ్రాను 'బలిచ్చే' కార్యక్రమం. మహాభారత యుద్ధం ప్రారంభానికి ముందు పాండవుల విజయాన్ని ఆకాంక్షిస్తూ ఒక హిజ్రాను బలిచ్చారట. ఆ సంఘటనను గుర్తు చేసుకుంటూ హిజ్రాను బలిస్తున్నట్లు ఒక కార్యక్రమాన్ని ప్రతీకాత్మకంగా నిర్వహిస్తారు. అంతే కానీ నిజంగా బలి ఇవ్వరు.

ఆ తర్వాత భక్తులు పాల పాత్రలను సమర్పించడం, కుంబిదుతండం (సాష్టాంగ నమస్కారం) చేయడం, అంగప్రదక్షిణ చేయడం వంటివాటిని నిర్వహిస్తారు. భక్తులు సమర్పించిన పాలతో మరియమ్మన్‌కి క్షీరాభిషేకం చేస్తారు. ఇట్లా చేస్తే మనుషులు చేసిన పాపాలు తుడిచిపెట్టుకుపోతాయని భక్తుల నమ్మకం.

తిమితి పండుగకు రెండు రోజుల ముందు వెండి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. మహాభారతంలో 18 రోజులపాటు యుద్ధం చేసి పాండవులు సాధించిన విజయానికి గుర్తుగా ఈ కార్యక్రమాన్ని చేపడతారు.

- మౌక్తిక్

ఐరోపా దేశాల్లో బల్గేరియా ఒకటి.ఈ దేశ సంస్కృతి చాలా ప్రత్యేకమైనది. ఇక్కడ స్థానిక జాతీయులు, టర్క్‌లు, జిప్సీలు ప్రధానంగా నివసిస్తున్నారు. వీరుకాక ఆర్మేనియా, యూదు జాతీయులు వంటి మైనారిటీ ప్రజలు కూడా ఉన్నారు. టర్క్‌లు తమను తాము బల్గేరియా జాతీయులమని చెప్పకోవడానికి ముందుకు రారు. స్థానిక బ్లేరియా ప్రజలు కూడా వీరిని బయటివారుగానే చూస్తారు. అయితే జిప్సీలను మాత్రం స్వదేశీయులుగానే భావిస్తారు.ఇండో-యూరోపియన్ భాషాకుటుంబానికి చెందిన బల్గేరియన్ భాష ప్రధాన భాష. అయితే టర్కిష్ మైనారిటీ ప్రజలు టర్కీ భాష మాట్లాడుతారు. జిప్సీలు రోమనీ భాష మాట్లాడుతారు.

బల్గేరియా సంస్కృతి



బల్గేరియా ప్రజలు ప్రధాన ఆహారం బ్రెడ్, పాల ఉత్పత్తులు, మాంసం, కూరగాయలు. ఇవికాక స్థానికంగా కాలాన్ని బట్టి దొరికే పంటలను తింటారు. క్రైస్తవ, ముస్లిం పండుగల సందర్భాల్లో ఆయా మతాలను అనుసరించేవారు ప్రత్యేక వంటకాలతో పండుగ చేసుకుంటారు.

వివాహం

వ్యక్తిగత ఇష్టా ఇష్టాలను బట్టే పెండ్లి చేసుకుంటారు. అయినా భాగస్వామి ఎంపికలో కుటుంబ సభ్యుల ఒత్తిడి కూడా కొంత ఉంటుంది. అయితే పోమక్స్, జిప్సీలు ఇంతకు ముందు పెద్దలు కుదిర్చిన వివాహాలకే మొగ్గు చూపేవారు. కానీ ఇటీవల కాలంలో వారి వివాహ వ్యవస్థలోనూ కొంత మార్పు కనిపిస్తున్నది. మతపరమైన పెండ్లిండ్లకు ఇక్కడ గుర్తింపు ఉండదు. లౌకిక వివాహాలకే ప్రభుత్వ గుర్తింపు ఉంది. పర జాతీయులను వివాహం చేసుకోవడం తక్కువ. స్వజాతీయుల్లోనూ మరీ దగ్గరి రక్త సంబంధీకులను పెండ్లాడకూడదు. ఇరవై ఏండ్లు నిండినవారు ఎక్కువగా పెండ్లికి ఉపక్రమిస్తారు. ఒకప్పుడు విడాకులు చాలా తక్కువ ఉండేవి కానీ ఈ మధ్య పెరిగింది.

వారసత్వం

పేరుకు స్త్రీ పురుషులిరువురికీ సమాన ఆస్తి హక్కు ఉంది. కానీ ఆచరణలో స్త్రీలకంటే పురుషులకే అధికంగా ఆస్తి దక్కుతుంది. ఇల్లు, పొలం, పశువులు వంటి సకల చర, స్థిరాస్తులను కుటుంబ సభ్యులకు సమానంగా పంచడం ఆనవాయితీ. కానీ నిజానికి ఆచరణలో కొందరు వారసులకు అసలు ఆస్తిని పంచరు. కొందరికి మిగతా వారికంటే అధికంగా పంచుతారు. కూతుర్లకు కుమారులకన్నా తక్కువ భూమిని పంచుతారు. పెండ్లి సమయంలో సామాన్లు లేక పశువుల రూపంలో అత్తవారింటికి కూతురు కొంత ఆస్తి తీసుకుపోతుంది కాబట్టి తక్కువ పంచుతారని చెబుతారు. అయితే నివాసం ఉండే ఇల్లు మాత్రం సాధారణంగా కుటుంబంలో చిన్న కుమారునికి ఇస్తారు.





రక్తసంబంధం, పెండ్లి ద్వారా మాత్రమే బంధువర్గాన్ని గుర్తిస్తారు. దగ్గర బంధువులు, ఫ్రెండ్స్, ఇరుగుపొరుగువారిని కలిపి 'బ్లిజ్కి' అంటారు. తమ బ్లిజ్కీలో ఉన్నవారికే ఎక్కువ ఆదరణ, సహాయ సహకారాలు అందిస్తారు. దూరపు బంధువులను పెద్దగా పట్టించుకోరు.

బల్గేరియా ప్రజలకు ఇతర యూరోపియన్ ప్రజలకు ఒక విషయంలో చాలా స్పష్టమైన తేడా కనిపిస్తుంది. వారు ఔను అని చెప్పడానికి తల అడ్డంగా ఊపుతారు. నో (కాదు) అని చెప్పడానికి తల పైకి కిందికి ఊపుతారు. దీనికి పూర్తి విరుద్ధంగా మిగతా దేశాలవారు ప్రవర్తించడం తెలిసిందే.

బల్గేరియా ప్రజలు ఆతిథ్యంలో తమకు సాటి ఎవరూ లేరనుకుంటారు. పిలవని అతిథి ఎవరైనా వస్తే మిగతా వారికంటే ముందు వారినే ముందుగా పలుకరించి షేక్‌హాండ్‌తో ఇంటి లోపలికి తీసుకుపోతారు. భోజన సమయంలో అతిథికి భోజనం, డ్రింక్ ఇస్తారు. మామూలు సమయంలో డ్రింక్ (సాధారణంగా ఇంట్లో తయారుచేసిన 'రకియా' అనే డ్రింక్) ఇస్తారు. అతిథి ఆతిథ్యాన్ని స్వీకరించకపోతే అమర్యాదగా భావిస్తారు. ఇతరుల ఇండ్లకు వెళ్లేటప్పుడు పూలు కాని, స్వీట్లు కానీ తీసుకువెళ్లడం ఆచారం.

రోడ్డు లేక ఇతర పబ్లిక్ స్థలాల్లో కొత్తవారు ఒకరి ముఖాల్లోకి ఒకరు చూడటం చేయరు. బస్‌లో ప్రయాణించేటప్పుడు వృద్ధులైన స్త్రీలు, చిన్న పిల్లల్ని ఎత్తుకున్న స్త్రీలు నిలబడి ఉంటే వారికి కూర్చున్న యువతీ యువకులు లేచి సీటు ఇవ్వడం సంప్రదాయం. అట్లా సీటు ఇవ్వకపోతే తోటి ప్రయాణీకుల నుంచి విమర్శలు ఎదురవుతాయి.

- భూపేంద్ర

కళాక్షేత్రం ఆమె కార్యస్థానం


భర్తతో ...


నృత్యం మనసుకే కాక శరీరానికి కూడా అత్యంత ఆవశ్యకమైన కళారూపం. శారీరక, మానసిక ఆరోగ్యాలకు భారతీయ నృత్యాలు పెట్టింది పేరు. ఒకప్పుడు ఆధిపత్యకులాల్లో నృత్యాభాసం నిషిద్ధం. కేవలం కొన్ని కులాలవారే నాట్యం నేర్చుకొని దేవాలయాల్లో, రాజాస్థానాలు, జమిందారీల్లో ప్రదర్శనలు ఇస్తూ పొట్టపోసుకునేవారు. అటువంటి సంప్రదాయ నృత్య కళ పట్ల జనసామాన్యంలోనే కాక, ఆధిపత్యకులాల్లో కూడా మంచి గౌరవ ప్రతిపత్తులు కల్పించేందుకు ఎందరో కృషిచేశారు. అటువంటివారిలో రుక్మిణీ దేవి అరండేల్ ఒకరు. ఆమె మద్రాసులో స్థాపించిన 'అంతర్జాతీయ కళల అకాడమీ' తరువాతి కాలంలో 'కళాక్షేత్రంగా'గా ప్రసిద్ధి చెందింది.

కళాక్షేత్రంలో నాట్యశాస్త్రంతో పాటు, భరతనాట్య కళాకారులు అభినయదర్పణం, సంగీత రత్నాకరాలను అధ్యయనం చేస్తారు. అలరింపు, జతిస్వరం, శబ్దం, వర్ణం, పదం, శ్లోకం, తిల్లానాల్లో శిక్షణ పొందుతారు. అలరింపు, జతిస్వరం, తిల్లాన, నర్తకులకు నృత్యంలో ఉన్న అనుభవాన్ని చూపితే; శ్లోకం, పదం, జావళి, వారికి అభినయంలో ఉన్న అభినివేశాన్ని తెలియజేయడానికి ఉపయోగపడుతున్నాయి. ఇక వర్ణం నృత్యాన్ని, అభినయాన్ని సమపాళ్లలో పొందుపరుస్తుంది. కళాక్షేత్రం తొలి ప్రిన్సిపాల్ టైగర్ వరదాచారి. వీణ కృష్ణమాచారి, మైసూర్ వాసుదేవాచారి, పాపనాశం శివన్, యం.డి.రామనాథన్ వంటి ఉద్దండులు కళాక్షేత్రంకి తమ శక్తిని ధారపోశారు. శారద హాఫ్‌మన్, శాంతి ధనుంజయన్, అడయార్ లక్ష్మణన్, యామినీ కృష్ణమూర్తి వంటి ప్రసిద్ధ కళాకారులు ఈ క్షేత్రం నుంచే వచ్చారు. మొదట్లో ఒకే ఒక విద్యార్థితో ప్రారంభమైన ఈ కళాక్షేత్రం జాతీయంగా, అంతర్జాతీయంగా ఎంతో పేరుతెచ్చుకొంది.


రుక్మిణీదేవి

మద్రాసు ప్రెసిడెన్సీలోని పుదుకొట్టయ్‌లో సంస్కృత పండితుడు నీలకంఠశాస్త్రి ఎనిమిదవ సంతానంగా లీపుసంవత్సరం 1904 ఫిబ్రవరి 29న రుక్మిణీ అరండేల్ జన్మించారు. థర్డ్‌ఫారమ్ (ఎనిమిదవ తరగతి) వరకు చదువుకున్నారు. అదే కాలంలో ఆలయాల్లో నృత్యంచేసే దేవదాసీలను గమనిస్తూ వచ్చారు. కానీ నృత్యాన్ని నేర్చుకోలేదు. సంగీతాన్ని మాత్రం అభ్యసించారు. అయితే 1932లో మీనాక్షి సుందరం పిళ్లై, పండనబ్లూర్ నృత్యం చూసిన తరువాత నాట్యం నేర్చుకోవాలనే కోరిక కలిగింది. దివ్యజ్ఞాన సమాజం ప్రభావంతో ఉన్న తండ్రి అడుగుజాడలను అనుసరించారామె. ఆనాటి సామాజిక కట్టుబాట్లను, సంప్రదాయాలను కాదని పదహారవ ఏటనే జార్జి షిడ్నీ అరండేల్ (40)ని వివాహమాడారు.

తన 24వ యేట రుక్మిణీ అరండేల్ దివ్యజ్ఞాన సమాజ కార్యకలాపాల్లో భాగంగా విదేశాలకు వెళ్లడం ప్రారంభించారు. ఆస్ట్రేలియాలో ప్రసిద్ధ నృత్యతార అన్నా పావ్‌లోవా పరిచయం అయింది. ఆమె ప్రోత్సాహంతో తన 30వ యేట నృత్యాన్ని నేర్చుకోవడం ప్రారంభించారు రుక్మిణి.మద్రాస్ లజ్ కార్నర్ (మైలాపూర్)లో ఉన్న కపాలీశ్వర దేవాలయంలోని గౌరీ అమ్మాళ్ అనే నృత్యకారిణి దగ్గర నాట్యం నేర్చుకోవడం ప్రారంభమయింది. దీక్షతో అచిరకాలంలోనే నాట్యమభ్యసించిన ఆమె తన భర్త అండతో 'ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ ద ఆర్ట్స్'ను నెలకొల్పారు. 1944లోనే కళాక్షేత్ర తరపున మద్రాస్ యూనివర్సిటీలో శిరోమణి (సంగీత విభాగం) ప్రారంభించారు. మరుసటి ఏడాది భర్త మరణంతో నిరాశకు గురైన ఆమె తన సన్నిహితుల ప్రోత్సాహంతో కళాక్షేత్ర అభివృద్ధికి మరింత కృషిని ఆరంభించారు. 31 జనవరి 1952న తొలి స్నాతకోత్సవంలో 20 మంది కళాక్షేత్ర విద్యార్థులు డిప్లమోలను అందుకున్నారు.


కళా క్షేత్రం ప్రారంభ దినాల్లోని దృశ్యం

ఆసాదివారి నృత్య కళారూపం

తెలుగు సంస్కృతిలో ఆసాదివారు పోషిస్తున్న పాత్ర మరువరానిది. వీరిని మాదిగ ఉప కులానికి చెందినవారుగా భావిస్తారు. అయితే వీరికి ఆధిపత్యకులాల వారిలాగే ఎన్నో ఆచార సంప్రదయాలు, భక్తి ప్రపత్తులు ఉన్నాయి. వీరు ప్రత్యేకంగా చేసే నృత్యం ఒకటుంది. ఈ నృత్యాన్ని వారి పేరుమీదగానే ఆసాది నృత్యం అంటారు. అమ్మవారు సోకినప్పుడు, వర్షాలు రానప్పుడు గ్రామీణులు వీరి నృత్యాన్ని ఏర్పాటు చేస్తారు.సంవత్సరాది పండుగ మరుసటిరోజు కొందరు ఆధిపత్యకులాలవారు తమ కుటుంబ ఆచారంలో భాగంగా వీరి సేవలను ఉపయోగించుకుంటారు. కాపుకులంలో పెద్దమ్మ కాపులని ఉన్నారు రాయలసీమలో. ఆరోజు పెద్దమ్మ దేవతకు బలిచ్చి, ఇంటిలో బోనం కుండను తయారుచేసుకొని ఆసాదివారి నృత్యంతో గుడికి పోతారు వీరు. ఇది కాపు నియమం. ఆరోజు ఆసాదివారు కాపు ఇండ్లకొచ్చి తమ వాయిద్యాలతో కొలువు చేసి, వాళ్ల పూర్వీకులందర్నీ పేరు పేరునా పొగుడుతారు. తర్వాత ఇంటి ఆడపడుచులు నెత్తిమీద బోనంకుండ మోసుకొని వస్తారు. గటం దుత్త, బలి జంతువు వంటివాటిని ఇతరులు తీసుకొస్తారు. ఆసాదివారు తమ వాయిద్యాలను మోగిస్తూ ఊరేగింపుగా పెద్దమ్మ గుడిదగ్గరికి వస్తారు. అప్పుడు కుమ్మరివారు పూజ జరిపిస్తూ ఉంటారు. కాపుల వస్తువులన్నీ అక్కడ పెడతారు. గ్రామ ప్రజలు చుట్టూ ఉంటారు.

ఆట పాట


ఆసాదివారు మేలుకొలుపు పాటలు పాడుతూ ఆడతారు. ఈ నృత్యంలో ఆసాదివారు ముగ్గురుంటారు. ముగ్గురి దగ్గర వాయిద్యాలుంటాయి. మొదట ప్రధాన గాయకుడు పాటపాడితే, తక్కిన ఇద్దరూ వంతపాడుతారు. ప్రధాన గాయకుడు వంతపాడేటప్పుడు వలయాకారంగా తిరుగుతూ, వెనక్కి, ముందుకి అడుగులు వేస్తూ, వంగుతూ, లేస్తూ చేతులనాడిస్తూ, కాళ్ల గజ్జెల సవ్వడితో నృత్యం చేస్తుంటారు. వంతపాడేవారు అతణ్ణి అనుసరిస్తూ ఉంటారు. ప్రధాన గాయకుడు చేతిని గాలిలో ఊపుతూ, ఒక్కోసారి చూపుడువేలుని చెవిలో పెట్టుకుంటూ లయాన్వితంగా రాగం తీస్తుంటాడు. ఇంకా పాదాలు పైకెత్తి మునివేళ్లమీద పెనవేసుకొని నిలబడి తిరుగుతూ, మోకాళ్లపై కూర్చొని నేలమీద అరచేత్తో కొడుతూ, పెద్దమ్మ దేవత దగ్గరికి పోయి నమస్కారం చేస్తాడు. అప్పుడు వంతలు అతడు పాడిన పాటనే పాడుతూ, అభినయంతో అతడ్నే అనుసరించడంతో నృత్యం త్రిమూర్తుల నాట్యంగా కనిపిస్తుంది. కొన్ని పాటల ద్వారా పెద్దమ్మ సామిని పూజారి ఒల్లులోకి (పూనకం) రప్పించడం, వేపాకు తినిపించడం, కల్లుముంతలో వేపాకును ముంచి అందరిమీద చల్లడం, గ్రామాన్ని రక్షించమని ఆసాదివారు కోరుకుంటారు.



ఆసాదులు నృత్యం చేస్తూ పాడేవి ముఖ్యంగా కథాగేయాలే. అవి పెద్దమ్మ కథ, చల్లాపురమ్మ కథ వంటివి. వీరు తాము పెద్దమ్మ దేవతకు ప్రీతిపాత్రులమని చెప్పుకుంటారు. ఎంతో భక్తితో ఆసాదివారు అలంకరించుకొని ఆరుబయట ప్రేక్షకుల మధ్య కథ చెబుతారు. గ్రామంలో కొంత సొమ్ము వసూలు చేసి వీరికి ఇస్తారు. సుమారు మూడు లేదా ఐదు లేదా తొమ్మిది రోజుల్లో కథ చెబుతారు. ప్రతిరోజు రాత్రి పెద్దమ్మ దేవతకు పూజలు చేస్తూ, గ్రామస్తులచేత ఆమెను కొలిపిస్తూ గ్రామాలను కాపాడమని ఆసాదివారు ప్రార్థిస్తారు.

మోకాలి దాకా పంచె కట్టుకొని ఉంటారు. కథ చెప్పే వ్యక్తి మాత్రం నల్లని కోటు ధరించి, ఎర్రని తల పాగా చుట్టుకుంటారు. నడుముకు కడ్డ కట్టుకొని, నుదుట బండారు బొట్టు పెట్టుకొని చేతిలో వేప మండల్ని పట్టుకొని కల్లు తాగి కథ చెప్పటం వారి సాధారణ అలవాటు. లేదా కథ మధ్యలో పెద్ద సామికి నైవేద్యం పెట్టేటప్పుడు కల్లుతాగుతారు. జాతర జరిగే టప్పుడే వీరికి ఎక్కువగా పని తగులుతుంది. పెద్దమ్మ దేవతకు దేవర పోతును బలిచ్చేటప్పుడు వీరు ఆడుతూ పాడే గేయాలు గుండెల్ని ఊపేస్తాయి.

రాయల సీమలో ఎక్కువగా కనిపించే ఆసాదివారు తెలుగు జానపద సంస్కృతిలో విడదీయరాని బంధం కలిగి ఉన్నారని చెప్పక తప్పదు.




సైనా పట్ల బాధగా ఉంది. సెమీస్ మ్యాచ్‌కు అవసరమైన సమయం ఆమెకు దక్కలేదు. రాత్రి పొద్దుపోయాక క్వార్టర్స్ ఆడి, మళ్లీ తర్వాతి రోజు పొద్దున్నే సెమీస్ ఆడాల్సి వచ్చింది. ఓవరాల్ షెడ్యూల్‌తో సమస్య. షెడ్యూల్‌ను టెలివిజన్ నియంత్రించకూడదు. టెక్నికల్ అధికారులే దీనికి బాద్యత వహించాలి. ప్లేయర్స్‌కు కనీస విరామ సమయం ఉందా లేదా అనేది వారు చూసుకోవాలి. శ్రీకాంత్, చెన్ లాంగ్ మ్యాచ్ విషయంలోనూ ఇదే జరిగింది. సైనా, సింధు గొప్పగా ఆడారు.

- విమల్ కుమార్ (సైనా నెహ్వాల్ కోచ్)

ఒంటికాలితోనైనా ఆడగలను!

- ఆసియా కప్‌లో పాక్‌తో పోరుపై ధోని
- గాయంపై ఆందోళన వద్దని చీఫ్ సెలక్టర్‌కు భరోసా
- మహి అంకితభావంపై ఎమ్మెస్కే ప్రశంసలు





నవతెలంగాణ-చెన్నై

2016 ఆసియా కప్. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో పోరు కోసం జోరుగా టీమ్ ఇండియా సన్నద్ధత. కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని సహజంగానే జిమ్‌లో కఠోర కసరత్తులు చేస్తున్నాడు. బరువులు ఎత్తుతూ వ్యాయామం చేస్తున్నాడు. ఇంతలోనే వెన్నెనొప్పితో నియంత్రణ కోల్పోయిన ధోని బరువులతో సహా కిందపడిపోయాడు. వెనుకవైపుకు పడిపోయినా, అదృష్టశావత్తు బరువు ధోనిపై పడలేదు, కాస్త పక్కకు పడ్డాయి. ధోని నడవలేకపోతున్నాడు. నేలపై పాకుతూ లేచేందుకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే స్ట్రెచర్‌పై అతడిని తీసుకెళ్లాల్సి వచ్చింది. దీంతో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో మహేంద్రసింగ్ ధోని అందుబాటులో ఉంటాడో లేదో అనే ఆందోళన. విషయం తెలుసుకున్న చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ హోటల్‌లో ధోని గదిలోకి వెళ్లాడు. ప్రత్యామ్నాయంగా పార్థివ్ పటేల్‌ను పిలిపిస్తానని చెప్పాడు. కానీ ఇందుకు ధోని సమాధానం, మరేం ఫర్వాలేదు నేను ఆడగలను. ఒక కాలు లేకపోయినా, పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో ఆడి తీరుతాను అని ప్రసాద్‌తో చెప్పాడు.

తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ వార్షిక అవార్డుల వేడుకలో ముఖ్య అతిథిగా హాజరైన సెలక్షన్ కమిటీ ఛైర్మెన్ ఎమ్మెస్కే ప్రసాద్ ఏడాది క్రితం జరిగిన సంఘటనను మీడియాతో పంచుకున్నారు. క్రికెట్ పట్ల మహేంద్రసింగ్ ధోనికి ఉన్న అంకితభావం, జాతీయ జట్టును గెలిపించాలనే తపన ఎంతో గొప్పదని ప్రసాద్ ప్రశంసించారు. ' విషయం తెలిసిన నేను హోటల్ రూమ్‌కి వెళ్లాను. ఎలా స్పందించాలో అర్థం కాలేదు. కానీ కంగారు పడొద్దు ఎమ్మెస్కే భాయ్ అన్నాడు. మ్యాచ్‌కు ముందు మధ్యాహ్నం జట్టును ప్రకటించినప్పుడు అతడు తన గదికి పిలిచాడు. ఎందుకు ఆందోళన పడుతున్నావ్? నాకు ఓ కాలు లేకపోయినా, పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో ఆడుతాను' అని చెప్పాడని ప్రసాద్ గుర్తుచేశాడు. ఇదే సమయంలో ద్వితీయ శ్రేణి పట్టణాల్లో వసతుల లేమిపై ప్రసాద్ స్పందించాడు 'ఎలాంటి వసతులు లేని చోటు నుంచి ధోని వచ్చాడు. టి. నటరాజన్ సైతం ముందుగా గుర్తింపు సాధించలేదు. వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నా, నీలో ఉన్న అంతర్గత స్థైర్యమే ముందుకు తీసుకెళ్తుందని' ఎమ్మెస్కే పేర్కొన్నాడు. భారత క్రికెటర్ దినేశ్ కార్తీక్, జి. లక్ష్మణన్‌లు 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డులు దక్కించుకున్నారు. ది హిందూ స్పోర్ట్స్ ఎడిటర్ నిర్మల్ శేఖర్, డెక్కన్ క్రానికల్ రెసిడెంట్ ఎడిటర్ ఆర్. మోహన్‌లకు జీవనకాల సాఫల్య పురస్కారం అందించారు.

అనుకోలేదు ఏనాడూ..



- అర్జున అవార్డుపై హర్మన్‌ప్రీత్

న్యూఢిల్లీ : ప్రపంచకప్ సెమీఫైనల్లో అజేయ 171 ఇన్నింగ్స్‌తో రికార్డులు తిరగరాసిన హర్మన్‌ప్రీత్ కౌర్.. భారత ప్రభుత్వం నుంచి అర్జున పురస్కారం అందుకుంటానని ఎన్నడూ అనుకోలేదని అంటోంది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నేడు రాష్ట్రపతి భవన్‌లో క్రీడా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. 17 మంది అర్జున అవార్డు గ్రహీతల్లో కౌర్ ఒకరు. ' క్రీడాకారులకు, ప్రభుత్వం అందించే ఏ విధమైన గుర్తింపు అయినా ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుంది. అర్జున అవార్డు అందుకోవటం క్రీడాకారుల కల' అని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నది. అర్జున అవార్డు వస్తుందని అనుకోలేదు. నున్ను గుర్తించి అర్జున అవార్డు ఇచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఈ పురస్కారంతో మరింత బాధ్యతగా ఆడతానని కౌర్ పేర్కొన్నది.

క్వార్టర్స్‌లో అమిత్, గౌరవ్

ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్



శివ థాప

హాంబర్గ్ : భారత బాక్సర్లు అమిత్ పంగల్, గౌరవ్ బిధూరిలు క్వార్టర్‌ఫైనల్లోకి చేరుకున్నారు. ప్రీ క్వార్టర్స్‌లో సునాయాస విజయాలు సాధించిన వీరిద్దరూ పతకానికి మరో అడుగు చేరువయ్యారు. 49 కేజీల విభాగంలో ఏడో సీడ్ కార్లోస్ క్విపో (ఈక్వెడార్)ను అమిత్ పంగల్ చిత్తు చేయగా, 56 కేజీల విభాగంలో ఉక్రెయిన్ బాక్సర్ మైకొలాను గౌరవ్ ఓడించాడు. స్టార్ బాక్సర్ వికాస్ కృష్ణన్ రెండో రౌండ్లోనే ఓటమిపాలై నిరాశపరిచాడు, 75 కేజీల విభాగంలో ఆస్ట్రేలియా బాక్సర్ జేసన్ చేతిలో వికాస్ ఓటమిపాలయ్యాడు. డిఫెండింగ్ కాంస్య పతక విజేత, స్టార్ బాక్సర్ శివ థాప అనూహ్యంగా టోర్నీ నుంచి తప్పుకున్నాడు. సోమవారం నుంచి విపరీతమైన జ్వరంతో బాధపడుతున్న శివ బాక్సింగ్ రింగ్‌లోకి దిగకుండానే వెనుదిరిగాడు. దీంతో 60 కేజీల విభాగంలో పతకం ఆశించిన భారత్‌కు నిరాశే మిగిలింది.

మహిళల క్రికెట్‌కు మహార్దశ!

ముంబయి : 2017 ప్రపంచకప్‌లో మిథాలీసేన ప్రదర్శన భారత క్రికెట్‌లో మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఈ నేపథ్యంలోనే భారత్‌లో మహిళల క్రికెట్ అభివృద్ధిపై మహిళా కమిటీ నేడు సమావేశం కానున్నది. పాలకుల కమిటీ సభ్యురాలు డయాన ఎదుల్జీ, భారత కెప్టెన్ మిథాలీరాజ్, సీనియర్ క్రికెటర్ జులన్ గోస్వాములు కమిటీలో సభ్యులు. బీసీసీఐ జనరల్ మేనేజర్ రత్నాకర్ శెట్టి కన్వీనర్. ప్రస్తుతం భారత మహిళల జట్టు షెడ్యూల్ ఖాళీగా ఉంది. దీంతో పలు దేశాల బోర్డులను ద్వైపాక్షిక సిరీస్‌లకు ఆహ్వానించారు. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాల నుంచి సానుకూల స్పందన వచ్చినట్టు సమాచారం. వీటితో పాటు దేశవాళీలో అండర్-19, అండర్-23 టోర్నీలకు తోడు అండర్-16 జోనల్ స్థాయి ఆల్ ఇండియా టోర్నీని నిర్వహించటంపై ఆలోచన చేస్తున్నారు. వీటితో పాటు మహిళలకు ఐపీఎల్‌పైనా కమిటీ చర్చించే అవకాశం కనిపిస్తోంది. పదేండ్ల క్రితం ఐపీఎల్ మొదలైనప్పుడు, ఇంత సక్సెస్‌ఫుల్ అవుతుందని ఎవ్వరూ ఊహించలేదు. మహిళల ఐపీఎల్ విషయంలోనూ అదే జరుగుతుందని అనుకోవచ్చు. ఐపీఎల్ మొదలైతేనే కదా ఆదరణ లభించేదని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

ఢాకాపై బంగ్లా పట్టు

ఆసీస్‌తో తొలి టెస్టు

ఢాకా : ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో బంగ్లాదేశ్ ఆధిక్యంలో కొనసాగుతోంది. స్పిన్నర్లు షకిబ్ అల్ హసన్ (5/68), మెహిదీ హసన్ మిరాజ్ (3/62) విజృంభించటంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 217 పరుగులకే కుప్పకూలింది. దీంతో బంగ్లాదేశ్ 43 పరుగుల విలువైన తొలి ఇన్నింగ్స్ సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 45/1తో నిలిచిన బంగ్లా ప్రస్తుతం 88 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

తమీమ్ ఇక్బాల్ (30), తైజుల్ ఇస్లాం (0) క్రీజులో ఉన్నారు. 144/8తో పీకల్లోతు కష్టాల్లో ఉన్న ఆసీస్‌ను టెయిలెండర్లు ఆస్టన్ ఆగర్ (41), పాట్ కమిన్స్ (25)లు ఆదుకున్నారు. వీరిద్దరు రాణించటంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్ లోటును భారీగా తగ్గించుకోగల్గింది. నేడు మూడో రోజు ఆటలో ఢాకా టెస్టు ఎటువైపో తేలనున్నది!.

ఈ వేలం ఆదేశానికి నిరాకరణ

ప్రస్తుత పద్ధతి బాగుందన్న సీవోఏ
సుబ్రమణియన్ స్వామి పిటిషను కొట్టివేత



న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మీడియా హక్కుల ఈ వేలం నిర్వహణకు బీసీసీఐకి ఆదేశం ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సుమారు రూ. 30 వేల కోట్లతో కూడిన మీడియా హక్కుల వేలానికి భారత క్రికెట్ బోర్డు సాధారణ పద్దతిలోనే బిడ్లు ఆహ్వానించింది. దీనికి సుమారు 20 బడా కంపెనీలు టెండర్లు వేసేందుకు ఆసక్తి చూపాయి. ప్రస్తుతం కొనసాగుతున్న టెండర్ ప్రక్రియ బాగానే ఉన్నదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏ.ఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి ఐపీఎల్ టెండర్ ప్రక్రియను నిలిపివేసి, ఈ వేలం నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కానీ పాలకుల కమిటీ (సీవోఏ) తరపున న్యాయవాది పరాగ్ త్రిపాఠి ప్రస్తుత టెండర్ ప్రక్రియ బాగుందని చెప్పారు. ఈ వేలంతో పోల్చితే ప్రస్తుతం కొనసాగుతున్న టెండర్ ప్రక్రియతో ఏ విధంగా మెరుగైనదో నివేదిక ఇవ్వాలని పాలకుల కమిటీ చైర్మెన్ వినోద్ రాయ్‌ని సుప్రీంకోర్టు ఆదేశించింది. టెలివిజన్, డిజిటల్ మీడియా విభాగాల్లో టెండర్లు ఆహ్వానించగా, సెప్టెంబర్ 4న మీడియా హక్కుల వేలం టెండర్లను పరిశీలించనున్నారు.

వీరేందర్ సెహ్వాగ్ కామెంట్



2019లో ధోని ఆడాలి

న్యూఢిల్లీ : 2019 ప్రపంచకప్ కోసం యువ సైన్యం సిద్ధమవుతోందని, సీనియర్లకు ఇక సెలవు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని విమర్శకులు పదేపదే మహేంద్రసింగ్ ధోనిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. కరీబియన్ పర్యటనలో అందరూ పెవిలియన్‌కు చేరిన వేళ ఆఖరు వరకూ క్రీజులో నిలిచినా, ధోని జట్టును గెలిపించలేకపోయాడు. దీంతో ఆ మ్యాచ్‌లో ధోని ప్రదర్శన విమర్శకులకు ఆయుధంగా మారింది. కానీ శ్రీలంక పర్యటనలో వరుసగా రెండు మ్యాచుల్లోనూ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన మహేంద్రుడు అజేయ ఇన్నింగ్స్‌లతో జట్టును గెలుపు పథాన నడిపాడు. ఈ నేపథ్యంలో మహి మాజీ సహచర ఆటగాడు వీరేందర్ సెహ్వాగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ధోనినీ భర్తీ చేయటం సాధ్యమయ్యే పని కాదు. ప్రస్తుతం జట్టులోని ఆటగాళ్లలో ఎవరూ ధోని పాత్ర పోషించలేరు. రిషబ్ పంత్ వికెట్ కీపర్‌గా, బ్యాట్స్‌మన్‌గా మహి స్థానానికి న్యాయం చేయగలడని అనిపించినా, అందుకు కొంత సమయం పడుతుంది. 2019 ప్రపంచకప్‌లో ధోని కచ్చితంగా ఉండాలి. పల్లెకెలె ప్రదర్శనతో ఇప్పటికైనా ధోని ప్రాధాన్యత తెలిసిరావాలని వీరూ వ్యాఖ్యానించాడు.

ఇంటర్నెట్ డాక్టర్

మానవ చరిత్రలో 1ఋఋఋఎన్నడూ చూడని, నేటి తరానికి దొరికిన అత్యుత్తమ విస్తృత స్థాయి సమాచార వేదికలుగా నిలుస్తోన్న ఇంటర్నెట్ సెర్చ్ ఇంజిన్లు తమ పంథాను మార్చుకుంటున్నాయి. ఒక్క బటన్ నొక్కగానే యూజర్లకు అవసరమైన సమాచారాన్ని అందిస్తోన్న ప్రస్తుత సెర్చ్ వేదికలు.. ఇకపై, యూజర్లు అడిగిన సమాచారం ఇవ్వడమే కాదు.. సదరు యూజర్ వెతుకుతోన్న సమాచారం ఎట్టిదో గ్రహించి.. అవసరమైతే ఆ యూజర్‌కి సలహాలు, సూచనలను ఇచ్చే స్థాయికి చేరుకునే విధంగా అప్ డేట్ అవుతుండటం విశేషం.

వెతికే అంశాలను బట్టి మానసిక స్థితిని చెప్పే సెర్చ్ ఇంజిన్లు

- డిప్రెషన్ అంశంపై గూగుల్ మొట్టమొదటి ప్రాజెక్ట్
- పీహెచ్ క్యూ-9 విధానంలో ప్రశ్నావళి.. సలహాలు, సూచనలు
- 2015 జర్మనీ ఎయిర్‌బస్ 320ఏ దుర్ఘటనే ప్రేరణ?
- సూసైడ్, టెర్రరిజం వంటి అంశాలకూ ఆపాదిస్తే మేలంటున్న విశ్లేషకులు

జై



"డిప్రెషన్" అనే పదాన్ని మీరు ఇకపై గూగుల్ సెర్చ్ ట్యాబ్ లో ఎంటర్ చెయ్యడం ఆలస్యం.. అన్నిటికన్నా ముందుగా ఒక ప్రశ్నావళి రిజల్ట్ మీ స్క్రీన్ పై కనిపించనున్నది. ఆ ప్రశ్నావళి క్లినికల్ బేస్డ్ పీహెచ్ క్యూ-9(పేషెంట్ హెల్త్ క్వశ్చనీర్-9) విధానంతో రూపొందించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా డిప్రెషన్ బారిన పడుతోన్న ప్రజలు క్రమక్రమంగా పెరుగుతుండటం.. తీవ్ర ఒత్తిడికి లోనయ్యి విపత్కర నిర్ణయాలు తీసుకుంటూ.. విధానాల కోసం వివిధ సెర్చ్ ఇంజిన్ లను ఆశ్రయిస్తుండటంతో సదరు దిగ్గజం డిప్రెషన్ బారిన పడిన యూజర్లకు తగిన సలహాలను, సూచనలను ఇచ్చే ఉద్దేశంతో నేషనల్ అలియెన్స్ ఆన్ మెంటల్ ఇల్ నెస్ (ఎన్ఏఎంఐ) సౌజన్యంతో ఈ ప్రాజెక్ట్ కి శ్రీకారం చుట్టింది. ఇక, క్లినికల్ బేస్డ్ పీహెచ్ క్యూ-9 ప్రశ్నావళిలో యూజర్ మానసిక స్థితిని అంచనా వేసే విధంగా ప్రశ్నలు ఉంటాయని.. అలాగే, ఒకవేళ యూజర్ మానసిక కుంగుబాటుకు లోనయినట్టు క్వశ్చనీర్ ఫలితంలో తేలితే, సరైన సూచనలతో వైద్యుల్ని సంప్రదించేలా సలహాలు ఇచ్చే విధంగా ప్రాజెక్ట్ ను రూపొందించామని గూగుల్ ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్ ను ముందుగా అమెరికాలో ప్రయోగించనున్నారు.

ఆ ఘటనే ప్రేరణ?: ప్రస్తుతం గూగుల్ తీసుకొస్తున్న క్లినికల్ బేస్డ్ పీహెచ్‌క్యూ ప్రాజెక్ట్ ఐడియాకు జర్మనీ విమానం (ఎయిర్‌బస్ 320ఏ) ఘటన ప్రేరణ కావొచ్చని కొందరు వాదిస్తున్నారు. 2015 మార్చి 24వ తేదీన ఫ్రాన్స్ లోని ఆల్ప్ పర్వతాల్లో జర్మనీ విమానం (ఎయిర్‌బస్ 320ఏ) కూలి 150 మంది మరణించిన సంగతి తెలిసిందే! ఐతే, విమానంలోని కో పైలట్ ఆండ్రియాస్ లూబిడ్జ్ వల్లే ఈ దుర్ఘటన జరిగిందని, గర్ల్ ఫ్రెండ్ వివాదంతో మానసికంగా కుంగిపోయిన లూబిడ్జ్ ప్రమాదానికి వారం రోజుల ముందు నుంచే "ఎలా ఆత్మహత్య చేసుకోవాలి? విమానంలోని కాక్‌పిట్ డోర్లు ఎలా ఉంటాయి. దాని భద్రతా వ్యవస్థ ఎట్టిది?" అనే అంశాలపై ఇంటర్నెట్‌లో తీవ్రంగా సెర్చ్ చేసినట్టు, అతడి మానసిక స్థితిని అంచనా వేయకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని అప్పట్లో పెద్ద దుమారమే రేగింది.



డిప్రెషన్‌లో ఉన్నామన్నది తెలియట్లేదు!

రక్తంలో వేడి, ఆలోచనల్లో వేగం, ప్రవర్తనలో దూకుడు గల నేటితరం.. మారుతోన్న జీవన శైలి, ఉరుకులు పరుగుల జీవితం, పని ఒత్తిడి, యాంత్రిక జీవనం, కుటుంబ బంధాల్లో మార్పులు తదితర కారణాలతో డిప్రెషన్ బారిన పడుతున్నట్టు పలు అధ్యయనాల్లో ఇప్పటికే వెల్లడైంది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ లెక్కల ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా సుమారు ముప్పై కోట్ల మంది ప్రజలు డిప్రెషన్ మూలంగా మానసికంగా, శారీరకంగా జబ్బుల బారిన పడుతున్నట్టు తేలింది. గత దశాబ్ద కాలంలో (2005 నుంచి 2015 వరకు) మానసిక కుంగుబాటుకు లోనవుతున్న వారి సంఖ్య 18 శాతం పెరగడం ఆందోళనను కలుగజేస్తోన్నదని డబ్ల్యూహెచ్ఓ సైతం విచారం వ్యక్తం చేసింది. డిప్రెషన్ బారిన పడిన వ్యక్తుల్లో చాలావరకు తాము కుంగుబాటుకు లోనయ్యామో లేదోనన్న మీమాంసలో ఉంటూ సరైన సమయంలో చికిత్స తీసుకోవట్లేదని, తత్ఫలితంగా తీవ్ర మానసిక వేదనకు లోనయ్యి అంతిమంగా ప్రాణాలను తీసుకుంటున్నారని నిపుణులు పేర్కొంటున్నారు.

ఇప్పుడు గూగుల్ ప్రయోగాత్మకంగా తెచ్చిన ఈ టెక్నాలజీ ప్రశ్నావళి కొంతలో కొంతైనా డిప్రెషన్ బాధితులకు ఉపయోగకరంగా ఉండనున్నట్టు ఆశిస్తున్నామని.. ఇటువంటి సాంకేతికతను సూసైడ్, టెర్రరిజం వంటి విపత్కర అంశాలకు కూడా వర్తింపజేస్తూ.. అన్ని సెర్చ్ వేదికల్లో ప్రవేశపెడితే ఉపయుక్తంగా ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.